ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

fb.com/vaartha Digital

ట్రంప్ కొత్త సుంకాలపై కోర్టుకెక్కిన 25 రాష్ట్రాలు

ఉదయనిధి స్టాలిన్ అరెస్టు, విడుదల

5

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

5-8-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 186 పేజీలు: 10+4 వెల: 6.50




## ఇథనాల్ పెట్రోల్‌పై ఆందోళన వద్దు

### పూర్తిస్థాయిలో తనిఖీలు

### 87 వేల బంక్‌లలో రోజూ దాదాపు 12 సార్లు పరీక్షలు: కేంద్రం వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 4:** ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ నాణ్యత, కలుషితానికి సంబంధించిన ఆందోళనలపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయు శాఖ సమగ్ర వివరణ ఇచ్చింది. దేశవ్యాప్తంగా ఇంధన సరఫరా వ్యవస్థలో అమలు చేస్తున్న కఠినమైన నాణ్యత నియంత్రణ చర్యలను మంగళవారం కేంద్రం వెల్లడించింది. వాహన యజమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇంధన నాణ్యతను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నాయని స్పష్టం చేసింది. ఇప్పటికే అమల్లో ఉన్న పరీక్షా విధానాలతో పాటు.. ఇంధనంలో కల్తీ, కలుషితాన్ని అడ్డుకునేందుకు అదనపు తనిఖీలను కూడా చేపట్టినట్లు పెట్రోలియం శాఖ తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న 87 వేలకుపైగా పెట్రోల్ బంకుల్లో రోజుకు 8 నుంచి 12 సార్లు ఇంధనంలోకి నీరు చేరిందా లేదా అనే పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. క్లోరైడ్, సల్ఫైడ్ కలుషితాన్ని గుర్తించేందుకు ఇప్పటివరకు 2 వేలకుపైగా ఇంధన నమూనాలను ప్రత్యేకంగా పరీక్షించినట్లు పేర్కొంది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు కేవలం రెండు ప్రాంతాల్లో మాత్రమే క్లోరైడ్ కలుషితానికి సంబంధించిన వేర్వేరు ఘటనలు గుర్తించినట్లు >>2

## 16న ఒకే రోజు అసెంబ్లీ

### 17 నుంచి సెప్టెంబరు 10 దాకా సిఎం విదేశీ పర్యటనలు

### ఢిల్లీ వెళ్లిన సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు4:** రాష్ట్రానికి పెట్టుబడులే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలకు వెళ్లనున్నారు. ఈనెల 17 నుంచి సెప్టెంబరు 10 మధ్య నాలుగు దేశాల్లో పర్యటించేందుకు ఏర్పాట్లు చేశారు. యూకే, అమెరికా, జర్మనీ, చైనా దేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి బృందం పర్యటించనుంది. పలువురు పారిశ్రామికవేత్తలతో సమావేశాలు కానున్నారు. ఫ్యూచర్‌సిటీలో పెట్టుబడులతో పాటు రాష్ట్రంలో విదేశీ యూనివర్సిటీలు, క్రీడలు, శిక్షణసంస్థల భాగస్వామ్యంపై చర్చించనున్నారు. ఈనెల 16న ప్రత్యేక అసెంబ్లీ >>2

# క్రమశిక్షణకు శిక్షలా?




### రాజ్యాంగం ప్రకారం పనిచేసిన డిసిపి ఆనంద్‌బాబును శిక్షించిన రేవంత్ సర్కార్

### అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారిపై ఫిర్యాదు రాజ్యాంగ హక్కు

### రాహుల్ ప్రోద్భలంతోనే డిసిపి బదిలీ

### సింగరేణికి మూడు కోల్‌బ్లాక్‌లు కేటాయించాం

### ఢిల్లీలో మీడియాతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు4:** ప్రధానమంత్రి నరేంద్రమోడీపై అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారిపై ఫిర్యాదు చేయడం రాజ్యాంగ హక్కు అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మెటాపై కేసు నమోదు చేసిన డీసీపీ ఆనంద్ బాబుని తెలంగాణ ప్రభుత్వం బదిలీ చేసిందని పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాజ్యాంగం ప్రకారం పని చేసిన ఆ అధికారిని సీఎం రేవంత్‌రెడ్డి శిక్షించారని తెలిపారు. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు రేవంత్‌రెడ్డి ఆ డీసీపీని ట్రాన్స్‌ఫర్ చేశారని ఆరోపించారు. చట్టప్రకారం నడిచే అధికారులపై సీఎం వేటు వేస్తున్నారని ధ్వజమెత్తారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఫోన్‌ట్యాపింగ్ చేసి అధికార దుర్వినియోగం చేసిందని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం అదే తరహాలో వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. భారత దేశ ప్రజాస్వామ్య వ్యవస్థపై సోషల్ మీడియా సంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ మద్దతుతో ఉన్న టీవీకే ప్రభుత్వంలో... సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ప్రతిపక్ష నేతను అరెస్ట్ చేశారని తెలిపారు. మరి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడ కేసులు నమోదు చేసిన అధికారులను శిక్షిస్తోందని అన్నారు. రేపు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కూడా ఇలానే వదిలేస్తారా..? అని ప్రశ్నించారు. ఇటీవల ఫేస్‌బుక్‌లో, ఇన్‌స్టాగ్రాంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారిని లక్ష్యంగా చేసుకుని, అభ్యంతరకరంగా మార్ఫింగ్ చేస్తూ పోస్టులు చేశారు. వారి తల్లిగారిపై కూడా నీచాతినీచంగా మాట్లాడుతూ.. అమానవీయంగా పోస్టులు పెట్టారు. దీనిపై బీజేపీ నేత సాయి కిరణ్.. సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అభ్యంతరకర పోస్టులను పెట్టారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని >>2



మంగళవారం హైదరాబాద్‌లో డిజిపి, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష చేస్తున్న సిఎం రేవంత్

## పోలీసు పరీక్షలపై ప్రత్యేక నిఘా

### నియామకాలు పకడ్బందీగా జరగాలి

### అధికారులకు సిఎం రేవంత్ ఆదేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు4:** పోలీస్ ఉద్యోగ నియామకాల భర్తీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం 7,437 పోస్టుల భర్తీ ప్రక్రియపై నిఘా వర్గాలు ముఖ్యమంత్రికి కీలక సమాచారం అందించాయి. నియామక ప్రక్రియకు ఎలాగైనా భంగం కలిగించాలని కొన్ని రాజకీయ పార్టీలతో పాటు ఇతర శక్తులు (వెస్టెడ్ ఇంట్రెస్ట్స్) ప్రయత్నిస్తున్నట్లు నిఘా వర్గాలు సీఎం దృష్టికి తీసుకెళ్లాయి. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు పోలీస్ ఉన్నతాధికారులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇటీవల విడుదలైన నోటిఫికేషన్‌కు సంబంధించి నియామక ప్రక్రియను పకడ్బందీగా, పూర్తి పాదర్శకంగా నిర్వహించాలని సీఎం ఆదేశించారు. నియమ నిబంధనలను అనుసరించి ఎలాంటి లోపాలకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. ప్రశ్నపత్రాల తయారీ, ముద్రణ, రవాణాతో పాటు అన్ని ప్రక్రియలలో అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్ష కేంద్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ముఖ్యంగా కోచింగ్ సెంటర్స్‌పై ప్రత్యేకనిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. నియామక పరీక్షల నిర్వహణపై సోషల్ >>2

## 'టెట్' గడువు 2028 ఆగస్టు 31 దాకా

### -కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

**న్యూఢిల్లీ, ఆగస్టు 4:** విద్యారంగానికి సంబంధించి రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితా పరిధిలోని అంశమని, ఉపాధ్యాయుల నియామకాలు, వారి సేవా నిబంధనలు, విధుల కేటాయింపు వంటి అంశాలు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పరిపాలనల పరిధిలో ఉంటాయని కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. 2013కు ముందు నియమితులైన, టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) తప్పనిసరి నిబంధన వల్ల ప్రభావితమయ్యే ఉపాధ్యాయుల



వివరాలను సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పరిపాలనలే నిర్వహిస్తున్నాయని వెల్లడించారు. ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం, 2009లోని సెక్షన్ 23 ప్రకారం నిర్దేశించిన కనీస అర్హతల్లో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) కూడా ఒకటని, ఆ చట్టం పరిధిలోకి వచ్చే పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా నియామకానికి టెట్ అర్హత తప్పనిసరి అని భారత సుప్రీంకోర్టు 2025 సెప్టెంబర్ 1న ఇచ్చిన తీర్పులో స్పష్టం చేసినట్లు మంత్రి తెలిపారు. అనంతరం ఈ అంశంపై దాఖలైన రివ్యూ పిటిషన్లను పరిష్కరిస్తూ సుప్రీంకోర్టు 2026 మే 29న ఇచ్చిన తీర్పులో టెట్‌అర్హతను పొందేందుకు నిర్దేశించిన >>2



టి-ఫైబర్ సమీక్షలో మంత్రి శ్రీధర్‌బాబు, సిఎస్

## ప్రభుత్వ ఆఫీసులకు టి-ఫైబర్ ఇంటర్నెట్

### ఇంటింటికి ఇంటర్నెట్ ప్రక్రియ వేగిరం: మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు4:** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెప్టెంబర్ 1వ తేదీ నుంచి కేవలం టీ-ఫైబర్ ద్వారానే ఇంటర్నెట్ సేవలు అందించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. ఆ గడువు దాటిన తర్వాత ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంటర్నెట్ సేవల నిమిత్తం ప్రైవేట్ ఆపరేటర్లకు బిల్లులు చెల్లించొద్దని స్పష్టం చేశారు. మంగళవారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో 'టీ - >>2

# డిఫాల్ట్ మిల్లర్లపై కొరడా

### వారి నుంచి ప్రతి రూపాయి, గింజను వసూలు చేస్తాం

### సిఎంఆర్‌పై ఆడిట్.. నిజాయితీ మిల్లర్లకు పూర్తి రక్షణ

### నీటి పారుదల శాఖలో సమగ్ర సంస్కరణలు: మంత్రి ఉత్తమ్



మంగళవారం హైదరాబాద్‌లో అధికారులతో సమీక్షలో మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, ఆగస్టు 4,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటైన తరువాత తొలిసారిగా కస్టమ్ మిల్లింగ్ రైస్ వ్యవస్థపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. మిల్లర్లవారిగా 2014 నుంచి 2026 ధాన్యం సేకరణ, బియ్యం అప్పగింత, డిఫాల్ట్‌లు, పెండింగ్ బకాయిలు, రికవరీలు, విజిలెన్స్ దర్యాప్తులు, న్యాయపరమైన చర్యలు, అమలు వ్యవస్థలను క్షుణ్ణంగా సమీక్షించి, భవిష్యత్తులో ఇలాంటి లోపాలకు తావులేకుండా సమగ్ర సంస్కరణలు చేపట్టాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం శిక్షలు విధించడం మాత్రమే కాదని, ప్రజల సొమ్ముతో కొనుగోలు చేసిన ప్రభుత్వ ధాన్యాన్ని, ప్రభుత్వానికి రావలసిన ప్రతి రూపాయిని పూర్తిగా తిరిగి రాబట్టడమేనని స్పష్టం చేశారు. అధికారులు వివరించిన మేరకు పెండింగ్ బకాయిల్లో ఎక్కువ భాగం గత ప్రభుత్వాల కాలంలో పేరుకుపోయినవేనని, ప్రస్తుతం వాటి రికవరీకే అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. నగదు రూపంలో చెల్లింపులు, ధాన్యం తిరిగి అప్పగింత, నాణ్యమైన బియ్యం సరఫరా వంటి అన్ని మార్గాల ద్వారా గరిష్ఠ స్థాయిలో రికవరీలు సాధించే చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. డిఫాల్ట్ మిల్లర్లకు ప్రభుత్వం గతంలో ఇచ్చిన పరిమిత గడువు కారణంగా ఇప్పటికే గణనీయమైన రికవరీలు జరిగాయని అధికారులు తెలిపారు. మిగిలిన మొండి బకాయిలను మిల్లర్ వారీగా గడువు నిర్ధారించి ప్రత్యేక రికవరీ కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మంత్రి ఆదేశించారు. "ప్రతి గింజ ప్రభుత్వ ఆస్తే' అది ప్రజల సొమ్ముతో కొనుగోలు చేసిన ఆస్తి. అందులో ఒక్క గింజ దారి మళ్లినా అది తెలంగాణ ప్రజలకు నష్టం. ప్రభుత్వానికి >>2

## వాము, జీలకర్ర, లవంగాలు అన్నీ కల్తీ!

### భారీగా పట్టుబడిన మసాలా దినుసులు, ఆహార పదార్థాలు

### ముగ్గురు వ్యాపారుల అరెస్టు

### కల్తీముఠా గుట్టురట్టుకు సిట్: కొత్వాల్ సజ్జనార్



మంగళవారం హైదరాబాద్‌లో పట్టుబడిన కల్తీ మసాల దినుసులు, ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న సిపి సజ్జనార్

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో మరోసారి భారీగా మసాల దినుసులు, ఆహార వస్తువులు పట్టుబడ్డాయి. ఈ సందర్భం గా వీటిని తయారు చేస్తున్న ముగ్గురు వ్యాపారులను పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీం (హెచ్..ఫాస్ట్), బల్దియా అధికారులు సంయుక్తంగా దాడులు చేసి ఈ గోల్‌మాల్‌ను రట్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను హైదరాబాద్ పోలీసు కమిషనర్ వి.సి సజ్జన్నర్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. జంటనగరాలలో కల్తీ ఆహార వస్తువుల తయారీ, విక్రయాలపై హెచ్.. ఫాస్ట్, బల్దియా సంయుక్తంగా నిఘా వుంచి, వరుసగా దాడులు చేస్తుండడం తెలిసిందే. ఈ క్రమంలో కాటేదాన్, బాలాపూర్ పరిధుల్లో మూడు ప్రాంతా లలో కల్తీ మసలా దినుసులు, ఇతర ఆహార వస్తువులు, ఇంకొన్ని ఉత్పత్తులు తయారవుతున్నట్లు సమాచారం అందింది. ఈసమాచారం మేరకు సోమవారం రాత్రి హెచ్.. ఫాస్ట్, బల్దియా సిబ్బంది సంయుక్తంగా దాడి చేశారు. దాడుల సందర్భంగా 7920 కిలోల కల్తీ వాము, 6700 కిలోల జీలకర్ర, 550 కిలోల లవాంగాలు, 2280 కిలోల సాజీర, 540 కిలోల సోంపు, 4960 కిలోల ఆవాలు, 65 వేల కిలోల జీలకర్ర పొడి, 13,460 కిలోల మెంతులు, పదివేలకిలోల తెల్లనువ్వులు, 90 కిలోల షైనింగ్ పౌడర్, 12 లీటర్ల రైస్ బ్రాన్ ఆయిల్, 1.5 కిలోల సింథటిక్, ఫ్యాబ్రిక్ డై, మూడు రోలింగ్ యంత్రాలు పట్టుబడ్డాయి. ఈ సందర్భంగా వీటిని తయారు చేస్తున్న కాటేదాన్‌కు చెందిన రాహుల్ బాటి, బేగంబజార్‌కు చెందిన విశాల్ పన్వార్, దులీచంద్ కచ్చావాలు పట్టుబడ్డారు. ఈ ఘటనపై సజ్జన్నర్ మాట్లాడుతూ ఆహార పదార్థాలలో పారిశ్రా మిక రంగులు, సింథటిక్ రంగులు, టాల్కం పౌడర్ వంటివి కలుపుతున్నారని, దీనివల్ల వీటిని వాడుతున్న వారు తీవ్ర అనారోగ్యం పాలవుతు న్నారని తెలిపారు. కాలేయం, మూత్ర పిండాల సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన తెలిపారు. ఆహార పదార్థాలలో రసాయనాలు కలపడం వల్ల క్యాన్సర్ సోకే ప్రమాదం ఎక్కువగా వుందని ఆయన వెల్లడించారు. కడుపునొప్పి, అలెర్జి, జీర్ణకోశ, చర్మ వ్యాధులు, నరాలు దెబ్బతినే ప్ర మాదం వుందని ఆయన అన్నారు. దీంతో పాటు శరీరం >>2

## రెండు రోజులు భారీ వర్ష సూచన

**హైదరాబాద్, అగస్టు 4, ప్రభాతవార్త:** సముద్రమట్టం వద్ద ఉన్న రుతుపవన ద్రోణి ప్రస్తుతం బికనీర్, ఢిల్లీ, లక్నో, పాట్నా మీదుగా మణిపూర్ వైపు కొనసాగుతూ సముద్రమట్టానికి 0.9 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉన్నదని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది ఉత్తర అంతర్గత కర్ణాటక నుంచి దక్షిణ



అంతర్గత కర్ణాటక, కేరళ, తమిళనాడు మీదుగా కొమెరిన్ వరకు సముద్రమట్టానికి 5.8 కి.మీ ఎత్తులో ద్రోణి బలహీనపడిందని తెలిపింది. దీని ప్రభావంతో రాబోయే మూడు రోజులపాటు తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. రానున్న రెండు రోజులు హైదరాబాద్‌తో సహా రాష్ట్రంలోని పలు >>2



## ఫోన్ ట్యాపింగ్‌పై అదనపు ఛార్జిషీటు!

### కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావుల పేర్లు చేర్చే అవకాశం.. కేసులో కీలక పరిణామం!

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసు లో అదనపు ఛార్జిషీట్‌ను దాఖలు చేసేందుకు సిట్ సన్నద్ధమవుతోంది. 2024 జూన్ 11వ తేదీన ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి మొదటి ఛార్జిషీట్ దాఖలు చేయడం తెలిసిందే. అప్పటి వరకు వెలుగు చూసిన వివరాలు, అరెస్టయిన నిందితులు, పరారీలో వున్న వారి వివరాలతో సి ట్ అధికారులు నాంపల్లి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయడం విదితమే. దీని తరువాత చోటుచేసుకున్న అనేక పరిణామాల నేపథ్యంలో ఈ నెల 15వ తేదీలోగా అదనపు ఛార్జిషీట్‌ను దాఖలు చేయాలని సిట్ అధికారులు నిర్ణయించారని తెలిసింది. తాజా ఛార్జిషీట్‌లో కెసిఆర్, కెటిఆర్, హరీష్ రావుల పేర్లు చేరుస్తున్నట్లు సమాచారం. రాష్ట్ర రాజకీయాల్లో ఫోన్ ట్యాపింగ్ సంచలనం రేపడంతో పాటు పోలీసు శాఖలో దుమారం రేపింది. 2024 ఫిబ్రవరి నెలలో వెలుగు చూసి న ఈ కేసుకు సంబంధించి అదే ఏడాది మార్చి నెల పదవ తేదీన ఎఫ్ఐఆర్ నమోదు కాగా మొదట ఎస్ఐబిలో పనిచేసిన అప్పటి డిఎస్పి దుగ్యాల ప్రణీత్ రావు అరెస్టయ్యారు. అనంతరం అతను ఇచ్చిన సమాచారం మేరకు అప్పట్లో భూపాలపల్లి జిల్లా అదనపు ఎస్పిగా వున్న భుజం గరావు, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ వింగ్ లో అదనపు ఎస్పిగా వున్న తిరుపతన్నలను అరెస్టు చేశారు. దీని తరువాత వీరిచ్చిన సమాచారం ఆధారంగా హైదరాబాద్ సిటీ టాస్క్‌ఫోర్స్ మాజీ డిసిపి రాధాకిషన్ >>2



మంగళవారం గువాహతిలో నడుములోతు నీటిలో రిక్షా తొక్కుతున్న దృశ్యం

## 'టెట్' గడువు 2028 ఆగస్టు 31 దాకా

>> గడువును 2027 ఆగస్టు 31 నుంచి 2028 ఆగస్టు 31 వరకు పొడిగించిందన్నారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణత సాధించేందుకు తగిన అవకాశాలు కల్పించే ఉద్దేశంతో, సంబంధిత ప్రభుత్వాలు మరియు అధికార యంత్రాంగం ప్రతి సంవత్సరం కనీసం రెండుసార్లు, సుమారు ఆరు నెలల వ్యవధిలో టెట్ పరీక్ష నిర్వహించేందుకు ప్రయత్నించాలని సుప్రీంకోర్టు తన తాజా తీర్పులో సూచించినట్లు మంత్రి వివరించారు సుప్రీం ఉత్తర్వులను అనుసరించి ఇకపై టీచర్ నియామకాలకు టెట్ తప్పనిసరి చేస్తున్నట్లు మంత్రి ప్రహ్లాద్‌జోషి వివరించారు.

## పరీక్షలపై ప్రత్యేక నిఘా

>> మీడియా, ఇతర మాధ్యమాల్లో ఎలాంటి దుష్ప్రచారం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని మోసం చేసే దళారులు, నకిలీ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా అకౌంట్లపై సైబర్ క్రైమ్ విభాగంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణ పూర్తయ్యే వరకు సైబర్ సెక్యూరిటీ, ఇంటలీజెన్స్ విభాగం పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.

ఈ అత్యవసర సమావేశంలో సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, డీజీపీ సీవీ ఆనంద్, హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖా గోయల్, పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్ వి.వి.శ్రీనివాస రావు, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు.

## ఒకే రోజు అసెంబ్లీ

>> సమావేశం నిర్వహించి 21ఏళ్లకే చట్టసభలకు పోటీ చేసే అవకాశం ఉండాలంటూ తీర్మానం చేసే అవకాశం ఉంది.

కాగా, మంగళవారం రాత్రి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లారు. బుధవారం అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌తో పాటు పలువురు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు అనుమతులు, నిధులపై చర్చించనున్నారు. కాగా, తెలంగాణలో ప్రపంచస్థాయి విద్యా ప్రమాణాలను తీసుకురావడం, యువతలో అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలను పెంపొందించడం, క్రీడారంగాన్ని మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన చేపడుతున్నారు. హైదరాబాద్ నుంచి ముందుగా యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే)కు వెడతారు. ఈనెల 20న అక్కడ అక్బరుద్దీన్ ఓవైసి కుమార్తె వివాహానికి హాజరవుతారు. తర్వాత అక్కడి నుంచి అమెరికాకు సీఎం వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి సలహాదారు కె.రామకృష్ణారావుతో పాటు పలువురు ఉన్నతాధికారులు కూడా పాల్గొనే అవకాశం ఉంది. ఆయా దేశాల్లో ప్రభుత్వ, విద్యా, క్రీడా రంగాలకు చెందిన ప్రముఖులతో సమావేశాలు నిర్వహించి తెలంగాణ అభివృద్ధికి అవసరమైన సహకారంపై చర్చించనున్నారు. యూకే, అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ముఖ్యమంత్రి సందర్శించనున్నారు.

తెలంగాణలో ఉన్నత విద్యను అంతర్జాతీయ ప్రమాణాలకు తీసుకెళ్లే దిశగా విద్యాసంస్థల ప్రతినిధులతో సమావేశమై పరస్పర అవగాహన ఒప్పందాలు (ఎంఓయు) కుదుర్చుకునే అవకాశాలున్నాయి. ఇప్పటికే కొన్ని విదేశీ విశ్వవిద్యాలయాలు తెలంగాణలో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో, మరిన్ని ప్రముఖ సంస్థలను రాష్ట్రానికి ఆహ్వానించే ప్రయత్నాలు జరగనున్నాయి. రాష్ట్రంలో ఇప్పటికే స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటైన నేపథ్యంలో, అంతర్జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థలను తెలంగాణకు తీసుకురావడంపై కూడా ఈ పర్యటనలో ప్రత్యేక దృష్టి సారించనున్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు ఆధునిక శిక్షణ అందించే విధంగా విదేశీ సంస్థలతో భాగస్వామ్యం కుదుర్చుకోవడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

తెలంగాణ యువత ఒలింపిక్స్ సహా అంతర్జాతీయ క్రీడల్లో పతకాలు సాధించాలని రేవంత్ రెడ్డి పలు మార్లు ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో యూకే, అమెరికాలోని ప్రముఖ క్రీడా అకాడమీలు, శిక్షణా కేంద్రాలను సందర్శించి అక్కడ అమలవుతున్న విధానాలను అధ్యయనం చేయనున్నారు. రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా మౌలిక వసతులు, శిక్షణా వ్యవస్థలను అభివృద్ధి చేసే అంశాలపై నిపుణులతో చర్చించే అవకాశముంది.

ఈ విదేశీ పర్యటన ద్వారా విద్య, నైపుణ్యాభివృద్ధి, క్రీడా రంగాల్లో తెలంగాణకు ప్రపంచస్థాయి భాగస్వామ్యాలను తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది. అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు, ప్రముఖ విశ్వవిద్యాలయాల సహకారం, ఆధునిక శిక్షణా విధానాల అమలు ద్వారా రాష్ట్ర యువతకు కొత్త అవకాశాలు కల్పించడంతో తెలంగాణకు విద్యా,నైపుణ్యాలు,క్రీడల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఈ పర్యటన కీలకంగా మారే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

## భారీ వర్ష సూచన

>> జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. పలు ప్రాంతాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో రానున్న రెండు రోజులు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. దీంతో అధికారులు అప్రమత్తం అయ్యారు.

## వాము, జీలకర్ర, లవంగాలు అన్నీ కల్తీ!

>> రోగ నిరోధక శక్తి కోల్పోతుందని సజ్జన్నర్ తెలిపారు. జంట నగరాలలో కల్తీ ఆహార వ స్తువులు లేకుండా చేసేందుకు హెచ్..ఫాస్ట్‌ను ఏర్పాటు చేశామని, ఈ విభాగం బల్దియాతో కలిసి అద్భుతంగా పనిచేస్తోందని ఆయన తెలిపారు. ఈ విభాగం ప్రారంభమై ఇప్పటికీ 140 రోజులయ్యిందని, ఇప్పటివరకు 659 చోట్ల దాడులు చేశామని, 202 కేసులు నమోదయ్యాయని, 246 టన్నుల కల్తీ ఆహార వస్తువులను పట్టుకున్నామని ఆయన తెలిపారు. దీంతో పాటు కల్తీ ఆహార వస్తువులపై చర్యల కోసం 232 కేసులను బల్దియాకు బదిలీ చేశామని, దీని తరువాత 46 నకిలీ పన్నీర్ విక్రయ కేంద్రాలు, 83 కల్తీ నెయ్యి విక్రయాల కేంద్రాల గుట్టు రట్టయ్యిందని ఆ యన తెలిపారు. కల్తీ వస్తువులకు సంబంధించి ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులకు వెంటనే స్పందిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ విషయ ంలో ప్రజలు 8712661212 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన కోరారు. కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారీలో పెయింట్ తయారీలో వాడే టై టానియం ఆక్సైడ్, ఎసిటిక్ యాసిడ్ వంటి రసాయనాలు వాడుతున్నారని ఆయన తెలిపారు. ఇప్పటివరకు 27 టన్నుల కల్తీ అల్లం, వెల్లులి పే స్ట్‌ను, 12 టన్నుల కుళ్లిన కోడి మాంసాన్ని, నిలువ వుంచిన 60 టన్నుల చికెన్ వ్యర్థాలను జప్తు చేశామని ఆయన అన్నారు. పళ్లను సహజం గా కాకుండా కృత్రిమంగా మగ్గేందుకు రసయాలను వాడుతుండగా వాటిని కూడా జప్తు చేశామని ఆయన తెలిపారు. ప్రజారోగ్యం విషయంలో రాజీపడే సమస్యేలేదని ఆయన హెచ్చరించారు. వ్యాపారులు కచ్చితంగా నాణ్యమైన వస్తువులనే అమ్మాలని, లేకుంటే తీవ్ర పరిణామాలను ఎదు ర్కొవాల్సి వుంటుందని ఆయన వెల్లడించారు. ప్రజలు కూడా లైసెన్స్ కలిగిన వ్యాపారుల నుంచే వస్తువులను కొనాలని, కొనే సమయంలో అ నుమానం వుంటే నిలదీయాలని ఆయన తెలిపారు. భారీ ఎత్తున కల్తీ వస్తువులను పట్టుకున్న పోలీసులను, బల్దియా సిబ్బందిని ఆయన అభిన ందించారు. తాజాగా వెలుగుచూసిన కల్తీ ఆహార వస్తువుల తయారీ వెనుక వున్న వారిని పట్టుకునేందుకు సిట్ ఏర్పాటు చేస్తామని కమిషనర్ తె లిపారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల అదనపు సిపి తఫ్సీర్ ఇక్బాల్, ఎస్‌బి జాయింట్ సిపి విజయ్ కుమార్, టాస్క్‌ఫోర్స్ డిసిపి వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

**05-08-2026, బుధవారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**ఆషాఢ మాసం, దక్షిణాయణం,**
**గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేష కార్తె,**
తి.సప్తమి రా.8.38 న.అశ్వని రా.9.14
వ.సా.5.20-సా.6.54
దు.ఉ.11.47-మ.12.38
రాహు. మ.12.00-మ.1.30
శుభ ఉ.6.00-ఉ.7.00

## వార్తాఫలం

**మేషం :** దూరప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. వస్తులాభం. సోదరుల కలయిక.

**వృషభం :** ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి. శత్రువులుసైతం మిత్రులుగా మారతారు. నభలలో పాల్గుంటారు.

**మిథునం :** మాటల చాతుర్యంతో ఎదుటి వారిని ఆకట్టుకొనే పనులు పూర్తి చేస్తారు. వస్త్రాలు కొనుగోలు.

**కర్కాటకం :** సంతాన విషయమై ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తారు. క్రమశిక్షణ పాటించడం వలన లాభ పడతారు.

**సింహం :** మీలోని ప్రతిభా పాటవాలు వెలుగు చూసే దిశగా ప్రయాణం సాగిస్తారు. సంఘ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**కన్య :** ఒకానొక రహస్య సమాచారం తెలుసుకుంటారు. జీవిత భాగస్వామితో చర్చలు జరిపి కొన్ని ముఖ్య నిర్ణయాలు చేస్తారు.

**తుల :** విధుల నిర్వహణలో, వ్యాపార రంగాలలో అభివృద్ధిని సాధిస్తారు. ఆరాధనలు, యాత్రలు సంభవము.

**వృశ్చికం :** దూర ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. దీర్ఘ కాలిక సమస్యలు తీరుతాయి.

**ధనుస్సు :** మాట పట్టింపులతో ఎంతో కాలంగా దూరమైన సన్నిహితులను కలుసుకుంటారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

**మకరం :** ముఖ్య కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. వస్త్రాలాభం.

**కుంభం :** సంఘంలోని పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. స్వల్ప ధన లాభం. వాహన సౌలభ్యం.

**మీనం :** చిన్ననాటి మిత్రుల నుండి కీలక సమాచారం తెలుసుకుంటారు. రాజకీయ పరపతి పెరుగుతుంది. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# డిఫాల్ట్ మిల్లర్లపై కొరడా

>> రావలసిన ఒక్క టన్ను బియ్యం తగ్గినా ప్రజా పంపిణీ వ్యవస్థ బలహీనపడుతుందనీ మంత్రి అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని అత్యధిక మంది రైస్ మిల్లర్లు నిజాయితీగా ప్రభుత్వంతో కలిసి పనిచేశారని, అయితే కొద్దిమంది మాత్రమే బియ్యం అప్పగింతలో జాప్యం చేయడం, ప్రభుత్వ ధాన్యాన్ని దారి మళ్లించడం, ఒప్పందాలను ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్ప డ్డారని అన్నారు. వీరిపై విజిలెన్స్ దాడులు కొనసాగు తాయనీ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లుల్లో భౌతిక తనిఖీలు, స్టాక్‌ల ధృవీకరణ, స్టాక్ రిజిస్టర్ల పరిశీలన, కొనుగోలు రికార్డులతో సరిపోల్చడం, ప్రభుత్వ ధాన్యం లేదా బియ్యం అక్రమ మళ్లింపులపై లోతైన విచారణ కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశించింది. మోసం, ప్రభుత్వ ఆస్తి దుర్వినియోగం, నమ్మకద్రోహం వంటి నేరాలకు ఆధారాలు లభించిన ప్రతి సందర్భంలో క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు, పదేపదే డిఫాల్ట్ చేస్తున్న మిల్లర్లపై బ్లాక్‌లిస్టింగ్ సహా కఠిన పరిపాలనా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. సిఎంఆర్ వ్యవస్థలో సమూల సంస్కరణలుగత డిఫాల్ట్‌ల సమీక్షతో పాటు భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా సిఎంఆర్ నియంత్రణ ఉత్తర్వులను పూర్తిగా సవరించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందనీ అన్నారు. ఒప్పంద నిబంధనలను మరింత కఠినతరం చేయడం, బ్యాంకు గ్యారంటీలను బలోపేతం చేయడం, డిఫాల్ట్‌లపై కఠిన శిక్షలు, అమలు వ్యవస్థను మరింత సమర్థవంతంగా రూపొందించడం వంటి అంశాలను కొత్త విధానంలో చేర్చనున్నారనీ తెలిపారు. పెండింగ్ రికవరీలు, ఆస్తుల జప్తు, బ్యాంకు గ్యారంటీల అమలు, సివిల్, క్రిమినల్ కేసుల పురోగతిని కూడా మంత్రి సమీక్షించి, రికవరీలకు అడ్డంకిగా ఉన్న ప్రతి పరిపాలనా అవరోధాన్ని వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. సాంకేతికతతో కట్టుదిట్టమైన పర్యవేక్షభవిష్యత్తులో ఒక్క గింజ కూడా దారి మళ్లకుండా సాంకేతికత ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థలను ప్రవేశపెట్టాలని సమావేశంలో నిర్ణయించారు. దీనిలో క్యూఆర్ కోడ్‌తో గన్నీ సంచులు, జీపీఎస్ ఆధారిత వాహన ట్రాకింగ్, జియో ట్యాగ్ తనిఖీలు, రియల్ టైమ్ స్టాక్ రీకన్సిలియేషన్, ప్రొక్యూర్‌మెంట్-మిల్లింగ్-ఎఫ్‌సీఐ డేటా బేస్‌ల అనుసంధానం, ఎర్లీ వార్నింగ్ వ్యవస్థ, రిస్క్ ఆధారిత మిల్లుల ఆడిట్లు వంటి ఆధునిక వ్యవస్థలను ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. రైతులకు, నిజాయితీ మిల్లర్లకు పూర్తి భరోసాడిఫాల్ట్‌ల కారణంగా రైతులు ఏ విధంగానూ ఇబ్బంది పడరని మంత్రి స్పష్టం చేశారు. కనీస మద్దతు ధరపై ధాన్యం కొనుగోలు, రైతుల ఖాతాల్లో నేరుగా సకాలంలో చెల్లింపులు, సేకరణ ప్రక్రియ యథావిధిగా కొనసాగుతాయని హామీ ఇచ్చారు. "ప్రభుత్వంతో నిజాయితీగా పనిచేస్తున్న రైస్ మిల్లర్లకు భయపడాల్సిన అవసరం లేదు. వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుంది. అయితే ప్రభుత్వ ధాన్యాన్ని దారి మళ్లించే వారు, ఒప్పందాలను ఉల్లంఘించే వారు మాత్రం ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరు," అని మంత్రి స్పష్టం చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ డి.ఎస్. చౌహాన్, పౌరసరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ప్రభుత్వ ధాన్యంపై నిర్వహించిన తనిఖీలు, దాడులు, నమోదు చేసిన క్రిమినల్ కేసులు, రికవరీలు, న్యాయపరమైన చర్యలపై సమగ్ర నివేదిక సమర్పించారు. సమావేశంలో పౌరసరఫరాల శాఖ, తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ప్రొక్యూర్‌మెంట్, ఫైనాన్స్, లాజిస్టిక్స్, లీగల్, మార్కెటింగ్ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణకు శిక్షలా?

>> తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ ఫిర్యాదు ఆధారంగా హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

ఐటీ చట్టం ప్రకారం జూలై 29న సైబర్ క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ కేసు నమోదు చేశారు. ఐటీ చట్టంలోని సెక్షన్ 67, భారత న్యాయ సంహిత చట్టంలోని 353 (2), 336 (4) సెక్షన్ల ప్రకారం కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తులో భాగంగా.. పోస్టులు చేసినవారితోపాటుగా మెటా ఇండియా హెడ్ కు కూడా నోటీసులు ఇచ్చారు. మెటా సంస్థకు నోటీసులు ఇచ్చిన డిసిపి అరవింద్ బాబును రాష్ట్ర ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోంది. మెటా కంపెనీపై ఎలా కేసు పెడతారంటూ.. ఢిల్లీ నుంచి రాహుల్ గాంధీ.. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్, తెలంగాణ సీఎంపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో డీసీపీని బదిలీ చేశారని చెబుతున్నారు. ఎలాంటి తప్పు చేయకుండానే తెలంగాణలో అధికారులను ఇలా ట్రాన్స్ ఫర్ చేయడం పరిపాటిగా మారింది. మ్యూజికల్ ఛైర్ లాగా ప్రభుత్వ అధికారులను ట్రాన్స్‌ఫర్ చేస్తున్నారు. అధికారుల కుటుంబసభ్యులను కూడా రేవంత్ రెడ్డి ఇలా బదిలీలతో వేధించుకు తింటున్నారు. రెండేళ్లలో 44 సార్లు అధికారుల బదిలీలతో అధికారుల్లో ఆందోళన నెలకొంది. డీసీపీని బదిలీ చేసి, మిగిలిన అధికారులను కూడా బెదిరిస్తున్నారు. ఫాంహౌజ్ ఫైల్స్ పేరుతో గతంలో కేసీఆర్ ప్రతిపక్ష నేతలను, మీడియా వ్యక్తులను, సినిమా నటులను, కుటుంబసభ్యులపై కూడా ఫోన్ ట్యాపింగ్ చేసి అధికార దుర్వినియోగం చేశారో అందరూ చూశారు.

తన ఫోన్‌ను ట్యాప్ చేశారని కేసీఆర్ కూతురే చెబుతున్నారు. కాంగ్రెస్ మద్దతుతో తమిళనాడులో అధికారంలో ఉన్న టీవీకే ప్రభుత్వం.. అక్కడి ప్రతిపక్ష నేత ఏదో చేశాడని ఆయన్ను అరెస్టు చేశారు. మరి వారికి అక్కడో న్యాయం.. ప్రధాని మోదీపై వ్యాఖ్యలు చేస్తే మరో న్యాయమా? మోదీపై, వారి తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కనీసం చర్యలు లేవు.. కానీ కేసు పెట్టినందుకు ఏకంగా పోలీసు ఉన్నతాధికారినే బదిలీ చేస్తారా? అని ప్రశ్నించారు. సింగరేణికి మూడు కోల్ బ్లాక్‌లు కేటాయించామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మణుగూరు శిరీవీది బ్లాక్‌ను సింగరేణికి కేటాయించామని ప్రకటించారు. వేలంలో పాల్గొనేందుకు అనేకమంది ముందుకొచ్చారు కానీ.. సింగరేణి కష్టాలను దృష్టిలో ఉంచుకునే కేటాయించినట్లు వివరించారు. నైనీ, తాడిచర్ల బ్లాక్2, మణుగూరు శిరీవీది బ్లాక్‌లను.. సింగరేణికి కేటాయించడం మంచి పరిణామమని పేర్కొన్నారు.,తాను బొగ్గు శాఖ మంత్రి అయినప్పటి నుంచి రాష్ట్రప్రభుత్వంతో చర్చిస్తూ.. సింగరేణికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నానని చెప్పారు. సింగరేణిని గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ దోచుకునేందుకు ప్రయత్నించాయని. కేసీఆర్, రేవంత్ రెడ్డి పుణ్యమా అని సింగరేణికి సంబంధించిన రూ.54 వేల కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. ఆ బకాయిలు వెంటనే ఇవ్వాలని రేవంత్ రెడ్డిని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. సింగరేణికి అన్యాయం చేసిందెవరో చర్చకు సిద్ధమా? కెసిఆర్ కుటుంబం పుణ్యమా అని ఈ సంస్థ దివాళా తీసే ప్రమాదంలో ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.




యుపి అసెంబ్లీ వర్షాకాల సమావేశాల సందర్భంగా మంగళవారం లక్నోలో రామమందిర విరాళాల చోరీ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న ఎస్‌పి ఎమ్మెల్యేలు రాగిని సోంకర్, పల్లవి పటేల్ తదితరులు

# అదనపు ఛార్జిషీటు!

>> రావును కూడా పోలీసులు అరెస్టు చేశారు. ఇలా ఫోన్ ట్యాపింగ్ కేసులో న లుగురు అరెస్టయ్యారు. ఇదే సమయంలో ఈ నలుగురిని కస్టడీలోకి తీసుకుని విచారించగా ఈ మొత్తం గోల్‌మాల్ వ్యవహారానికి అప్పట్లో ఎస్ఐబి చీఫ్‌గా వున్న ప్రభాకర్ రావు, మీడియా అధిపతి శ్రవణ్ రావు కారణమని సిట్ తేల్చింది. అయితే వీరిద్దరు అమెరికాకు పారిపోవడంతో వా రిని భారత్‌కు రప్పించేందుకు ఎల్ఓసి జారీ చేసి, ఆ తరువాత నాంపల్లి కోర్టు నుంచి అరెస్టు వారంట్ తీసుకుని ఫ్రాన్స్‌లోని ఇంటర్ పోల్ దా ్వరా రెడ్ కార్నర్ నోటీసు జారీ చేశారు. దీని తరువాత ప్రభాకర్ రావు, శ్రవణ్ రావు సుప్రీం కోర్టు నుంచి మధ్యంతర బెయిల్ పొంది సిట్ విచా రణకు హాజరయ్యారు. ఇదే సమయంలో కోర్టు అనుమతితో ప్రభాకర్ రావును సిట్ అధికారులు వారం రోజుల పాటు కస్టడీలో వుంచి విచారించి కీలక విషయాలు వెలికి తీశారు. దీని తరువాత పలువురు రాజకీయ నాయకులు, ఇంకొందరు బాధితుల వాంగ్మూలం నమోదు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌లో వెలుగుచూసిన విషయాలను పరిశీలిస్తే బిఆర్ఎస్ హయాంలో ప్రతిపక్ష నేతలతో పాటు స్వపక్షంలో వుంటూ దిక్కార స్వరం వినిపి ంచే నాయకులు, కొందరు మీడియా అధిపతులు, హైకోర్టు జడ్జిల ఫోన్‌లు ట్యాపింగ్ అయినట్లు సిట్ తేల్చింది. హైకోర్టు జడ్జిల ఫోన్‌ల ట్యాపిం గ్‌పై హైకోర్టు సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ చేబట్టగా అప్పట్లో ప్రతిపక్ష నేతగా వున్న రేవంత్ రెడ్డి సహా అనేక మంది ఫోన్‌లను తాము ట్యాపింగ్ చేసినట్లు అరెస్టయిన నలుగురు నిందితులు పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. దీంతో పాటు అప్పట్లో జరిగిన దుబ్బాక, హు జూరాబాద్, మునుగోడు అసెంబ్లీ ఉప ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నేతల ఫోన్‌లను ట్యాపింగ్ చేసి, వారికి డబ్బులు అందకుండా చేయడం, ఇదే సమయంలో పోలీసుల వాహనాలలో అధికార పార్టీ నాయకులకు కోట్లాది రూపాయలు అందజేయడం వంటివి జరిగాయని అరెస్టయిన న లుగురు నిందితులు వెల్లడించారు. అప్పట్లో వెయ్యి మంది వరకు నాయకులు, జడ్జిలు, మీడియా అధిపతులు, రియల్లర్లు, వ్యాపారవేత్తలు, సి నీ సెలబ్రటీలు ఇతరుల ఫోన్‌లను ట్యాపింగ్ చేసినట్లు అరెస్టయిన నలుగురు నిందితులు తెలిపారు. ఇదంతా తాము కావాలని చేసింది కాదని అప్పటి సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు, ఎస్ఐబి నాటి బాస్ ప్రభాకర్ రావు సూచనల మేరకు చేసినట్లు నలుగురు నిందితులు తెలిపారు. ఈ వివరాలపై సిట్ పోలీసులు 68 పేజీల ఛార్జిషీట్‌ను నాంపల్లి కోర్టుకు అందజేశారు. ఇందులో 600 మందికి పైగా వాంగ్మూలం వున్నట్లు తెలిపారు. 69 మందిని సాక్షులుగా చేర్చారు. కాగా ఈ కేసులో నాటి సిఎం కెసిఆర్‌తో పాటు ఆయన తనయుడు కెటిఆర్, మంత్రి హరీష్ రావుల పాత్రపై సిట్‌కు ఆధారాలు లభించినట్లు వార్తలు వస్తుండగా తాజాగా దాఖలు చేయనున్న అదనపు ఛార్జిషీట్‌లో వీరి పేర్లు వుండనున్నట్లు సమా చారం. వీరితో పాటు మరికొందరు నిందితులు ఈ ఛార్జిషీట్‌లలో వుండే వీలుంది.

## ప్రభుత్వ ఆఫీసులకు టి-ఫైబర్ ఇంటర్నెట్

>> ఫైబర్‌పై అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ టీ-ఫైబర్ నెట్‌వర్క్ వినియోగం ద్వారా ఏటా ప్రభుత్వానికి సుమారు రూ.300 కోట్ల నుంచి రూ.400 కోట్ల వరకు ఆదా అయ్యే అవకాశముందని వెల్లడించారు. అంతేకాకుండా ఇంట్రానెట్ బేసిస్‌లో సెక్యూర్డ్ ఇంటర్నెట్ యాక్సెస్ కల్పించడం ద్వారా రాష్ట్ర డేటా సెంటర్‌కు అనుసంధానం ఏర్పడి, పూర్తి స్థాయి డేటా సెక్యూరిటీ చేకూరుతుందన్నారు. గత ఆరు నెలల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 4,487 ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ ద్వారా ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు ఇప్పటికే సుమారు రూ.13 కోట్లు ఆదా అయ్యిందన్నారు. మరిన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఈ సేవలను విస్తరించేందుకు యుద్ధ ప్రాతిపదికన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ సమీక్షా సమావేశంలో సీఎస్ సంజయ్ జాజు, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, టీఫైబర్ ఎండీ వేణు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆందోళన వద్దు

>> తెలిపింది. ఆ రెండు పెట్రోల్ బంకుల్లో ఇంధన విక్రయాలను వెంటనే నిలిపివేసినట్లు వెల్లడించింది. ఇంధనంలో కలుషితం లేదా కల్తీకి పాల్పడినట్లు తేలిన ఏ రిటైల్ అవుట్‌లెట్‌పైనా కఠిన చర్యలు తీసుకుంటామని పెట్రోలియం శాఖ హెచ్చరించింది. ఇంధన నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేసింది. వాహనాల ట్యాంకుల్లోకి ఇంధనం చేరడానికి చాలా ముందే నాణ్యత పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపింది. ఇథనాల్ కొనుగోలు నుంచి పెట్రోల్ బంకులకు ఈ20 ఇంధనం చేరే వరకు ప్రతి దశలోనూ కఠినమైన తనిఖీలు జరుగుతున్నాయని పేర్కొంది. ఈ20 పెట్రోల్ తయారీకి అవసరమైన ముడి ఇథనాల్ కొనుగోలుతో నాణ్యత నియంత్రణ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ప్రతి ఇథనాల్ బ్యాచ్ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని కేంద్రం తెలిపింది. ఇథనాల్‌లో కనీసం 99.6 శాతం స్వచ్ఛత ఉండటం తప్పనిసరి అని పేర్కొంది. ఇంధన నాణ్యత పరీక్షలు కేవలం నామమాత్రంగా జరగడం లేదని కేంద్రం స్పష్టం చేసింది. నాణ్యత ప్రమాణాలను పాటించని 302 ట్యాంకర్ ట్రక్కులను తిరస్కరించినట్లు తెలిపింది. ఈ ట్యాంకర్లలో దాదాపు 10,500 కిలోలీటర్ల ఇథనాల్ ఉన్నట్లు వెల్లడించింది. ఇథనాల్ స్వచ్ఛత, నీటి శాతం, సాంద్రత వంటి ప్రమాణాల్లో లోపాలు గుర్తించడంతో ఈ ట్యాంకర్లను తిరస్కరించినట్లు పేర్కొంది. డిపోలో ట్యాంకర్‌ను స్వీకరించే ముందు ట్యాంకర్ పైభాగం, దిగువ భాగం నుంచి ఇంధన నమూనాలను సేకరించి పరీక్షిస్తారు.

దీంతో మొత్తం ఇథనాల్ బ్యాచ్‌లో నాణ్యత ఒకే విధంగా ఉందా లేదా అనేది నిర్ధారిస్తారు. ఇథనాల్‌ను పెట్రోల్‌తో కలిపి ఈ20 ఇంధనంగా మార్చిన తర్వాత కూడా నాణ్యత పరీక్షలు కొనసాగుతాయని పెట్రోలియం శాఖ వెల్లడించింది. తుది ఈ20 పెట్రోల్‌ను రిటైల్ అవుట్‌లెట్లకు పంపే వరకు ప్రతి దశలోనూ పర్యవేక్షణ ఉంటుందని తెలిపింది. ఇథనాల్ కొనుగోలు నుంచి డిపోల్లో నిల్వ, ఈ20 పెట్రోల్ తయారీ, పెట్రోల్ బంకులకు సరఫరా వరకు బహుళస్థాయి నాణ్యత నియంత్రణ వ్యవస్థ అమలులో ఉందని కేంద్రం స్పష్టం చేసింది.

## భారీ వర్షాల ఎఫెక్ట్.. సింగరేణి బొగ్గు ఉత్పత్తికి బ్రేక్

**కొత్తగూడెం, ఆగస్టు 4 ప్రభాతవార్త:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావం సింగరేణి బొగ్గు ఉత్పత్తిపై తీవ్రంగా పడింది. ముఖ్యంగా కొత్తగూడెం, ఇల్లందు ఏరియాల పరిధిలోని ఓపెన్‌కాస్ట్ గనులు భారీగా వర్షపు నీటితో నిండిపోవడంతో బొగ్గు ఉత్పత్తి దాదాపు నిలిచిపోయింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా గనుల్లో తవ్వకాలు కొనసాగించడం సాధ్యం కాకపోవడంతో అధికారులు అత్యవసర చర్యలు చేపట్టారు. భారీ సామర్థ్యం గల పంపులను వినియోగించి క్వారీల్లో చేరిన నీటిని బయటకు పంపించే పనులను యుద్ధ ప్రాతిపదికన కొనసాగిస్తున్నారు. నీటి మట్టం తగ్గిన వెంటనే ఉత్పత్తిని సాధారణ స్థితికి తీసుకురావాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు రాష్ట్రంలోని విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు బొగ్గు సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా సింగరేణి యార్డుల్లో ఇప్పటికే నిల్వ ఉన్న బొగ్గును రైల్వే రేకులు, లారీల ద్వారా నిరంతరం రవాణా చేస్తున్నారు. వర్షాల ప్రభావంతో ఉత్పత్తి దెబ్బతిన్నప్పటికీ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు కొరత ఏర్పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. వర్షాల తీవ్రత తగ్గిన తర్వాత గనుల్లో నీటిని పూర్తిగా తొలగించి, యంత్రాలను పునరుద్ధరించి పూర్తి స్థాయిలో బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించేందుకు సింగరేణి యంత్రాంగం చర్యలు ముమ్మరం చేసింది.

## రైతాంగానికి కేంద్ర పింఛన్

**హైదరాబాద్, అగస్టు 4, ప్రభాతవార్త:** రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం పెన్షన్ పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన పథకం పేరుతో రైతులు వృద్ధాప్యంలోకి వచ్చిన తర్వాత ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు మంగళవారం కేంద్రం వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వృద్ధాప్యంలోకి వచ్చాక చాలామంది రైతుల కు ఎలాంటి ఆదాయ వనరులు ఉండవని, ఈ నేపథ్యంలో వయస్సు పైబడిన చిన్న, సన్నకారు రైతులకు అండగా ఉండేందుకు కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పథకం కింద 60 ఏళ్లు నిండాక రైతులకు ప్రతీనెల రూ.3వేల చొప్పున పింఛన్ జీవితకాలం అందుతుందని వివరించింది. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న రైతులు ఈ పథకంలో చేరేందుకు అర్హులు. భూ రికార్డుల్లో తమ పేరు ఉండి రెండు హెక్టార్ల వరకు సాగు చేసేందుకు వీలుగా భూమి ఉన్న వారు ఈ పథకం కింద పేర్లు నమోదు చేసుకోవచ్చు. ఎప్పుడు నమోదు చేసుకున్నా పెన్షన్ 60ఏళ్లు దాటాకే వస్తుంది. నేషనల్ స్కీం, ఈఎస్ఐ స్కీం, ఈపీఎఫ్‌వో పరిధిలో ఉన్నవారు, ఏదైనా ఇతర చట్టబద్ద సామాజిక భద్రతా పథకాల పరిధిలో ఉన్నవారు, ఉన్నత ఆర్థికస్థితి కలిగినవారు, టాక్స్ పరిధిలో ఉన్నవారు, టాక్స్‌పేయర్లు ఈ పథకానికి అర్హులు కారని స్పష్టం చేసింది. ఈ పెన్షన్ అందేవరకు కొంత ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. పథకంలో చేరే వారి వయస్సును బట్టి ప్రీమియం ఉంటుంది.

# నీట్ పిజి ప్రవేశాల వ్యవస్థ ఆడిట్‌కు నిపుణుల కమిటీ

### సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం నివేదన

**న్యూఢిల్లీ, ఆగస్టు 4:** 2025-26 నీట్ పిజి పరీక్షకు అర్హత కటాఫ్ పర్సంటైల్స్‌ను తగ్గించడాన్ని సవాలు చేయడం వల్ల తలెత్తిన సమస్యలను పరిశీలించడానికి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డిజిహెచ్ఎస్) నేతృత్వంలో ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసినట్లు కేంద్రం మంగళవారం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య ప్రవేశాలకు అర్హత కటాఫ్ పర్సంటైల్స్‌ను గణనీయంగా తగ్గించాలన్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిఐఎల్)పై జస్టిస్ పి.ఎస్. నరసింహా, అలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం విచారణ జరుపుతోంది. కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి, సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగానే నిపుణుల కమిటీని ఏర్పాటు చేశామని, ఈ ప్రక్రియను పూర్తిచేసి నివేదిక సమర్పించడానికి ఎనిమిది వారాల సమ యం కావాలని కోరారు. జస్టిస్ నరసింహ నేతృత్వంలోని ధర్మాసనం కమిటీ కూర్పుకు సంబంధించిన వివరాలను కోరగా, ఈ ప్యానెల్‌కు డిజిహెచ్ఎస్ అధ్యక్షత వహిస్తారని, ఇందులో మరో 11 మంది సభ్యులు ఉంటారని ఎఎస్‌జి తెలిపారు. వివిధ భాగస్వాముల నుండి సూచనలను ఆహ్వానించి, సమగ్రంగా పరిశీలించిన తర్వాత, ఎనిమిది వారాల్లోగా తన నివేదికను సమర్పించాలని కమిటీని సుప్రీంకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ వాయిదా వేసింది.

డిజిహెచ్ఎస్ జారీ చేసిన కార్యాలయ ఉత్తర్వుల ప్రకారం, డిజిహెచ్ఎస్ డాక్టర్ లవనీష్ జి. కృష్ణ అధ్యక్షతన నిపుణుల కమిటీని ఏర్పాటు చేసిం ది. ఇందులో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్, నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (ఎన్‌బిఇ), నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి), నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ), కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ, నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసి) నుండి సీనియర్ అధికారులు కూడా ఉన్నారు. నీట్ పరీక్ష ద్వారా ప్రస్తుతం ఉన్న ప్రవేశ వ్యవస్థపై వివిధ భాగస్వాములను కలుపుకొని సమగ్ర ఆడిట్ నిర్వహించడానికి, ప్రస్తుత వ్యవస్థలోని లోపాలను, అంతరాలను గుర్తించడానికి, ఆచర ణాత్మక, అమలు చేయదగిన పరిష్కారాలను సూచించడానికి ఒక యం త్రాంగాన్ని రూపొందించే బాధ్యతను ఈ కమిటీకి అప్పగించారు.

# కృష్ణా, గోదావరి జలాశయాల్లోకి భారీగా వరద

**శ్రీశైలం జలాశయంలోకి ఈ సీజన్‌లో 64.95 టిఎంసిల వరద రాక**

**గోదావరిలో గైక్వాడ్‌లోకి 46.39, శ్రీపాద ఎల్లంపల్లిలో 38.92 టిఎంసిలకు చేరిన నీరు**

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** నైరుతి వర్షాలు జూన్, జులై మూడో వారం వరకు కురవకపోయినా జులై 27 బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్రవాయుగుండం ప్రభావంతో వారం రోజులుగా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. గోదావరి, కృష్ణా నదుల్లోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండటంతో జలాశయాలు జలకళను సంత రించుకుంటున్నాయి. నైరుతి రుతుపవన కాలంలో కృష్ణానదిపై ఉన్న ఆలమట్టి జలాశయానికి ఇప్పటివరకు 185 టిఎంసిలు, శ్రీశైలంకు 65 టిఎంపిలు, గోదావరి నదిపై ఉన్న గైక్వాడ్‌లోకి 46.39, శ్రీపాద ఎల్లంపల్లి 38.92టిఎంసిలు వరద వచ్చిచేరింది. ఎస్ఆర్ఎస్‌పి జలాశయంలో ప్రస్తుతం 34.577 టిఎంసి నీటి నిల్వ ఉంది. గత వారం రోజుల్లో ఈ జలాశయానికి క్యాచ్‌మెంట్ నుంచి 21.82 టిఎంసిల నీరు వచ్చి చేరింది. గత మంగళవారం సాయంత్రం ఎస్సారెస్పీలో 15.98 టిఎంసిలు నిల్వఉంది. కడెంకు ఈ సీజన్‌లో 11.07 టిఎంసిల నీరు క్యాచ్‌మెంట్ నుంచి వరద జలాశయంలోకి రాగా స్పిల్‌వేతోపాటు ఇతర మార్గాల ద్వారా కిందికి నీటిని వదిలారు. ప్రస్తుతం 3.5టిఎంసిల నీరు ఉంది. బయటకు 8 టిఎంసిలనీరు విడుదలైంది. శ్రీపాద ఎల్లంపల్లి జలాశయాలో గత వారంరోజుల్లో 38.62టిఎంసి నీరు రిజర్వాయర్‌లోకి వచ్చిచేరింది. మిడ్‌మానేరుకు ఎత్తిపోయడంతోపాటు స్పిల్‌వే నుంచి దిగువకు నీటిని విడుదల చేయగా సోమవారం ఉదయం 19.65టిఎంసిల నీరు ఉండగా మంగళవారం ఉదయం ఆరుగంటలకు నీటి నిల్వకి 18.79కి పడిపోయింది. నిజామ్‌సాగర్‌లో 8.943 టిఎంపిలు, మిడ్‌మానేరులోకి 14.82 టిఎంసిల నీటినిల్వ ఉంది. ఆలమట్టికి నైరుతి రుతుపవనకాలంలో 184.94టిఎంసి నీరు వరద రూపంలోకి రాగా 95.63టిఎంసిలు కృష్ణానది నదిలోకి దిగువకు వదిలారు. ఆలమట్టికి గత 24గంటల్లో సగటున 140257 క్యూసెక్కుల వదర రిజర్వాయర్‌లోకి వచ్చి చేరింది. 119.27 టిఎంసిలు రిజర్వాయర్‌లో ప్రస్తుతం నిల్వ ఉన్నాయి. స్పిల్‌వే ద్వారా 105800క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. సగటు ఔట్‌ఫ్లో 149597ఉంది. నారాయణపూర్‌లోకి ఈ సీజన్‌లో 95 టిఎంసిలు వదరగా రాగా ప్రస్తుతం అందులో 33.73 టిఎంసిల నీరు ఉంది. నారాయణపూర్‌కు గడచిన 24గంటల్లో సగటున 146800క్యూసెక్కుల వదర వచ్చిచేరింది. దిగువకు స్పిల్‌వే నుంచి 134786 క్యూసెక్కుల వరద నీరు కిందికి వదిలారు. ఔట్‌ఫ్లో మొత్తం 147776 క్యూసెక్కులు నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి ఉంది. ఉజ్జనిలోకి 101టిఎంసిల నీరు ఈ సీజన్‌లో రాగా ప్రస్తుతం అందులో 115టిఎంసి నీరు నిల్వఉంది. ఉజ్జనికి 68897 క్యూసెక్కుల వదర వచ్చిందిస్పిల్‌వే ద్వాఆరా 70900క్యూసెక్కులు వదిలారు మొత్తం 75626ఔట్‌ఫ్లో ఉంది. జూరాలకు ఈ సీజన్‌లో 80.98 టిఎంసిలు నీటి వరద రాగా ప్రస్తుతం 7.6 టిఎంసిలు అందులో ఉంది. శ్రీశైలంకు జూరాల ప్రియదర్శిని ప్రాజెక్టు 27గేట్లు ఎత్తి కిందికి నీటిని వదిలారు. ఆప్రాజెక్టులోకి సోమవారం ఉదయం లక్షా58వేల క్యూసెక్కుల వరద వస్తుండటంతో 1,48,244క్యూసెక్కులు కిందికి వదిలారు జూరాల లో 9.657 టిఎంసిలనీరు ఉంది. మంగళవారం ఉదయం ఆరు గంటలవరకు 185589 క్యూసెక్కులు సగటు వరద వచ్చి చేరగా బయటకు 183480 జలాశం నుంచి బయటకు విడుదల చేశారు. అందులో స్పిల్‌వే ద్వాఆర 146900 విడుదల చేశారు. నాగార్జున సాగర్‌కు 24టిఎంసిలు క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి వచ్చిచేరింది. అందులో 136.99 టిఎంసిల నీరు ఉంది. జూరాలపై ఆధారపడ్డ ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని తరలిస్తున్నారు. నెట్టెంపాడు, భీమా1, 2, కోయిలసాగర్ ఎత్తిపోతల పథకం పరిధిలోని మోటార్లను ప్రారంభించారు. భీమా1 నుంచి 1,300 క్యూసెక్కులతో భూత్పూర్, సంగంబండ జలాశయాలకు నీటిని ఎత్తి పోస్తున్నారు. భీమా2 నుంచి 872 క్యూసెక్కులు ఎత్తి పోస్తున్నారు. కొత్తకోట మండలం ఏనుగుంట జలాశయం, కానయపల్లి శంకర సముద్రం, శ్రీరంగాపురం మండలం రంగసముద్రంతో పాటు, కొల్లాపూర్ నియోజక వర్గంలోని పలు జలాశయాలు, చెరువులకు నీటిని సరఫరా చేస్తున్నారు. జూరాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు పెద్ద ఎత్తున వరద చేరుతుండటంతో శనివారం కల్వకుర్తి ఎత్తిపోతల నుంచి కూడా మోటార్లు ఆన్ చేశారు. ఎల్లూరు, జొన్నల బొగుడ ఎత్తిపోతల నుంచి 2 మోటార్లతో 1,600 క్యూసెక్కుల నీటిని ఎగువ ప్రాంతాలకు తరలిస్తున్నారు. తుంగభద్ర నదిలో ఈ సీజన్ ఆరంభం నుంచి రిజర్వాయర్‌కు వచ్చి చేరిన వరద 44.18 టిఎంసిలు మాత్రమే. మంగళవారం ఉదయం ఆరు గంటలకు 24 గంటలలో సగటున 82087 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. 1589 క్యూసెక్కులు బయట వినియోగిస్తున్నారు. స్పిల్‌వే ద్వారా బయటకు నీరు దిగువకు విడుదల చేయలేదు. తుంగభద్రలో ప్రవాహం ఇప్పటికీ లేకపోవడంతో సుంకేసుల, ఆర్డీఎస్ నీరు లేక ఎడారిలా ఉన్నాయి. నెట్టెంపాడులోని గుడ్డెం దొడ్డి, ర్యాలంపాడు జలాశయాలకు, కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా ఎల్లూరు, జొన్నలబొగుడ, గుడిపెల్లిగట్టుల జలాశయాలకు కూడా తరలుతోంది. ఎత్తిపోతల పథకాల పరిధిలోని జలాశయాలు, చెరువులను నింపేందుకు కసరత్తు చేస్తున్నారు. కృష్ణానదికి వరద వస్తుండటం, ఎత్తిపోతలు ఆరంభం కావడంతో ఆయకట్టు రైతులు వరినాట్లు, ఇతర పంటల సాగుకు సన్నద్ధం అవుతున్నారు.

# నేటి నుంచి నీట్-2026 స్టేట్ కౌన్సెలింగ్ ప్రారంభం

### 12 వరకు రిజిస్ట్రేషన్లకు అవకాశం

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్, డెంటల్ కళాశాలల్లో 2026-27 విద్యాసంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా (కన్వీనర్ కోటా) సీట్లలో ప్రవేశాల కోసం కాళోజీ నారాయణరావు హెల్త్ యూని వర్సిటీ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. నీట్ యుజి-2026లో క్వాలిఫై అయిన విద్యార్థులు నేడు(బుధవారం) ఉదయం 6 గంటల నుంచి 12 సాయంత్రం 6 గంటల వరకు టిఎస్ఎంఇడి ఎడిఎం.టిఎస్‌సిహెచ్ఈ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని యూనివర్సిటీ సూచించింది. సీట్ల మ్యాట్రిక్స్‌ను వెబ్‌ఆప్షన్లకు ముందు ప్రత్యేకంగా ప్రకటిస్తామని పేర్కొంది. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునే ముందు ప్రాస్పెక్టస్‌ను పూర్తిగా చదివి, అర్హతలు, రిజర్వేషన్లు, అవసరమైన ధ్రువపత్రాలు, నిబంధనలను పరిశీలించి దరఖాస్తు చేసు కోవాలని హెల్త్ యూనివర్సిటీ సూచించింది. పూర్తి వివరాలు, సమా చారం కోసం హెల్త్ యూనివర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించాలని కోరింది. విద్యార్థులకు కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకునే సమయంలో ఆన్‌లైన్ దరఖాస్తుతోపాటు అన్ని సర్టిఫికెట్లను తప్పకుండా అప్‌లోడ్ చేయాలి. నమోదు ప్రక్రియ ఒక్కసారి మాత్రమే ఉంటుంది. ప్రతిరౌండ్ కౌన్సెలింగ్‌కు మళ్లీ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాల్సిన అవస రం లేదు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం తాత్కాలిక మెరిట్ జాబితా విడుదల చేస్తారు. అనంతరం వెబ్ ఆప్షన్లు, కౌన్సెలింగ్ షెడ్యూల్, సీట్ల మ్యాట్రిక్స్‌ను కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు. వెబ్‌ఆప్షన్లు ఇచ్చేటప్పుడు తాము చేరాలనుకునే కాలేజీల ప్రాధాన్యత క్రమాన్ని జాగ్రత్తగా ఎంపిక చేసుకోవాలని విశ్వవిద్యాలయం సూచించింది.

## నేడు టిజిసిపిజిసెట్-2026 ఫలితాల విడుదల

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాల యాలు, అనుబంధ కళాశాలలలో 2026-27 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం జూలై 8 నుంచి 16 వరకు నిర్వహించిన టీజీసీపీజీసెట్-2026 ఫలితాలను నేడు(బుధవారం) విడుదల చేయనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో విడుదల చేయనున్నారు. ఫలితాలను తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డి, కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి, ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్‌తో కలిసి ఫలితాలను విడుదల చేయనున్నారు. సీపీగెట్-2026 ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలు జులై 8న ప్రారంభమై 16తో ముగిశాయి. 39 సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలు మూడు సెషన్‌లలో విజయవంతంగా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 52,697 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వారిలో 45,462 మంది అభ్యర్థులు కంప్యూటర్ ఆధారిత (సీబీటీ) ప్రవేశ పరీక్షలకు హాజరయ్యారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 82.27 శాతం మంది పరీక్షలకు హాజరయ్యారు. రాష్ట్రంలోని 22 పరీక్షా కేంద్రాలలో సీపీగెట్ పరీక్షలను నిర్వహించారు.

# ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్‌కృష్ణారెడ్డికి పోలీసు అకాడమి నోటీసులు

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** సహచర మహిళా ట్రైనీ ఐపిఎస్ అధికారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో అరెస్టయి చంచల్ గూడ జైల్లో వున్న ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డికి జాతీయ పోలీసు అకాడమి అధికారులు నోటీసులు జారీ చేసింది. లైంగిక వేధిం పులకు సంబంధించి అత్తాపూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదవగానే అకాడమి నుంచి ఇప్పటికే ఉదయ్ కృష్ణారెడ్డిని సస్పెండ్ చేయడం తెలిసిందే. ఆ తర్వాత జరిగిన పరిణామాల అనంతరం అతన్ని పోలీసులు అరెస్టుచేసి రిమాండుకు తరలించడం విదితమే. దీనిపై పోలీసు అకాడమి అధికారులు డిఓపిటికి నివేదిక ఇవ్వగా తాజాగా ఉదయ్‌కృష్ణారెడ్డికి నోటీసు జారీచేసి బుధవారంలోగా వివరణ ఇవ్వాలని కోరినట్లు సమాచారం. లైంగిక వేధింపుల కేసులో అరెస్టయి 24 గంటలకుపైగా జైల్లో వుండడంతో అకాడమి నుంచి పూర్తిగా ఎందుకు తొలగించకూడదో వివరణ ఇవ్వాలని నోటీసులో కోరినట్లు తెలిసింది. ఈ నోటీసు చంచల్‌గూడ జైల్లో వున్న ఉదయ్ కృష్ణారెడ్డికి అందించినట్లు సమా చారం. మరోవైపు ఉదయ్ కృష్ణారెడ్డి కస్టడీ పిటిషన్‌పై ఉప్పర్‌పల్లి కోర్టు విచారణ బుధవారం జరగనుంది.



# మోడీ నివాసానికి కేజ్రీవాల్ పాదయాత్ర

### మధ్యలోనే అడ్డుకున్న ఢిల్లీ పోలీసులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 4:** ఇ-20 పెట్రోల్ బలవంతపు వినియోగాన్ని వ్యతిరేకిస్తూ ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సోమవారం ఢిల్లీలో ప్రధాని మోడీ నివాసం వరకూ చేపట్టిన పాదయాత్రను పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. ఈ20 పెట్రోల్‌కు వ్యతిరేకంగా రెండు లక్షల మంది సంతకాలతో కూడిన పిటిషన్‌ను మోడీకి ఇవ్వాలని కేజ్రీవాల్ భావించారు. దాదాపు 100 మందితో కలిసి మోడీ నివాసానికి కేజ్రీవాల్ బయల్దేరారు. మోడీ ఇంటికి వెళ్తున్న అరవింద్ కేజ్రీవాల్‌ను ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. తనను పోలీసులు అడ్డుకోవడంపై కేజ్రీవాల్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తనను ప్రభుత్వం అడ్డుకోవడానికి చూపించే తెగువ ఏదో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై చూపించాలని మోడీకి కేజ్రీవాల్ సవాల్ విసిరారు. ఇ-20 పెట్రోల్ వినియోగాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇ-20 పెట్రోల్ వినియోగాన్ని వ్యతిరేకిస్తూ ఆయన ఆన్‌లైన్‌లో పిటిషన్ దాఖలు చేయగా, దానికి రెండు లక్షల మంది తమ సంతకాలతో మద్దతు తెలిపారు. దీనికి సంబంధించిన పత్రాల్ని కేజ్రీవాల్.. మోడీకి అందించాలనుకున్నారు. ఆయన మోడీ నివాసానికి నడిచి వెళ్తుండగా ఢిల్లీ పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ మాట్లాడారు. "ఈ20 పెట్రోల్‌కు వ్యతిరేకంగా రెండు లక్షల మంది మద్దతు ఇచ్చిన పిటిషన్లను ప్రధాని మోడీకి ఇచ్చేందుకు ప్రయత్నించాం. ఈరోజు మేం మోడీని కలిసేందుకు వెళ్తుంటే పోలీసులు ఆపేశారు. కానీ, అన్ని పిటిషన్లను మేం మోడీకి అందించాం. మోడీజీ, మిమ్మల్ని కలిసేందుకు వెళ్లకుండా మమ్మల్ని అడ్డుకున్నారు. మీ అధికారాన్ని మాపై ఉపయోగించడం వల్ల మీరు ఏం సాధించగలరు, ఈ తెగువ ఏదో ట్రంప్ ముందు చూపించండి. ఇండియాపై బలవంతంగా ఇ-20 పెట్రోల్ రుద్దడాన్ని ఆపండి. లేదంటే దేశంలో మరో భారీ ఉద్యమం మొదలవుతుంది" అంటూ కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. అంతకుముందు తనను అడ్డుకున్న పోలీసులతో కేజ్రీవాల్ వాగ్వాదానికి దిగారు. తామేమీ టెర్రరిస్టులం కాదని, ఇ-20 పెట్రోల్ సమస్యపై ప్రధానిని కలిసేందుకు మాత్రమే వెళ్తున్నామని, దయచేసి ఆయనను కలిసే అవకాశం ఇవ్వాలని కోరారు. కానీ, దీనికి పోలీసులు అంగీకరించలేదు. దీంతో ఆయన వెనుదిరిగారు.

# ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై 29న మహాధర్నా

**7 నుంచి దశలవారీగా పోరాటం.. 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు**

**ఉపాధ్యాయ సంఘాల పోరాట స్టీరింగ్ కమిటీ తీర్మానం**

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమ స్యలతోపాటు విద్యారంగం సమస్యల పరిష్కారానికి దశల వారీ ఉద్య మం చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యుఎస్‌పిసి) స్టీరింగ్ కమిటీ తీర్మానించింది. ఈ నెల 7 నుంచి దశలవారీగా ఉద్యమించాలని నిర్ణయించినట్టు యుఎస్‌పిసి నాయకులు తెలిపారు. ఈ నెల 29న ఇందిరాపార్క్ దగ్గర మహాధర్నాను నిర్వహించాలని నిర్ణయించినట్టు స్టీరింగ్ కమిటీ నేతలు తెలిపారు. మంగళవారం టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో యుఎస్‌పిసి నేతలు మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చావ రవి, ఎ వెంకట్(టిఎస్ యుటిఎఫ్), సిహెచ్ అనిల్ కుమార్, ఎన్ తిరుపతి(టిపిటిఎఫ్), ఎం సోమయ్య, టి లింగారెడ్డి(డిటిఎఫ్), కొమ్ము రమేష్ (బిటిఎఫ్), మేడి చరణ్ దాస్ (ఎస్సీ,ఎస్టీ టిఎఫ్), ఎస్ హరికిషన్(టిటిఎ), బి కొండయ్య (ఎంఎస్ టిఎఫ్), వై విజయ కుమార్, రవీందర్ (ఎస్సీ ఎస్టీ యుయస్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టీరింగ్ కమిటీ నాయకులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యలన్నీ విద్యారంగ సమస్యలేనని, వాటి పరిష్కారం పట్ల రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 7న నల్ల బ్యాడ్జీలతో పాఠశాలల్లో భోజన విరామ సమయంలో నిరసనలు తెలపాలని నిర్ణయించారు. అప్పటి నుండి పిఆర్‌సి ప్రకటించే వరకు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని యుఎస్‌పిసి పిలుపునిస్తుందన్నారు. 12, 13 తేదీల్లో మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, తహసీల్దార్లకు మెమోరాండలు ఇవ్వాలని, 19న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని, ఈ నెల 29న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి మహాధర్నా నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే సెప్టెంబర్‌లో అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వేలాది మంది ఉపాధ్యాయులతో చలో అసెంబ్లీ నిర్వహిస్తామని యుఎస్‌పిసి నాయకులు తెలిపారు. ప్రాథమిక విద్యకు నష్టదాయకమైన జిఒ 25ను సవరించాలని కోరుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఆగస్టు 15లోగా బదలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలన్నారు.

# ఆయుష్ వైద్య విద్యార్థుల నిరవధిక సమ్మె

### విధులు బహిష్కరణ.. స్టైపెండ్ పెంచాలని డిమాండ్

**హైదరాబాద్ (ఉప్పల్), ఆగస్టు 4, ప్రభాతవార్త :** రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆయుష్ వైద్య కళాశాలలు, అనుబంధ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న వైద్య విద్యార్థులు, హౌస్‌సర్జన్లు, పీజీ విద్యార్థులు మంగళవారం నుంచి నిర వధిక సమ్మె ప్రారంభించారు. హైదరాబాద్ రామంతపూర్‌లోని జయశ్రీ పొట్టిశ్రీరాములు ప్రభుత్వ హోమియోపతి వైద్యకళాశాల వద్ద తెలం గాణ ఆయుష్ హౌస్‌సర్జన్స్, పోస్ట్‌గ్రాడుయేట్ జెఎసి ఆధ్వర్యంలో వైద్యవిద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని నినదించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అయూష్ జెఎసి అధ్యక్షుడు డా.బి.రాజేష్‌కళ్యాణ్, ఉపాధ్యక్షుడు డా.నితిన్‌కుమార్, డా.హారీకశ్రీ, డా.ముస్తాక్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి డా. జి.శ్రవణ్‌రెడ్డి, డా.హబీబ్ అబ్బాస్, డా.జి.అఖిల్‌కుమార్, ఎం.రాకేష్, కోశాధికారి డా.పి. శ్రవణ్‌కుమార్, డా. కృష్ణకుమార్, సంయుక్త కార్యదర్శులు డా.బి. సాహితి, ప్రణయ్ వాసుదేవ్, మీడియా కార్యదర్శులు డా.సాయిచరణ్, దా.శేషు కుమార్, డా.అతుల్ బాలాజీ తదితరులు మాట్లాడుతూ తెలంగాణలో అయుష్ హౌస్‌సర్జన్లు, పీజీ విద్యార్థులకు చెల్లిస్తున్న స్టైపెండ్ దేశంలోనే అత్యల్పమని వారు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో పోలిస్తే తెలంగాణలో చెల్లిస్తున్న స్టైపెండ్ సగం కంటే తక్కువగా ఉందని ఆరోపించారు. అల్లోపతి విద్యార్థులతో సమానంగా వివక్ష లేకుండా ఆయుష్ హౌస్ సర్జన్లు, పీజీ విద్యార్థుల స్టైపెండ్ తక్షణమే పెంచాలని ప్రభుత్వాన్ని జేఏసీ డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేరే వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.



రామంతాపూర్ హోమియోపతి ఆసుపత్రి ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న ఆయుష్ వైద్య విద్యార్థులు

**తొలిరోజు సమ్మె విజయవంతం : ఆయుష్ జెఎసి**

తెలంగాణ ఆయుష్ హౌస్‌సర్జన్లు, పీజీ స్కాలర్ల నిరవధిక సమ్మె తొలి రోజు విజయవంతం అయ్యిందని అయూష్ జెఎసి నేతలు పేర్కొన్నారు. 15 రోజుల సమ్మె నోటీసు గడువు పూర్తయినప్పటికీ, స్టైపెండ్ పెంపుపై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పష్టమైన, సంతృప్తికరమైన నిర్ణయం రాకపోవడంతో ఈ నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చినట్లు తెలిపారు.

# పెట్రోల్, డీజిల్, ఎటిఎఫ్ ఎగుమతులపై విండ్‌ఫాల్ ట్యాక్స్ పెంచిన కేంద్రం


**న్యూఢిల్లీ, ఆగస్టు 4:** పెట్రోల్, డీజిల్, విమాన ఇంధనం (ఏటీఎఫ్) ఎగుమతులపై విధించే ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకం విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను పెంచింది. ప్రస్తుతం కొనసాగుతున్న పక్షానికి ఈ సవరించిన రేట్లు అమల్లోకి వచ్చాయి.ఆర్థిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం, డీజిల్ ఎగుమతులపై లీటరుకు రూ.15.50 నుంచి రూ.25.50కు పెంచారు. ఏటీఎఫ్ ఎగుమతులపై సుంకాన్ని రూ.14.50 నుంచి రూ.22కు పెంచగా, పెట్రోల్ ఎగుమతులపై విధించే పన్నును లీటరుకు రూ.2.50 నుంచి రూ.3.50కు పెంచారు.అయితే, దేశీయ వినియోగానికి విడుదల చేసే పెట్రోల్, డీజిల్‌పై ప్రస్తుతం అమల్లో ఉన్న ఎక్సైజ్ సుంకాల్లో ఎలాంటి మార్పు లేదని ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. పశ్చిమ ఆసియా యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు పెరగడంతో, దేశీయంగా ఇంధన లభ్యతకు ఇబ్బందులు తలెత్తకుండా చూడడం కోసం ఈ విండ్‌ఫాల్ పన్ను విధించింది.

# విదేశాలకు పరారైన నేరస్థులపై కఠిన చర్యలు

**2021-26 మధ్య 36 దేశాల నుంచి భారత్‌కు 274 మంది పరారీ నేరస్థుల తరలింపు**

**వారిని తిరిగి తీసుకురావడాన్ని జాతీయ ప్రాధాన్యతగా మార్చిన మోడీ ప్రభుత్వం**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 4:** విదేశాలకు పారిపోయిన నేరస్థులపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతోంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో, కేంద్ర హోం మంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో 2021 నుంచి 36 దేశాల నుంచి 274 మంది పరారీలో ఉన్న నేరస్థులను భారత్‌కు తిరిగి తీసుకువచ్చారు. నేరస్థులకు తగిన శిక్ష పడేలా చూసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 2018లో పరారీలో ఉన్న ఆర్థిక నేరస్థులను భారత్‌కు తీసుకొచ్చేం దుకు వీలుగా చట్టాన్ని తీసుకువచ్చారు. హోం మంత్రి అమిత్ షా దిశానిర్దేశంలో పరారీ నిందితులపై కఠిన చర్యలు తీసుకునేందుకు నేరస్థులను స్వదేశానికి రప్పించే ప్రక్రియను వేగవంతం చేసేందుకు సాంకేతికత, ఇంటెలిజెన్స్ ఆధారిత సమగ్ర వ్యవస్థను భారత్ అభివృద్ధి చేసింది.2014కు ముందు దేశంలో నేరస్థుల అప్పగింత వ్యవస్థ చాలా పాతబడిపోయి బలహీనంగా ఉండేది. ఆ సమయంలో భారత్‌కు కేవలం 37 దేశాలతో మాత్రమే అప్పగింత ఒప్పందాలు ఉండేవి. ఆర్థిక నేరస్థులను శిక్షి ంచడానికి లేదా వారి ఆస్తులను జప్తు చేయడానికి ఎటువంటి ప్రత్యేక చట్టాలూ లేవు. 2004 నుంచి 2013 మధ్య కాలంలో ఏడాదికి సగటున కేవలం నలుగురు నేరస్థులను మాత్రమే భారత్‌కు తీసుకురాగలిగారు. అంతేకాకుండా 110 అప్పగింత విజ్ఞప్తులు పెండింగ్‌లోనే ఉండిపోయాయి. దీనికి తోడు అసంపూర్ణమైన పత్రాలు, నెమ్మదిగా సాగే ప్రక్రియ అప్పగింత వ్యవస్థను క్లిష్టతరం చేశాయి. దీనివల్ల తరచూ విదేశీ కోర్టులు భారత్ అభ్యర్థనలను తోసిపుచ్చేవి. డబుల్ జియోపర్డీ (ఒకే నేరానికి రెండుసార్లు శిక్షించకపోవడం), డ్యూయల్ క్రిమినాలిటీ (రెండు దేశాల్లోనూ నేరంగా పరిగణించే చర్య) వంటి న్యాయపరమైన అడ్డంకులు కూడా ఈ ప్రక్రియను ఆలస్యం చేసేవి. హోం మంత్రిత్వ శాఖ, ఇతర విభాగాల మధ్య సరైన సమన్వయం, ఏకీకృత వ్యూహం లేకపోవడం వల్ల పరారీలో ఉన్నవారిపై సమాచారాన్ని పంచుకోవడం, వారి ఆచూకీని గుర్తించడం, రెడ్ కార్నర్ నోటీసులను జారీ చేయడం వంటివి కూడా నెమ్మదిగా సాగాయి.విదేశాలకు పారిపోయిన నేరస్థులను స్వదేశానికి రప్పించే అంశంలో గత ప్రభుత్వాలకు రాజకీయ సంకల్పం లోపించిన నేపథ్యంలో మోదీ ప్రభుత్వం పరారీ నేరస్థుల అప్పగింతను ఒక 'జాతీయ ప్రాధాన్యత'గా మార్చింది.నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా పరారీ నేరస్థులపై మూడు సూత్రాల వ్యూహాన్ని (ప్రపంచవ్యాప్త ఆపరేషన్లు, బలమైన సమన్వయం, చురుకైన దౌత్యం) అమలు చేస్తున్నారు. మోదీ ప్రభుత్వం 2019లో ఎన్ఐఏ (సవరణ) చట్టం, యూఏపీఏ (సవరణ) చట్టాలను తీసుకువచ్చింది. దీని ఆధారంగా 2020 నుంచి పరారీ నేరస్థులను భారత్‌కు తీసుకువచ్చే ప్రక్రియను మిషన్ మోడ్‌లో చేపట్టారు. దీని ఫలితంగా చట్టపరమైన చర్యలు కేవలం నిషేధిత సంస్థలకు మాత్రమే పరిమితం కాకుండా తీవ్రరూపం దాల్చాయి. విదేశాల్లో తిష్టవేసిన వ్యక్తిగత ఉగ్రవాదులు, వారిని నడిపించే హ్యాండ్లర్లు, నిధులను అందించే వ్యవస్థలు, సహాయక వ్యవస్థలను కూడా ఈ పరిధిలోకి తీసుకువచ్చారు. దీంతో పరారీలో ఉన్నవారిని పట్టుకోవడం, వారి వ్యవస్థలను నిర్మూలించడంలో భారత్ సామర్థ్యం గణనీయంగా పెరిగింది.పరారీ నేరస్థులకు సంబంధించి ప్రత్యేక నిబంధనలను చేర్చుతూ మోదీ ప్రభుత్వం 2024లో మూడు కొత్త క్రిమినల్ చట్టాలను అమలులోకి తెచ్చింది. ఇందులో భాగంగా భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) లోని సెక్షన్లు 355, 356 ద్వారా తొలిసారిగా నిందితుడు హాజరుకాకపోయినా విచారణ జరిపే విధానానికి అవకాశం కల్పించారు. 2022లో 90వ ఇంటర్‌పోల్ జనరల్ అసెంబ్లీకి భారత్ ఆతిథ్యమిచ్చింది. సమాచార మార్పిడి, భాగస్వామ్యం, సహకారం అంతర్జాతీయ పోలీసు వ్యవస్థకు ఈ మూడు అంశాలనూ కీలకమైన ప్రాతిపదికలుగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆ సందర్భంగా స్పష్టం చేశారు.మోదీ ప్రభుత్వం మనీ లాండరింగ్ నిరోధక చట్టాన్ని (పీఎంఎల్ఏ) మరింత కఠినంగా అమలు చేస్తోంది. పీఎంఎల్ఏ నిబంధనలను పక్కాగా అమలు చేయడం ద్వారా... 2019 నుంచి 2026 మధ్య కాలంలో పరారీలో ఉన్న నేరస్తులకు చెందిన రూ. 17,874 కోట్లకు పైగా ఆస్తులను ప్రభుత్వం అటాచ్ చేసింది. పరారీలో ఉన్న నేరస్తుల ఆచూకీ కనిపెట్టి, వారిని పట్టుకునే అంతర్జాతీయ ప్రయత్నాలను మరింత బలోపేతం చేయడం కోసం ఒక ప్రత్యేక అంతర్జాతీయ వ్యవహారాల కేంద్రాన్ని సీబీఐ ఏర్పాటు చేసింది. ఈ కేంద్రం ఇంటర్‌పోల్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పోలీసు ఏజెన్సీలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ.. నేరస్తుల గుర్తింపును, అరెస్టులను వేగవంతం చేస్తోంది. సమాచార మార్పిడిని మరింత సులభతరం చేయడం కోసం ప్రతి రాష్ట్రంలోనూ, అన్ని కేంద్ర విచారణ సంస్థల్లోనూ ఇంటర్‌పోల్ కాంటాక్ట్ అధికారులను కూడా సీబీఐ నియమించింది. ఇది పరారీలో ఉన్న నేరస్తులకు సంబం ధించి.. దర్యాప్తులో సమన్వయాన్ని, అంత ర్జాతీయ సహకారాన్ని గణనీయంగా మెరుగుపరిచింది. ఇంటర్ పోల్ రెడ్ కార్నర్ నోటీసుల జారీ ఇటీవలి కాలంలో గణనీయంగా పెరిగింది.గత మూడేళ్లలో పరారీలో ఉన్న 401 మంది నేరస్తులపై రెడ్‌కార్నర్ నోటీసులను జారీ చేశారు. గత అయిదేళ్లలో పరారీలో ఉన్న 274 మంది నేరస్తులను తిరిగి వెనక్కు తీసుకొచ్చారు.



# గుజరాత్‌లో ఉధృతమవుతున్న చండీపుర వైరస్

### 22 మంది మృతి.. మరో 35 మందికి వైరస్

**అహ్మదాబాద్, ఆగస్టు 4:** గుజరాత్‌లో చండీపుర వైరస్ మరోసారి కలకలం రేపుతోంది. ఈ వైరస్ కారణంగా ఇప్పటివరకు 22 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. మరో 35 మందికి వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. సాధారణ జ్వరంలా మొదలయ్యే ఈ ఇన్‌ఫెక్షన్ కొన్ని గంటల్లోనే మెదడుపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉండటంతో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. రాబ్డోవిరిడే కుటుంబానికి చెందినదే ఈ చండీపుర వైరస్ (సీహెచ్‌పీవీ). దీన్ని తొలిసారి 1965లో భారత్‌లో గుర్తించారు. వర్షాకాలంలో ఎక్కువగా కనిపించే శాండ్‌ఫ్లై వల్ల ఇది వ్యాపిస్తుంది. మనుషుల నుంచి మనుషులకు ఈ వైరస్ సోకినట్లు ఇప్పటివరకు ఆధారాలు లేవు. ఈ వైరస్ ఎక్కువగా 15 ఏళ్లలోపు చిన్నారులపై ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో, శాండ్‌ఫ్లైలు ఎక్కువగా ఉండే చోట్ల ప్రమాదం అధికంగా ఉంటుంది. వర్షాకాలంలో ఈగల సంఖ్య పెరగడంతో వైరస్ వ్యాప్తి కూడా ఎక్కువగా కనిపిస్తుంది.

వార్త

తక్కువ పదాలతో ఎక్కువ విషయాలు చెప్పడం మేధావుల లక్షణమైతే.. చెప్పేదేమీ లేకపోయినా ఎక్కువ పదాలు వినియోగించడం మూర్ఖుల లక్షణం.

- కాల్టన్

# జాప్యం వలయంలో 'న్యాయం'!

భారత న్యాయవ్యవస్థ ముందు పెండింగ్ కేసుల సమస్య అతిపెద్ద సవాలుగా మారింది. న్యాయం వేగంగా అందినప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. న్యాయ వ్యవస్థపై రోజురోజుకూ పెరుగుతున్న భారంతో కేసుల పెండింగ్ ఆందోళనకర స్థాయికి చేరుకుంది. జాతీయ న్యాయ డేటా గ్రిడ్ ప్రకారం దేశవ్యాప్తంగా సుప్రీంకోర్టు, దేశంలోని 25 హైకోర్టులు, జిల్లా/అనుబంధ కోర్టులలో కలిపి జిల్లా, అనుబంధ కోర్టుల్లోనే దాదాపు 5.64 కోట్ల పెండింగ్ కేసులు పెండింగ్లో ఉన్నాయి. సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో కూడా లక్షల సంఖ్యలో కేసులు విచారణ కోసం ఎదురుచూస్తున్నాయని నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ పేర్కొంది. కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌కు ఇచ్చిన తాజా సమాచారం ప్రకారం ప్రస్తుతం సుప్రీంకోర్టులో దశాబ్ద కాలం నాటి 10 వేలకుపైగా కేసులు, మూడు దశాబ్దాలకు చెందిన 80,660 కేసులు హైకోర్టులలో పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నాయి. సుప్రీం కోర్టులో 96వేలకు పైగా కేసులు పెండింగ్లో ఉన్నాయని రాజ్యసభలో కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. అలాగే, 558 కేసులు 20యేళ్లకు పైగా పెండింగ్లో ఉండగా, అత్యున్నత న్యాయస్థానంలో 26 కేసులు 30 యేళ్లకు పైగా పరిష్కారం కాలేదని ఆయన వివరించారు. ఇది న్యాయవ్యవస్థలో పెండింగ్లో ఉన్న కేసుల తీవ్రతను తెలియజేస్తోంది. అన్ని రంగాల్లోనూ సంస్కరణలు జరుగుతున్నట్లు ప్రజాస్వామ్యంలో అతి ప్రధానమైన న్యాయ రంగాల్లోనూ సంస్కరణలు జరుగుతున్నా అవి ప్రజలకు చేరడంలోనూ ఎంతో జాప్యం అవుతోంది. జాప్యానికి కారణాలేమిటంటే కేసుల సంక్లిష్టత,సమర్థ పరిష్కారం ఆధారపడి ఉంటుందనిమేఘ్వాల్ అన్నారు. హైకోర్టులు, దిగువ న్యాయవ్యవస్థలో ఖాళీలు కొనసాగుతున్నాయి. న్యాయమూర్తులు, న్యాయాధికారులు, సహాయక సిబ్బంది లభ్యతతో సహా, తగినంత న్యాయ సిబ్బంది, మౌలిక సదుపాయాలపై కూడా కేసుల కాల పరిష్కారం ఆధారపడి ఉంటుందని కేంద్రం పేర్కొంది. భారతీయ కోర్టులలో పెరుగుతున్న ఖాళీల కారణంగానే పెద్ద సంఖ్యలో కేసులు పెండింగ్లో ఉన్నాయని తెలుస్తోంది. సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచే సవరణ బిల్లు 2026కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. సీజేఐ సహా జడ్జీల సంఖ్యను 34 నుంచి 38కి పెంచేందుకు ఈ బిల్లును రూపొందించి తగినంత మంది కోర్టు సిబ్బంది, మౌలిక సదుపాయాల లభ్యతపై కూడా కేసుల సకాల పరిష్కారం ఆధారపడి ఉంటుందని పేర్కొంది. ప్రస్తుతం 25 హైకోర్టులలో మంజూరైన 1,122 మంది న్యాయమూర్తులకు గాను 341 న్యాయమూర్తుల ఖాళీలు ఉండగా, దిగువ న్యాయమూర్తులకు 7,311 ఖాళీలు కోర్టులలో మంజూరైన 30,868 మంది ఉన్నాయి. కేసుల పరిష్కార, వేగం ఖాళీలు కార్యాచరణ, విధానపరమైన అంశాలచే ప్రభావితమవుతుందని, కేంద్ర న్యాయశాఖ మంత్రి చెప్పారు. భారత రాజ్యాంగం ప్రతిపౌరుడికి హామీ ఇచ్చిన 'సకాలంలో న్యాయం' అనే ప్రాథమిక విలువను సాకారం చేయాల్సిన జాతీయ కర్తవ్యం. పెండింగ్ కేసులకు అనేక కారణాలున్నాయి. న్యాయమూర్తుల ఖాళీలు, కొత్త కోర్టుల కొరత, విచారణల్లో తరచూ వాయిదాలు, ప్రభుత్వశాఖలే అత్యధికంగా దావాలు వేయడం, దర్యాప్తు సంస్థల ఆలస్యం, సాక్షులు హాజరు కాకపోవడం, సాంకేతిక సిబ్బంది కొరత వంటి అంశాలు సమస్యను మరింత క్లిష్టం చేస్తున్నాయి. ప్రతి కేసు వెనుక ఒక కుటుంబం, ఒక బాధితుడు, ఒక వ్యాపారం లేదా ఒక పౌరుని హక్కు దాగి ఉంటుంది. న్యాయం కోసం సంవత్సరాల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తోంది. ప్రభుత్వం కూడా పార్లమెంట్లో ఇదే కారణాలను ప్రస్తావించింది. దేశంలో అత్యధిక జనాభా ఉన్న రాష్ట్రాల్లో కేసుల పెండింగ్ మరింత తీవ్రంగా ఉంది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, బీహార్,కర్ణాటక,గుజరాత్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో లక్షల నుంచి కోట్ల వరకు కేసులు పెండింగ్లో ఉన్నాయి. కొన్ని రాష్ట్రాల్లో ఐదేళ్లకు పైగా పెండింగ్లో ఉన్న కేసుల సంఖ్య కూడా గణనీయంగా ఉంది. అత్యంత ఆందోళనకర అంశం ఏమిటంటే, కొన్నికేసులు 20నుంచి30 సంవత్సరాలుగా కూడా తుదితీర్పు కోసం ఎదురుచూస్తున్నాయి. ఇటీవల వెల్లడైన వివరాల ప్రకారం దేశవ్యాప్తంగా 20సంవత్సరాలకు పైగా పెండింగ్లో ఉన్న కేసుల సంఖ్య 11లక్షలకు మించిపోయింది. ఇది న్యాయవ్యవస్థ వేగంపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది. అయితే ఆశాజనక పరిణామాలు కూడా ఉన్నాయి. న్యాయమూర్తుల నియామకాలను వేగవంతం చేయడం, ఖాళీలను భర్తీచేయడం, ప్రత్యామ్నాయవివాద పరిష్కార వ్యవస్థలు లోక్‌అదాలత్‌లను మరింత బలోపేతం చేయడం, ప్రభుత్వ వ్యాజ్యాలను తగ్గించడం,కేసుల నిర్వహణలో సమర్థత పెంచడం వంటి నిర్మాణాత్మక సంస్కరణలు అత్యవసరం.దర్యాప్తు సంస్థల ఆలస్యం, సాక్షులు హాజరు కాకపోవడం, ఫోరెన్సిక్ నివేదికలు ఆలస్యంగా రావడం, మౌలిక వసతుల కొరత వంటి అంశాలు కూడా విచారణను నెమ్మదింపజేస్తున్నాయి.భూవివాదాలు పరిష్కారం కాక రైతులు,పెట్టుబడిదారులు నష్టపోతారు. వాణిజ్య కేసులు ఆలస్యమైతే పరిశ్రమలు పెట్టుబడులు పెట్టడానికి వెనుకంజ వేస్తాయి. క్రిమినల్ కేసుల్లో ఆలస్యం వల్ల బాధితులకు న్యాయం దూరమవుతుండగా, నిర్దోషులు కూడా సంవత్సరాల తరబడి విచారణను ఎదుర్కోవాల్సి వస్తుంది.జైళ్లలో విచారణ పూర్తికాకుండానే వేలాది మంది ఖైదీలు ఉండటం మరో పెద్ద సమస్య. ఇది మానవహక్కుల కోణంలో కూడా ఆందోళన కలిగించే అంశం. పెండింగ్ సమస్యను పరిష్కరించాలంటే తాత్కాలిక చర్యలు సరిపోవు. సమగ్ర సంస్కరణలు అవసరం.



ఎన్నో కష్టనష్టాలు అనుభవించిన తరువాత కానీ, మనిషికి వినయం, వివేకం రాదు.

ఫ్రాంక్లిన్



సమర్థులైనవారే ఎప్పుడూ నాయకత్వం వహిస్తారు. అందరికీ మార్గదర్శకులవుతారు.

రాధాకృష్ణన్

# రిజర్వేషన్లకు ప్రత్యామ్నాయం ఏమిటి?

**అందరికీ సమాన నాణ్యతతో కూడిన విద్య, భూమి వంటి ఉత్పాదక వనరులపై న్యాయమైన ప్రాప్యత, వివక్ష లేని ఉపాధి, సంపదలో తీవ్రమైన అసమానతలు తగ్గిన ఆర్థిక వ్యవస్థ, అన్ని వర్గాలకు సహజమైన ప్రాతినిధ్యం, ఇలాంటి పరిస్థితులు ఏర్పడితే రిజర్వేషన్ల అవసరం సహజంగానే తగ్గుతుంది. కానీ ఈ పరిస్థితులను సృష్టించకుండా రిజర్వేషన్లను మాత్రమే తొలగించడం అంటే వ్యాధిని అలాగే ఉంచి మందులు తీసేయడమే. అందుకే భారత ప్రజాస్వామ్యం ముందున్న అసలు సవాలు రిజర్వేషన్లను సమర్థించాలా వ్యతిరేకించాలా అనేది కాదు. సమానత్వాన్ని నిరంతరం వాయిదా వేస్తున్న సామాజిక నిర్మాణాన్ని మార్చగలదా లేదా అనేదే. రిజర్వేషన్లకు ప్రత్యామ్నాయం రిజర్వేషన్లను రద్దు చేయడం కాదు. వాటి అవసరాన్ని అనవసరం చేసే వ్యవస్థను నిర్మించడం.**

ఆయిరబోయిన బిక్షపతి

కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పేముందు ఆ ప్రశ్న సరైనదేనా అని అడగాలి ఎందుకంటే ప్రజాస్వామ్యంలో ప్రతి చర్చ ఒకే విధంగా పుట్టదు. కొన్ని చర్చలు సమాజం అవసరం వల్ల వస్తాయి. మరికొన్ని రాజకీయాల అవసరం వల్ల వస్తాయి. ఈ రెండింటి మధ్య తేడా గుర్తించకపోతే సమాధానం ఎంత సరైనదైనా అది అసలు ప్రశ్న నుంచి తప్పించుకోవచ్చు. నేడు రిజర్వేషన్లపై జరుగుతున్న చర్చ కూడా అలాంటిదే. పైకిచూస్తే అది ఒక విధానం గురించి చర్చలా కనిపిస్తుంది. కానీ కొంచెం లోతుగా చూస్తే అది భారత ప్రజాస్వామ్యం తన గురించి తాను వేసుకోవాల్సిన ఒక పెద్ద ప్రశ్నను తాకుతుంది. అదే 'సామాజిక న్యాయం పూర్తయిందా'? ఈ ప్రశ్నకు సమాధానం తెలియకుండా దాన్ని సాధించే విధానాలపై తీర్పు చెప్పడం అంటే గమ్యానికి చేరామో లేదో చూడకుండానే ప్రయాణాన్ని ఆపేయాలని నిర్ణయించడం లాంటిది. జర్మన్ తత్వవేత్త యుర్గన్ హెబెర్మాస్ ఆధునికతను ఒక అసంపూర్ణ ప్రాజెక్టుగా అభివర్ణించాడు. ఈ భావనలోని అసలు బలం ఒకే మాటలో ఉంది. అసంపూర్ణమంటే విఫలం అని కాదు. ఇంకా పూర్తి చేయాల్సిన బాధ్యత మిగిలి ఉందని అర్థం. ప్రతిఅసంపూర్ణ ప్రాజెక్టుకు ముందు రెండు మార్గాలు ఉంటాయి. ఒకటి అది పూర్తి కాలేదు అని చెప్పి విఫలమైందని ప్రకటించడం. రెండోది ఎందుకు పూర్తికాలేదో అర్థం చేసుకొని దాన్ని పూర్తి చేసే బాధ్యతను స్వీకరించడం. భారత ప్రజాస్వామ్యం ముందు కూడా నేడు అదే ఎంపిక ఉంది. రిజర్వేషన్లపై చర్చ చివరికి ఆ ఎంపిక గురించే. రాజ్యాంగ నిర్మాతలు ఒక గొప్ప నైతిక సత్యాన్ని గుర్తించారు. చట్టం సమానత్వాన్ని ప్రకటించగలదు. కానీ చరిత్రను రద్దు చేయలేదు.ఎందుకంటే అసమానత అనేది కేవలం వర్తమాన సమస్య కాదు, వర్తమానంపై గతం చూపే ప్రభావం. అందుకే శతాబ్దాలుగా అవకాశాలకు దూరమైన వర్గాలకు ఇప్పటినుంచి అందరూ సమానం అని చెప్పడం న్యాయం కాదని వారు అర్థం చేసుకున్నారు. అందుకే సమానత్వాన్నీ కేవలం హక్కుల భాషలోనే కాదు అవకాశాల భాషలో కూడా నిర్వచించారు. రిజర్వేషన్లు ఆ తర్కం నుంచే పుట్టాయి. అవి ప్రత్యేక హక్కులు కాదు. చరిత్ర మూసివేసిన తలుపులను ప్రజాస్వామ్యం మళ్లీ తిరిగి రాయడానికి నిర్మించిన రాజ్యాంగబద్ధ వంతెన. ప్రపంచ ప్రజాస్వామ్యాల అనుభవం కూడా ఇదే చెబుతుంది. అమెరికా బానిసత్వం తర్వాత, దక్షిణాఫ్రికా అపార్థెయిడ్ తర్వాత, బ్రెజిల్ వర్ణ అసమానతల నేపథ్యంలో, కెనడా స్థానిక ప్రజల హక్కుల విషయంలో, న్యూజిలాండ్ మావోరీ ప్రజల రాజకీయ ప్రాతినిధ్యంలో. రూపాలు,పేర్లు వేరు కావచ్చు. కానీ ప్రతి సమాజం ఒకే సత్యాన్ని ఎదుర్కొంది. చరిత్ర సృష్టించిన అసమానతలను మార్కెట్ స్వయంగా సరిచేయదు. పోటీ కూడా సరి చేయదు. అందరికీ సమాన అవకాశం అనే నినాదం ఒకటే వాటిని తొలగించదు. ప్రజాస్వామ్యం కొన్నిసార్లు చరిత్రతో వాదించాల్సి వస్తుంది. ప్రత్యేక అవకాశాల విధానాలు ఆ వాదనలో భాగం. అవి సమానత్వానికి మినహాయింపులు కాదు. సమానత్వాన్ని వాస్తవం చేయటానికి ఉపయోగపడే మార్గాలు. రిజర్వేషన్లపై ప్రతి చర్చలో 'మెరిట్' అనే పదం తప్పనిసరిగా వినిపిస్తుంది. కానీ మెరిట్ అనేది అవకాశాల నుంచి వేరు చేసుకోగలిగే గుణం అయితే సమాజం ఎప్పుడో న్యాయబద్ధమై ఉండేది. నిజానికి మెరిట్ కూడా ఒక సామా



జిక నిర్మాణమే. ఒక పిల్లవాడు ఏ పాఠశాలలో చదివాడు, ఇంట్లో చదివే గదిఉందా, తల్లిదండ్రుల విద్యాస్థాయి ఏంటి, అతను ఆకలితో పాఠశాలకు వెళ్లాడా లేక ఆత్మవిశ్వాసంతో వెళ్ళాడా, కులం కారణంగా అవమానాన్ని ఎదుర్కొన్నాడా లేదా ఇవన్నీ అతని సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తాయి. అందువల్ల ప్రతిభను మాత్రమే చూసి మెరిట్‌ను కొలవడం అంటే అవకాశాలను కల్పించినట్లు నటించడం. అసమాన ప్రారంభ రేఖలతో పందెం పెట్టి గెలిచిన వారిని ప్రతిభావంతులని ప్రకటించినట్టే. ప్రపంచానికి మరో నైతిక కొలమానం ప్రాతినిధ్యం. ప్రాతినిధ్యం రాజకీయ నినాదం కాదు. ప్రజాస్వామ్య నైతికత. న్యాయస్థానాల్లో, విశ్వవిద్యాలయాల్లో, శాసనసభల్లో, పరిపాలన వ్యవస్థలో,సమాజంలోని అన్ని వర్గాలు కనిపించాలి. ఎందుకంటే రాష్ట్రం కేవలం అధికారం నిర్మాణం కాదు. సమాజం తనను తాను చూసుకునేఅద్దం. ఆ అద్దంలో కొన్ని వర్గాలు మాత్రమే కనిపిస్తే మిగిలినవారికి ప్రజాస్వామ్యం ఒక వాగ్దానంగా మిగులుతుంది. అనుభవంగా మారదు. అందుకే ప్రాతినిధ్యం అనేది రాజకీయ రాయితీ కాదు. ప్రజాస్వామ్య నాణ్యతకు అవసరమైన షరతు. అయితే రిజర్వేషన్ల గురించి ఏ నిర్ణయానికైనా రాకముందు ఆషరతు నిజంగా నెరవేరిందా అనే కనీస ప్రాథమిక ప్రశ్నలనైనా మనకు మనమే వేసుకోవాలి. అది కులం మనిషి అవకాశాలను, ఆత్మ గౌరవాన్ని, జీవిత గమనాన్ని, ఏమాత్రం ప్రభావితం చేయడం లేదని ధైర్యంగా ప్రకటించగలమా? పుట్టుక కాదు ప్రతిభ మాత్రమే ప్రతి వ్యక్తి భవిష్యత్తును నిర్ణయిస్తుందని నిస్సందేహంగా చెప్పగలమా? మొత్తానికి సామాజిక న్యాయం పూర్తయిందని నిజంగా చెప్పగలమా? ఈ ప్రశ్నలు దీనికైనా నిజాయితీగా 'అవును' అని చెప్పగలిగితేనే రిజర్వేషన్ల అవసరం ముగిసింది అని చెప్పవచ్చు. లేకపోతేసమస్య ఇంకా కొనసాగుతుండగానే పరిష్కారం పూర్తయిందని ప్రకటించినట్లు అవుతుంది. ఇలాంటి సమయంలోనే రిజర్వేషన్లపై చర్చ మళ్లీ రాజకీయ కేంద్రంగా మారడం గమనించదగిన విషయం. రాజకీయాలు ఎప్పుడు సమస్యలు మాత్రమే పరిష్కరించవు. ప్రజలు ఏ సమస్య గురించి మాట్లాడాలో కూడా నిర్ణయిస్తాయి. నిరుద్యోగం, పరీక్షల నిర్వహణ, విద్యాసంక్షోభం, పెరుగుతున్న అసమానతలు చర్చలో ఉన్న ఈ సమయంలో రిజర్వేషన్లను కేంద్ర అంశాలుగా నిలబెట్టడం వెనుక రాజకీయ సందర్భాన్ని విస్మరించడం కష్టం. రిజర్వేషన్ల పట్ల విముఖతను వ్యక్తం చేస్తూ వచ్చిన రాజకీయ సైద్ధాంతిక వైఖరి నేపథ్యంలో ఈ చర్చను విశ్లేషించడం సహజమే. అయితే రాజకీయ ఉద్దేశం ఏదైనా కావచ్చు. కానీ సమాజం అడగాల్సిన ప్రశ్న మాత్రం వేరే. 'రిజర్వేషన్ల స్థానంలో సామాజిక న్యాయాన్ని మరింత సమర్థంగా సాధించే వ్యవస్థ ఏమిటి'? ఈ ప్రశ్నకు సమాధానం ఇప్పటివరకు స్పష్టంగా వినిపించలేదు. ఎందుకంటే ప్రత్యామ్నాయం అనేది ఒక నినాదం కాదు. ఒక సామాజిక నిర్మాణం. కులం అవకాశాలను నిర్ణయించనీ సమాజం. అందరికీ సమాన నాణ్యతతో కూడిన విద్య. భూమి వంటి ఉత్పాదక వనరులపై న్యాయమైన ప్రాప్యత. వివక్ష లేని ఉపాధి. సంపదలో తీవ్రమైన అసమానతలు తగ్గిన ఆర్థిక వ్యవస్థ, అన్ని వర్గాలకు సహజమైన ప్రాతినిధ్యం, ఇలాంటి పరిస్థితులు ఏర్పడితే రిజర్వేషన్ల అవసరం సహజంగానే తగ్గుతుంది. కానీ ఈ పరిస్థితులను సృష్టించకుండా రిజర్వేషన్లను మాత్రమే తొలగించడం అంటే వ్యాధిని అలాగే ఉంచి మందులు తీసేయడమే. అందుకే భారత ప్రజాస్వామ్యం ముందున్న అసలు సవాలు రిజర్వేషన్లను సమర్థించాలా వ్యతిరేకించాలా అనేది కాదు. సమానత్వాన్ని నిరంతరం వాయిదా వేస్తున్న సామాజిక నిర్మాణాన్ని మార్చగలదా లేదా అనేదే. రిజర్వేషన్లకు ప్రత్యామ్నాయం రిజర్వేషన్లను రద్దు చేయడం కాదు. వాటి అవసరాన్ని అనవసరం చేసే వ్యవస్థను నిర్మించడం. కానీ ఆ సమాజాన్ని నిర్మించే దిశగా మనం నిజంగా ప్రయాణిస్తున్నామా? లేక రిజర్వేషన్లనే ప్రశ్నిస్తూ వాటిని అనివార్యం చేసిన సామాజిక నిర్మాణాన్ని యధాతథంగా కొనసాగిస్తున్నామా? భారత ప్రజాస్వామ్యం చివరికి సమాధానం చెప్పాల్సింది ఈ ప్రశ్నకే. •

# ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ రానున్నదా?


దాడిశెట్టి శ్యామ్ కుమార్

విద్యా వ్యవస్థలో ఆధునిక పోకడలకు అనుగుణంగా ప్రభుత్వాలు విద్యపై ప్రత్యేక దృష్టి సారించడం తద్వారా ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసే రీతిలో రాష్ట్రాల్లో అమలవుతున్న విద్యావిధానం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందనే భిన్నాభిప్రాయాలు లేకపోలేదు. ప్రభుత్వ పాఠశాలల మౌలిక సదుపాయాలు మెరుగుపరచడంతో పాటు విద్యావిధానంలో బోధనా అభ్యసనంలో విద్యార్థుల ప్రగతికి తోడ్పడే విధంగా తెలుగు,ఇంగ్లీష్ మాధ్యమాల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశలో ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఉండడం గమనార్హం. విద్యలో డిజిటల్ విద్యావిధానం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించడం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను ఆకర్షించే రీతిలో ఉంటున్నాయని అనిపిస్తుంది. విద్యార్థులకు విశాలమైన ఆట స్థలాలు మౌలిక సదుపాయాలు మెరుగైన శానిటేషన్ వ్యవస్థ, త్రాగునీరు, మధ్యాహ్న భోజనంతోపాటు కొన్ని రాష్ట్రాలు పైలెట్ ప్రాజెక్టుగాఅల్పాహారం అందిస్తున్న క్రమంలో ఉపాధ్యాయులను కూడా ఇందులో భాగస్వామ్యం చేయడం విద్యార్థులు తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలపై తమ పిల్లలపై శ్రద్ధ వహించే రీతిలో ప్రభుత్వ పాఠశాలలు ఉంటున్నాయనే భావన కల్పించే రీతిలో ప్రధానంగా విద్యాశాఖను నిర్వహిస్తున్నటువంటి మంత్రులు ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను సమాజం గుర్తించే విధంగా రాజకీయాలకతీతంగా తోడ్పాటు అందిస్తుండడంతో అన్నివర్గాల ప్రజలు ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చదివించడానికి ఆసక్తిని కనబరుస్తున్నారు అనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాల అభ్యున్నతికి విద్యా కమిటీలు గ్రామయువజన సంఘాలు స్థానికంగా ఉన్నటువంటి విద్యార్థులతల్లిదండ్రులు ప్రభుత్వపాఠశాలల్లో విద్యార్థుల నమోదుఉంటేనే భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాల మనుగడకు అవకాశం ఉంటుందనే విషయ అవగాహన చేసుకోవాలి. స్థానికంగాఉండే ప్రభుత్వ పాఠశాలను మెరుగుపరుచుకునే రీతిలో ప్రభుత్వ పథకాలను సాధ్యమైనంతగా వినియోగించుకుంటూ బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలవైపు మొగ్గుచూపే విధంగా ఉపాధ్యాయులు, విద్యా కమిటీలు సంయుక్త సహకారంతో బడిబాట లాంటి కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు విద్యార్థులను అధిక సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలు చేర్పించి నాణ్యమైన విద్యను అందించే విధానంలో బాధ్యతాయుతమైన పాత్రను మరింత పోషించాల్సి ఉంది. ఈ క్రమంలో సమాజంలోని వారందరూ ఆర్థికస్తోమతతో నిమిత్తం లేకుండా తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తే రాబోవు కాలంలో ప్రవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు ఉచితమైన నాణ్యమైన విద్యావిధానం ప్రతి ఒక్కరికి పూర్తిస్థాయిలో అందుతుందని అనుకునేవారు లేకపోలేదు. విద్యావ్యవస్థలో వస్తున్న మార్పుల గురించి అవగాహనతో ఉన్న సంబంధిత శాఖఅధికారులు, మంత్రులు ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నతమైన విద్యాబోధనను విద్యార్థులకు అందించే రీతిలో ఏర్పాటైన విద్యా కమిటీలు కూడా ప్రభుత్వంతో సమన్వయంగా ఉంటూ ఆశించిన స్థాయిలో విద్యా సంస్కరణల అమలు విధానాలపైన ఎప్పటికప్పుడు స్పందిస్తూ విద్యావిధానంలో ఎదురయ్యే సమస్యలపై విభిన్న కోణాల్లో ఆలోచిస్తూ ప్రాథమిక స్థాయి నుండి విద్యార్థులకు ఆధునిక బోధనా విధానాలను అమలుపరచడంలో సఫలీకృతం కావడానికి మరింత ప్రయత్నించాలి అని కోరుకునే వారు లేకపోలేదు. అంతేకాకుండా సంబంధిత ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులలో ఆధునిక నూతన భావనలను కలిగించడానికి శాస్త్రసాంకేతిక విద్యపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవడానికి ప్రభుత్వ విద్యారంగంలో అన్నిపాఠశాలలో క్రమక్రమంగా సాంకేతిక ఉపకరణాలు వినియోగించుకునే అవకాశంఉండడంతో సంబంధిత ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణఇస్తుండటంతో రాబోవు కాలంలో ప్రభుత్వ పాఠశాలలు మరింత ఆధునికతను సంతరించుకుంటాయి అనిఅనిపిస్తుంది.విద్యారంగ అభివృద్ధికి ఎమ్మెల్సీల పాత్రకూడా చాలా ముఖ్యమైనది. రాజకీయాలకతీతంగా రాష్ట్రాల్లో విద్యను ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే విధానంలో విద్యా శాఖకు సంబంధించి శాసనమండలి సభ్యులు కూడా చాలా వరకు ప్రభుత్వ పాఠశాలలో నూతన సంస్కరణల విషయంలో ప్రభుత్వానికి సలహాలుసూచనలు ఇస్తూనే ఎదురవుతున్న సమస్యలపై మరింత ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈక్రమంలో తరచూ ఉపాధ్యాయ సంఘాలు ఎమ్మెల్సీలు ప్రభుత్వపాఠశాల బలోపేతానికి కావలసినఅంశాలపై వీలైనప్పుడల్లా సంబంధిత విద్యాశాఖతో చర్చ జరుపుతూ ఉండడం రాబోకాలంలో ప్రభుత్వ పాఠశాల విద్య మరింత బలోపేతం కావడానికి అవకాశం ఉంటుంది. •

# ఇథనాల్ మిశ్రమ పెట్రోలు ఎంతవరకు మేలు?

తిప్పర్తి శ్రీనివాస్

దేశ అభివృద్ధికి ఇంధనం ఎంత ముఖ్యమో, ఇంధన భద్రత అంతకంటే ముఖ్యమైనది. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు రాజకీయ, ఆర్థిక పరిణామాలకు అనుగుణంగా తరచూ మారుతూ ఉంటాయి. చమురు దిగుమతులపై అధికంగా ఆధారపడే భారతదేశం వంటి దేశానికి ఈ పరిస్థితి తీవ్రమైన సవాలుగా మారుతోంది. ఇలాంటి సమయంలో ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్నిప్రోత్సహించడం కేంద్ర ప్రభుత్వానికి ఒక వ్యూహాత్మక అవసరంగా మారింది. ఈ క్రమంలోనే పెట్రోల్‌లో ఇథనాల్‌ను కలిపివినియోగించే విధానాన్ని ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోంది. అయితే ఈ నిర్ణయం దేశ ప్రయోజనాలకు ఎంత వరకు ఉపయోగపడుతుంది? వినియోగదారులపై దీని ప్రభావం ఏమిటి? అనే అంశాలపై సమగ్ర చర్చ అవసరం. ఇథనాల్ అనేది చెరకు, మొక్కజొన్న, విరిగిన బియ్యం, ఇతర ధాన్యాలు, అలాగే వ్యవసాయ అవశేషాల నుంచి తయారయ్యే జీవ ఇంధనం. పెట్రోల్‌లో దీనిని నిర్దిష్ట శాతంలో కలిపి వినియోగిస్తారు. ప్రస్తుతం ఇ10, ఇ20 వంటి మిశ్రమ ఇంధనాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. అంటే వరుసగా 10 శాతం, 20 శాతం ఇథనాల్ కలిగిన పెట్రోల్ అన్నమాట. ప్రపంచంలోని అనేక దేశాలు ఇప్పటికే ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నాయి. భారత్ కూడా ఇంధన దిగుమతుల వ్యయాన్ని తగ్గించడం, కార్బన్ ఉద్గారాలను నియంత్రించడం, రైతులకు అదనపు ఆదాయం కల్పించడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తోంది. ఇథనాల్ మిశ్రమ పెట్రోల్‌కు ఉన్న ప్రధాన ప్రయోజనం విదేశీ చమురుపై ఆధారపడటాన్నితగ్గించడమే. ప్రతి సంవత్సరం ముడి చమురు దిగుమతుల కోసం దేశం లక్షల కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్యాన్ని వెచ్చిస్తోంది. పెట్రోల్‌లో కొంత భాగాన్ని దేశీయంగా ఉత్పత్తి చేసిన ఇథనాల్‌తో భర్తీచేయడం ద్వారా ఆ వ్యయాన్ని తగ్గించే అవకాశం ఉంటుంది. ఇది కేవలం ఆర్థిక ప్రయోజనం మాత్రమే కాదు,ఇంధన భద్రతను బలోపేతం చేసే చర్య కూడా.అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగినా, దేశీయ ఇంధన సరఫరాపై కొంత మేర ప్రభావం తగ్గుతుంది. వ్యవసాయ రంగానికి కూడా ఈ విధానం కొత్త అవకాశాలను తెరుస్తోంది. చెరకు, మొక్కజొన్న వంటి పంటలకు అదనపు డిమాండ్ ఏర్పడటం వల్ల రైతులకు మార్కెట్ విస్తరిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇథనాల్ ఉత్పత్తి పరిశ్రమలు ఏర్పడితే ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో ఇది ఒక ముఖ్యమైన అడుగుగా చెప్పవచ్చు. పర్యావరణ పరిరక్షణ కోణంలో చూస్తే కూడా ఇథనాల్ మిశ్రమ ఇంధనం కొంత మేర ప్రయోజనకరమే. పెట్రోల్‌తో పోలిస్తే ఇథనాల్ దహనం సమయంలో కొన్ని హానికర ఉద్గారాలు



తగ్గుతాయి. వాతావరణ మార్పులను నియంత్రించేందుకు ప్రపంచ దేశాలు చేస్తున్న ప్రయత్నాల్లో ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగం కీలకంగా మారింది. ఆ దిశగా భారతదేశం తీసుకుంటున్న ఈ చర్యను సానుకూలంగానే చూడాలి. అయితే ఈ విధానానికి విమర్శలు కూడా లేకపోలేదు. ఇథనాల్‌లో శక్తిసాంద్రత పెట్రోల్ కంటే తక్కువగా ఉంటుంది. అందువల్ల కొన్ని వాహనాల్లో మైలేజ్ స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది. సాధారణ వినియోగదారుడు ముందుగా గమనించే అంశం ఇదే. ఇంధనం ఆదా అవుతుందని భావించిన చోట, ఎక్కువ ఇంధనం వినియోగించాల్సి వస్తే అసంతృప్తి సహజం. కాబట్టి ఈ విషయంపై ప్రభుత్వం, ఆయిల్ కంపెనీలు పారదర్శకంగా సమాచారం అందించాల్సిన బాధ్యత ఉంది. ప్రస్తుతం తయారవుతున్న అనేక కార్లు, ద్విచక్ర వాహనాలు ఇ20 ఇంధనానికి అనుగుణంగా రూపొందించ బడుతున్నాయి. కానీ పది లేదా పదిహేనేళ్ల క్రితం తయారైన వాహనాల్లోని కొన్ని రబ్బరు భాగాలు, సీల్స్, ఫ్యూయల్ పంపులు అధిక ఇథనాల్ మిశ్రమాన్ని తట్టుకునేలా ఉండకపోవచ్చు. ఇలాంటి వాహనాల్లో దీర్ఘకాలం అధిక ఇథనాల్ కలిగిన పెట్రోల్ ఉపయోగిస్తే నిర్వహణ వ్యయం పెరిగే అవకాశాన్ని పూర్తిగా తోసిపుచ్చలేం. అందువల్ల తయారీ సంస్థ సూచనలను పాటించడం అత్యంత అవసరం. ప్రభుత్వం కూడా ఈ మార్పును ప్రజలపై బలవంతంగా మోపకుండా, అవగాహనతో అమలు చేయాలి. ఏ వాహనాలు ఇ-20కు అనుకూలం? పాత వాహనాల యజమానులు ఏ జాగ్రత్తలు తీసుకోవాలి? మైలేజ్‌లో ఎంత మార్పు రావచ్చు? వంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలి. ప్రజల్లో అవగాహన పెరిగితే అపోహలు తగ్గుతాయి. లేకపోతే సాంకేతిక కారణాల కంటే పుకార్లే ఎక్కువ ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఇథనాల్ ఉత్పత్తి విషయంలో కూడా సమతుల్య దృష్టి అవసరం. ఆహార పంటలను అధికంగా ఇంధన ఉత్పత్తికి మళ్లిస్తే భవిష్యత్తులో ఆహార భద్రతపై ప్రభావం పడే అవకాశం ఉంది. కాబట్టి వ్యవసాయ వ్యర్థాలు, బయోమాస్, ఇతర రెండో తరం ముడిపదార్థాల నుంచి ఇథనాల్ ఉత్పత్తిని ప్రోత్సహించడం మరింత స్థిరమైన పరిష్కారం అవుతుంది. ఇది రైతులకు, పర్యావరణానికి, దేశ ఆర్థికవ్యవస్థకు దీర్ఘకాలంలో మరింత మేలు చేస్తుంది. మొత్తంగా చూస్తే, ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ అనేది దేశఇంధన విధానంలో ఒక ముఖ్యమైన సంస్కరణ. దీనిని కేవలం మైలేజ్ కోణంలో మాత్రమే అంచనా వేయడం సరైందికాదు. అలాగే జాతీయ ప్రయోజనాల పేరుతో వినియోగదారుల ఆందోళనలను విస్మరించడం కూడా సమంజసం కాదు. దేశ ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణ, రైతుల సంక్షేమం, వాహనదారుల విశ్వాసం ఈ నాలుగు అంశాల మధ్య సమతుల్యత సాధించినప్పుడే ఈ విధానం ఆశించిన ఫలితాలను ఇస్తుంది. ఇంధన స్వావలంబన ఒక్కరోజులో సాధ్యమయ్యే లక్ష్యం కాదు. అది సాంకేతికత, శాస్త్రీయ ప్రణాళిక, ప్రజల సహకారం, పారదర్శక పాలన అనే నాలుగు స్తంభాలపై నిలబడాలి. ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ ఆ ప్రయాణంలో ఒక కీలక అడుగు. ఆ అడుగు ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటూ ముందుకు సాగితేనే అది నిజమైన విజయంగా నిలుస్తుంది. •

## ప్రజావాక్కు



### మారుతున్న జీవనశైలి

**భారతీయుల్లో** అధిక శాతం మంది రక్తంలోని కొవ్వు సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారనివెల్లడించిన ఐసీఎంఆర్ నివేదిక ప్రతి ఒక్కరికీ ఒకహెచ్చరికగా భావించాలి. మారుతున్న జీవనశైలి, శారీరక శ్రమ తగ్గడం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పెరుగుతున్న ఒత్తిడి, క్రమం తప్పకుండా ఆరోగ్యపరీక్షలు చేయించుకోకపోవడం వల్ల గుండె జబ్బులు, పక్షవాతం వంటి సమస్యల ప్రమాదం పెరుగుతోంది. ముఖ్యంగా యువతలో కూడా ఈ సమస్యలు కనిపించడం ఆందోళన కలిగించే విషయం. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స చేయడం ఎంత ముఖ్యమో, వాటిని ముందుగానే నివారించడం కూడా అంతే అవసరం. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచారకార్యక్రమాలునిర్వహించాలి. పాఠశాలలు, కార్యాలయాల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించాలి.క్రమంతప్పకుండా లిపిడ్‌పరీక్షలు చేయించుకోవడం,ప్రతిరోజూ వ్యాయామం చేయడం వంటి అలవాట్లు ఆరోగ్య పరిరక్షణకు దోహదపడతాయి.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### విలువల పతనం

**ఎన్నికల్లో** ఓడిపోయినపార్టీకి చెందిన ఎమ్మెల్యే, ఎమ్.పి, మంత్రులు కిందిస్థాయి నాయకులు అధికారంలోకి వచ్చిన పార్టీలోకి క్యూ కడుతున్నారు. తమకు అవకాశం ఇచ్చి ప్రోత్సహించిన వారి పట్ల తమ రాజకీయ ఎదుగుదలకు కారణమైన వారిపట్ల ఏమాత్రం కృతజ్ఞత చూపకుండా వెన్నుపోటుపొడుస్తున్నారు. అన్నిరాష్ట్రాల్లో ఇలా జరగటం సర్వసాధారణమైపోయింది. వీరు క్షమార్హులు కాదు.

- మిథునం, హైదరాబాద్

### మన భాషను మనమే అభివృద్ధి చేయాలి

**మన** మాతృభాష తెలుగు ప్రాముఖ్యాన్ని పెంచే పుస్తక మహోత్సవాలు,భాషాభివృద్ధి సభలు జరుగుతున్న సందర్భాల్లో మనంహాజరుకాకపోవడం కన్నా దాన్ని మనం, మనపిల్లలు ఆంగ్లంతో పాటు మాతృభాష మరింత పట్టు వచ్చేట్లు ఇంటివద్ద నేర్పించాలి. ఉపాధి దృష్టిలో పరీక్షల కోసం ఆంగ్లం అవసరమైన ,తెలుగులో కూడా పరిజ్ఞానం విషయాలను మనస్సులో అర్థంచేసుకునేందుకు సులువుగా ఉంటుంది. దీనివల్ల అనువాద ప్రక్రియ సులువుగా ఉంటుంది. మన భాషను మనమే అభివృద్ధి చేయడం విద్యావంతులు, తల్లి తండ్రులు బాధ్యత వహించాలి.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

### 'సర్'పై దుష్ప్రచారం

**మహాభారతంలో** శకుని మాయపాచికలతో పాండవులను మోసం చేసి వారి రాజ్యాన్ని కాజేసినట్టు ఎన్నికలు వచ్చినప్పుడల్లా బిజెపి వాళ్లు తమ అధికార బలాన్ని ఉపయోగించి తిమ్మిని బమ్మిని, బమ్మిని తిమ్మిని చేస్తూ ఓట్లను అటుఇటు చేస్తూ మొత్తానికి ఎలాగోలా తాము అనుకున్నది సాధిస్తున్నారు. తమ ప్రత్యర్థులను గెలవకుండా చేస్తున్నారు. వారిని శాశ్వత అజ్ఞాన వాసులుగా మారుస్తున్నారు. ఒక వంక నీతి న్యాయం, సనాతనధర్మం రాముడుదేవుడు అనే కబుర్లు చెబుతూ మరోవంక అధికారంకోసం అడ్డదారులు తొక్కుతున్నారు.

- శాస్త్రి, హైదరాబాద్

### పెరుగుతున్న వలసలు

**మొరాకో** నుండి స్పెయిన్ దేశానికి వలసలు వెల్లువలా కొనసాగుతున్నాయి. ఉపాధి లేక వాళ్ళుసముద్రాల ద్వారా స్పెయిన్ దేశానికి చేరుకుంటున్నారు. ఈ ఇదులాటలో 20 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. ఒక వైపు సంపన్న దేశాలు తమ ఉనికిని కాపాడుకోవడం కోసం చేసే ప్రయత్నం ఒకవైపు కొన్ని దేశాలు సంపన్న దేశాలుగా ఉండి తన స్థిరత్వం కోసం పోరాడుతున్నాయి. దేశాలు ఉపాధి కల్పించడం లో విఫలం అయినందువల్లే ఈవలసలు కొనసాగుతున్నాయి. ఎందుకంటే ఉపాధి అనేది మౌలిక సమస్య అది గుర్తించి తగు విధంగా చర్యలు తీసుకోవాలి. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఉద్యమానికి చలించని ప్రభుత్వం ఇప్పుడెందుకు చలించింది. ఈ ఉద్యమంలో మధ్యతరగతి వర్గం పిల్లలు మాత్రమేకాదు వారి తల్లి దండ్రులు కూడాపాల్గొన్నారు. అదేవారికి కనువిప్పు అయింది.

- భారత అవినాష్, జనగామ

### ఉద్యమకారులకు ప్రభుత్వ గుర్తింపు ఇవ్వాలి

**తెలంగాణ** ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ప్రజల్లో నుండి పౌరులను, ఉద్యమకారులుగా గుర్తించాలి. తెలంగాణ రాష్ట్ర సాధనఉద్యమంలో పౌరులు,మీడియా,రచనపరు, జర్నలిస్టులు, రిపోర్టర్లు, ఫోటోజర్నలిస్టులు, కెమెరామెన్‌లు, మీడియా యాజమాన్యాలు ఎన్నో కష్టనష్టాలను భరిస్తూ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, ఉద్యమ స్ఫూర్తిని ప్రతి గ్రామానికి చేర్చడంలో, తెలంగాణఆకాంక్షను దేశవ్యాప్తంగా వినిపించడంలో అత్యంత కీలకమైన పాత్ర పోషించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి ఉద్యమకారు పౌరులతోపాటు రచయితలు మీడియా కూడా ఒక ఉద్యమ శక్తిగా పనిచేశారు. ఆర్థిక ఇబ్బందులు, ఉద్యోగ భద్రత లేని పరిస్థితులను ఎదుర్కొంటూ ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటిచెప్పారు.

-సింగు. లక్ష్మీనారాయణ, కరీంనగర్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# రోజూ రగడ.. సాగని పార్లమెంటు




## 'జీరో అవర్'ను మింగేస్తున్న ప్రతిపక్షం

### వరుస వాయిదాలతో స్తంభిస్తున్న ఉభయ సభలు

### అత్యవసర బిల్లులకే ఆమోదముద్ర

**న్యూఢిల్లీ, ఆగస్టు 4:** పార్లమెంట్‌లో ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్‌ను ప్రతిపక్ష సభ్యులు పదేపదే అడ్డుకుంటున్నారని, దీంతో ప్రజలకు సంబంధించిన కీలక అంశాలను సభ దృష్టికి తీసుకురావడానికి ఎంపీలకు అవకాశం లేకుండా పోతోందని బిజెపి ఎంపీ సంబిత్ పాత్ర ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా నినాదాలు, ఆందోళనలు, గందరగోళం కారణంగా సభలు వాయిదా పడటం సాధారణమే అయినప్పటికీ, ఈ యేడాది వర్షాకాల సమావేశాలు అత్యంత నిరుత్సాహకరంగా సాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ యేడాది మాన్సూన్ సమావేశాలు గతనెల 20న ప్రారంభమై ఆగస్టు 13 వరకు కొనసాగనున్నాయి. ఆగస్టు 4 నాటికి మొత్తం 12 సమావేశ దినాలు పూర్తయ్యాయి. అయితే నీట్ ప్రశ్నాపత్రం లీక్ అంశం, రామ మందిర విరాళాల దొంగతనం వ్యవహారాలపై ప్రతిపక్ష నిరసనల కారణంగా సభా కార్యక్రమాలు పలుమార్లు అంతరాయం ఎదుర్కొన్నాయి. మొదటి వారంలోనే లోక్‌సభ, రాజ్యసభలు వరుస వాయిదాలతో దాదాపు స్తంభించిపోయాయి. లోక్‌సభ మొత్తం నిర్ణయించిన సమయంతో పోలిస్తే కేవలం 1.6 గంటలు మాత్రమేపనిచేయగా, ఇది కేటాయించిన సమయంలో కేవలం 5 శాతం మాత్రమే. రాజ్యసభ కూడా కేవలం 1.7 గంటలు మాత్రమే సమావేశమై, మొత్తం సమయంతో పోలిస్తే 6 శాతం మాత్రమే పనిచేసినట్లు సమాచారం. గతనెల 27న ఉభయ సభలు రోజంతా వాయిదా పడ్డాయి. జూలై 31న జనన-మరణాల నమోదు (సవరణ) బిల్లును చర్చ లేకుండానే లోక్‌సభ ఆమోదించినప్పటికీ, అనంతరం రెండు సభలు ముందుగానే వాయిదా పడ్డాయి. ఈ సమావేశాల్లో ఇప్పటివరకు ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్ ఒక్కసారి కూడా పూర్తిస్థాయిలో నిర్వహించలేకపోయాయి. తొలుత నీట్ పేపర్ లీక్ అంశం, అనంతరం రామమందిర దొంగతనం వివాదంపై ప్రతిపక్ష ఆందోళనల కారణంగా సభా కార్యకలాపాలు నిలిచిపోయాయి.

**రూ.190 కోట్ల ప్రజాధన వృధా**

అధికారుల అంచనాల ప్రకారం పార్లమెంట్ నిర్వహణకు ప్రతి నిమిషానికి సుమారు రూ.2.5 లక్షల వ్యయం అవుతుంది. అంటే ఒక్క సమావేశ దినానికి దాదాపు రూ.9 కోట్ల వరకు ఖర్చు అవుతోంది. ఇందులో మౌలిక సదుపాయాలు, సిబ్బంది, భద్రత, లాజిస్టిక్స్, ఎంపీల భత్యాలు వంటి వ్యయాలు ఉంటాయి. 12 సమావేశ దినాలకు కేటాయించిన మొత్తం 144 గంటల్లో సుమారు 95 శాతం సమయం వాయిదాలకే పరిమితమైనట్లు అంచనా.

దీంతో ఈ సమావేశాల కాలంలోనే రూ.150 కోట్ల నుంచి రూ.190 కోట్ల వరకు ప్రజాధనం వృథా అయి ఉండొచ్చని అంచనాలు సూచిస్తున్నాయి. గత సమావేశాల గణాంకాలను పరిశీలిస్తే, ఈ మాన్సూన్‌సమావేశాలు ఇటీవలి కాలంలో అత్యంత తక్కువ పనితీరు కనబరిచిన సమావేశాల్లో ఒకటిగా నిలిచే అవకాశముంది. 2025 మాన్సూన్ సమావేశాల కంటే కూడా అధ్వాన్నంగా ఉన్నాయని విశ్లేషణలు పేర్కొంటున్నాయి.

**కీలక బిల్లులకు ఆమోదం**

సభలో అంతరాయాలు కొనసాగుతున్నప్పటికీ, రెండు కీలక బిల్లులు మాత్రం పార్లమెంట్ ఆమోదం పొందాయి. వాటిలో జాతీయ గౌరవానికి అవమానాల నిరోధక బిల్లు మరియు ప్రజా పరీక్షల్లో అక్రమాలకు నిరోధక (యాంటీ పేపర్ లీక్) సవరణ బిల్లు ఉన్నాయి. వందే మాతరం బిల్లు ప్రకారం జాతీయ పతాకం, రాజ్యాంగం, జాతీయ గీతంతో పాటు జాతీయ గానం వందేమాతరంను అవమానించడం కూడా శిక్షార్హ నేరంగా పరిగణించబడుతుంది.

ఉద్దేశపూర్వకంగా వందే మాతరం ఆలాపనను అడ్డుకోవడం లేదా సభల్లో అంతరాయం కల్పించడం వంటి చర్యలకు గరిష్ఠంగా మూడు సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది. ఈ బిల్లుకు జూలై 29న రాజ్యసభ, జూలై 30న లోక్‌సభ ఆమోదం తెలిపాయి. అదేవిధంగా, పరీక్షల్లో మోసాలు, ప్రశ్నాపత్రాల లీకులు, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా జరిగే అక్రమాలను మరింత కఠినంగా అరికట్టేందుకు 2024 చట్టానికి సవరణగా యాంటీ పేపర్ లీక్ బిల్లును తీసుకొచ్చారు.

సవరణల ప్రకారం నిందితులకు 5 నుంచి 10 సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు గరిష్ఠంగా రూ.50 లక్షల వరకు జరిమానా విధించే నిబంధనలు ప్రతిపాదించారు.




## ట్రంప్ కొత్త సుంకాలపై కోర్టుకెక్కిన 25 రాష్ట్రాలు

**వాషింగ్టన్, ఆగస్టు 4:** సుంకాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీసుకున్న నిర్ణయం ఇప్పుడు న్యాయపరమైన చిక్కుల్లో పడింది. భారత్‌తో సహా 60 భాగస్వామ్య దేశాలపై ట్రంప్ విధించిన కొత్త పన్నులను సవాలు చేస్తూ.. అమెరికాలోని 25 డెమోక్రటిక్ పార్టీ నేతృత్వంలోని రాష్ట్రాలు కోర్టును ఆశ్రయించాయి. ట్రంప్ ప్రభుత్వం తమ చట్టబద్ధమైన పరిమితులను దాటి వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ దావా వేశాయి. న్యూయార్క్‌లోని 'యుఎస్ కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్'లో 25 రాష్ట్రాల కూటమి ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. వెట్టి చాకిరీ ద్వారా తయారు చేసిన వస్తువుల దిగుమతులపై సరైన నిషేధం అములు చేయడం లేదనే ఆరోపణలతో గత నెలలో ట్రంప్ ప్రభుత్వం సుంకాలను విధించింది. భారత్ సహా దాదాపు 60 భాగస్వామ్య దేశాల నుంచి వచ్చే దిగుమతులపై 10 శాతం నుంచి 12.5 శాతం వరకు కొత్త సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ సుంకాల వల్ల వినియోగదారులు, వ్యాపారాలపై భారం పడుతుందన్న 25 రాష్ట్రాలు ఇప్పుడు కోర్టును ఆశ్రయించాయి. ఇంతకుముందు కూడా ట్రంప్ విధించిన అనేక సుంకాల నిర్ణయాలు అమెరికా కోర్టులలో చట్టపరమైన చిక్కులను ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ కొత్త టారిఫ్‌లపై నమోదైన కేసు ట్రంప్ వాణిజ్య విధానాలకు మరో పెద్ద పరీక్షగా మారనుంది.

ప్రారంభంలో భారత్‌పై 12.5 శాతం టారిఫ్ విధించాలని ప్రతిపాదించినప్పటికీ.. వెట్టి చాకిరీ నిరోధక చట్టాల అమలును భారత్ వేగవంతం చేయడంతో పన్నును 10 శాతానికి తగ్గించారు. చమురు, సహజవాయువు, ఎరువుల దిగుమతులకు, అలాగే యుఎస్-మెక్సికో-కెనడా వాణిజ్య ఒప్పందం పరిధిలోకి వచ్చే వస్తువులకు ఈ పన్నుల నుంచి మినహాయింపు ఇచ్చారు.

## 18 యేళ్లకే ప్రొఫెసర్

### 306 యేళ్ల రికార్డు బద్దలు



**వాషింగ్టన్, ఆగస్టు 4:** పట్టుదల ఉండాలే గానీ.. అసాధ్యాన్ని కూడా సుసాధ్యం చేయవచ్చని నిరూపించాడు అమెరికాకు చెందిన నాథన్ థామస్. చాలామంది 18 యేళ్ల వయసులో ఉన్నత విద్యలోకి అడుగు పెడుతుంటే.. అతడు మాత్రం తరగతి గదిలో పాఠాలు చెబుతున్నాడు. పదేళ్ల వయసులోనే కళాశాల చదువు ప్రారంభించిన థామస్.. 18 యేళ్లకే ప్రొఫెసర్‌గా అరుదైన ఘనత సాధించాడు. ప్రపంచంలోనే అతి పిన్న వయస్కుడైన పురుష ప్రొఫెసర్‌గా గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించాడు. ఈ విషయంలో దాదాపు 300 యేళ్ల నాటి రికార్డును థామస్ బద్దలు కొట్టాడు. అంతకుముందు 1717లో స్కాట్లాండ్ గణిత శాస్త్రవేత్త కొలిన్ మెక్‌లారిన్ తన 19 యేళ్ల వయసులో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించారు. ఆయన రికార్డును తాజాగా థామస్ అధిగమించాడు.

అమెరికాలోని మియామీ కాలేజీలో ఇంజినీరింగ్ అధ్యాపకుడిగా బాధ్యతలు చేపట్టిన థామస్.. తనతో దాదాపు సమానమైన వయసున్న విద్యార్థులకు బోధించడం విశేషం. నాథన్ థామస్ పదేళ్ల వయసులోనే డ్యుయల్ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమం కింద మియామీ కాలేజీలో చేరాడు. అనంతరం 14 యేళ్లకే ఫ్లోరిడా ఇంటర్నేషనల్ యూనివర్సిటీలో బ్యాచిలర్, మాస్టర్స్ డిగ్రీలు పూర్తి చేశాడు. ఇప్పుడు ప్రొఫెసర్‌గా ఇంజినీరింగ్ విద్యార్థులకు పాఠాలు చెబుతున్నాడు. ఇంజినీర్ల కుటుంబంలో పెరగడం, గణితంపై తల్లి ఆసక్తి పెంచడమే తన ఎదుగుదలకు బలమైన పునాది అని థామస్ అంటాడు. ప్రస్తుతం బోధనతోపాటు మియామీ యూనివర్సిటీ లా స్కూల్‌లో డిగ్రీ చదువుతున్న నాథన్.. న్యాయ నిపుణుడు కావాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు.

## రాష్ట్ర బార్ కౌన్సిళ్లు 'పురుషుల క్లబ్‌ల్లు'గా మారాయి

### సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు

### బార్ కౌన్సిళ్లలో మహిళలను నామినేట్ చేయాలని హైకోర్టులకు ఆదేశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 4:** భారతదేశ న్యాయ సంస్థలలో లింగ అసమానతపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర బార్ కౌన్సిళ్లు 'పురుషుల క్లబ్‌ల్లు'గా మారాయని ప్రకటిస్తూ, వాటి పనితీరుపై ఉన్న గుత్తాధిపత్యాన్ని 'పూర్తిగా తొలగించాల్సి' అని హెచ్చరించింది. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బిసిఐ), రాష్ట్ర బార్ కౌన్సిళ్ల ఎన్నికలకు సంబంధించిన పలు పిటిషన్లపై మంగళవారం విచారణ జరిపిన భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, న్యాయమూర్తులు జయమాల్య బాగ్చి, వి. మోహనలతో కలిసి, ప్రతి రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు ఇద్దరు కోఆప్టెడ్ మహిళా సభ్యులను నామినేట్ చేయాలని తమ పరిధిలోని హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను ఆదేశించింది. కోఆప్ట్ సభ్యులలో ఒకరు మాజీ హైకోర్టు న్యాయమూర్తిగా, మరొకరు పేరున్న సీనియర్ మహిళా న్యాయవాదిగా ఉండాలని కోర్టుఆదేశించింది. కౌన్సిళ్ల పనితీరులో నిష్పక్షపాతాన్ని నిర్ధారించడానికి, వీరిద్దరూ ఎన్నికల ప్రక్రియకు అతీతంగా స్వతంత్రంగా ఉండాలి. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలలో పోటీ చేసి ఓడిపోయిన మహిళలు కూడా కోఆప్షన్‌కు అర్హులుగా ఉంటారని ధర్మాసనం స్పష్టం చేసింది. మహిళా అభ్యర్థులకు బదిలీ చేయదగిన ఓట్లను లెక్కించే అంశాన్ని, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుధాన్షు ధూలియా నేతృత్వంలోని ఉన్నత స్థాయి పర్యవేక్షక కమిటీకి నివేదించారు. బార్ సభ్యుల నుండి సూచనలు ఆహ్వానించి, మౌఖిక విచారణలు నిర్వహించిన తర్వాత ఈ పద్ధతిని పునఃపరిశీలించాలని కమిటీని కోరారు.

## ఉదయనిధి స్టాలిన్ అరెస్టు, విడుదల

### నటి త్రిషపై వ్యాఖ్యల దుమారం



**చెన్నై, ఆగస్టు 4:** తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ ఓ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని సృష్టిస్తున్నాయి. ఈ విషయంలో పోలీసులు ఇప్పటికే ఆయన్ను అరెస్ట్ చేశారు. చెన్నైలో ఆయన నివాసానికి పెద్ద ఎత్తున చేరుకున్న డిఎంకే కార్యకర్తలు పోలీసు వాహనాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. తంజావూరు పోలీసులు ఈకేసునమోదుచేసారు. డిఎస్‌పి అలగేషన్ ఆధ్వర్యంలోని పోలీస్ బృందం, చెన్నై పోలీస్ కమిషనర్ ఎ అమల్‌రాజ్ ఉదయనిధి నివాసానికి చేరి కేసు వివరాలు తెలిపారు. మరోవైపు అరెస్టు నుంచి రక్షణ కోరుతూ మద్రాస్ హైకోర్టులో ఉదయనిధి ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. అది విచారణకు వచ్చేలోపే ఆయన్ను అరెస్ట్ చేయడం గమనార్హం. కావేరి జలాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఉదయనిధి ముందురోజు ప్రసంగించారు. ఆ సమయంలో సభలో ఉన్న ఓ వ్యక్తి నటి త్రిష పేరు ప్రస్తావించగా, దానికి ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు ద్వంద్వార్థంతో ఉన్నాయని విమర్శలు వచ్చాయి. మహిళలను అవమానించేలా ఆ వ్యాఖ్యలు ఉన్నాయని ప్రత్యర్థి పార్టీలు ఆరోపించాయి. అధికార టీవీకే పార్టీ నేత ఆధవ్ అర్జున్ ఉదయనిధిపై తీవ్ర విమర్శలు చేశారు. మహిళల పట్ల అవమానకరంగా మాట్లాడారని ఆరోపించారు. టీవీకే అధికార ప్రతినిధి ఫెలిక్స్ జెరాల్డ్ కూడా స్పందించారు. అదే వ్యాఖ్యలను తన కుటుంబ సభ్యుల ముందు చెబుతారా అని ప్రశ్నించారు. బిజెపి కూడా ఈ వ్యాఖ్యలను ఖండించింది. ఉదయనిధిని వెంటనే అరెస్టు చేయాలని తమిళనాడు బిజెపి ప్రధాన అధికార ప్రతినిధి నారాయణన్ తిరుపతి డిమాండ్ చేశారు. నటి త్రిషకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బిజెపి ఉపాధ్యక్షురాలు ఖుష్బూ సుందర్ డిమాండ్ చేశారు. అయితే ఈ వివాదాన్ని డిఎంకే కొట్టిపారేసింది. కావేరి జలాల సమస్య, డెల్టారైతుల ఇబ్బందుల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ అంశాన్ని పెద్దది చేస్తున్నారని మాజీ మంత్రి మనో తంగరాజ్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలపై ఉదయనిధి ప్రశ్నించకుండా అడ్డుకునేందుకే ఈ ప్రచారం జరుగుతోందని అన్నారు. అయితే పోలీసులు అరెస్టుచేయడంతో ఉదయనిధి హైకోర్టులో వేసిన పిటిషన్‌కు ఊరట లభించింది. ఆయనకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. వెంటనే విడుదల చేయాలని పోలీసులను ఆదేశించింది. అలాగే విచారణకు పూర్తిగా సహకరించాలని ఉదయనిధికి సూచించింది. సిఎం విజయ్, సినీ నటి త్రిషకు సంబంధించిన వ్యాఖ్యల ఆరోపణల కేసులో ఈరోజు పోలీసులు ఉదయనిధిని అరెస్ట్‌చేసిన విషయం తెలిసిందే. ఉదయనిధిని రిమాండ్‌కు పంపే ఆలోచన తమకు లేదని తమిళనాడు పోలీసులు స్పష్టం చేశారు. ఎఫ్ఐఆర్ నమోదైన నేపథ్యంలో మాత్రమే ఆయన్ను విచారిస్తున్నామని తెలిపారు.

## 'ఆయన బతికే ఉన్నార్ను'

### మర్చంట్ నేవీ కెప్టెన్ భార్య సుప్రీంకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 4:** ఒమన్ తీరంలో ఒక ఆయిల్ ట్యాంకర్‌పై జరిగిన క్షిపణి దాడిలో మర్చంట్ నేవీ కెప్టెన్ ఆశిష్ కుమార్ మరణించారని ప్రకటించిన కొన్ని నెలల తర్వాత, ఆయన భార్య సుప్రీంకోర్టులో హెబియస్‌కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. 'ఆయన బతికే ఉన్నారు, గుర్తుతెలియని విదేశీ శక్తుల చేతిలో బందీగా ఉన్నార్ను' అని ఆమె ఆరోపించారు. తన భర్తను గుర్తించి, ఆయన విడుదల కోసం రూ.20 లక్షలు డిమాండ్ చేస్తూ తనకు బెదిరింపు కాల్స్ వచ్చాయని ఆరోపిస్తూ, అన్షు కుమార్ ఒక హెబియస్ కార్పస్ పిటిషన్‌లో తన భర్తను గుర్తించి, విడిపించాలని అధికారులను ఆదేశించాలని సుప్రీంకోర్టును కోరారు.

ఇరాన్‌తో ఘర్షణల తొలిదశలో, మార్చి 1న ఒమన్‌లోని ఖసాబ్ పోర్ట్ సమీపంలో 'స్కై లైట్'అనే చమురు ట్యాంకర్‌పై క్షిపణి దాడి జరిగినప్పుడు, బీహార్‌లోని బెట్టియాకు చెందిన 37 ఏళ్ల కెప్టెన్ ఆశిష్ కుమార్ దానికి సారథ్యం వహిస్తున్నారు. నివేదికల ప్రకారం, ఆ దాడి అనంతరం నౌకకు నిప్పంటుకున్నప్పుడు అందులో పది మంది భారతీయ సిబ్బంది ఉన్నారని ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం ఆ సమయంలో పేర్కొంది. ఒమన్ అధికారులు ఎనిమిది మంది నావికులను రక్షించగా, ఇంజిన్ రూమ్‌లో పనిచేస్తున్న కెప్టెన్ కుమార్, మరో సిబ్బంది దలీప్ ఆచూకీ తెలియరాలేదని నివేదికలు చెబుతున్నాయి. మార్చి 4న, ఒమన్ కోస్ట్ గార్డ్ కెప్టెన్ క్యాబిన్ నుండి కాలిపోయిన అస్థిపంజర అవశేషాలను స్వాధీనం చేసుకుంది. దాడి తర్వాత క్యాబిన్‌లోకి మరెవరూ ప్రవేశించలేదని భావిస్తున్నందున, ఆ అవశేషాలు చాలా మటుకు కెప్టెన్ కుమార్‌కు చెందినవేనని భారత రాయబార కార్యాలయం ఆ పరిస్థితులను బట్టి చెప్పింది. అయితే, ఆ తర్వాత జరిగిన పరిణామాలు ఆ నిర్ధారణను ప్రాథమికంగా మార్చేశాయని అన్షు కుమార్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

## తమిళనాడుకు చేరిన కావేరి జలాలు

**కోయంబత్తూరు, ఆగస్టు 4:** కావేరి నదీ జలాలు మంగళవారం తమిళనాడు చేరుకున్నాయి. కర్నాటకలోని కాబిని డ్యామ్ నుంచి రిలీజ్ చేసిన నీరు తమిళనాడులోని ఎంట్రీపాయింట్ బిలిగుండ్లకు చేరుకున్నది. సోమవారం ఉదయం 500 క్యూసెక్కులుఉండగా, ఆగస్టు 4వ తేదీ మంగళవారం ఆ ప్రవాహం 1000 క్యూసెక్కులకు చేరుకున్నది. ఉదయం 7 గంటలకు 8వేల క్యూసెక్కులు కాగా, ఉదయం 10 గంటలకు 18వేల క్యూసెక్కులకు చేరుకున్నది. అయితే కర్నాటక నీరును విడుదల చేస్తున్న నేపథ్యంలో కావేరి నదిప్రవాహ ఉధృతి పెరిగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెప్పారు. కావేరి పరివాహక ప్రాంతాల్లో భారీగా వర్షం కురవడం వల్ల నదిలోకి నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. తాజాగా వస్తున్న నీరు.. మంగళవారం రాత్రివరకు మెట్టూరు డ్యామ్‌కు చేరుకునే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం మెట్టూరు రిజర్వాయర్‌లో నీటి సామర్థం 73.18 ఫీట్ల వద్ద ఉన్నది. ఆ రిజర్వాయర్ పూర్తి సామర్థం 120 ఫీట్లుగా ఉంది. ఆ డ్యామ్‌కు 68 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, దాని నుంచి 1500 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు రిలీజ్ చేస్తున్నారు. మెట్టూరు డ్యామ్‌కు నీరు చేరితే అప్పుడు దిగువన ఉన్న డెల్టా ప్రాంత రైతులు సేద తీరే అవకాశాలు ఉన్నాయి.

## మధ్య ఆసియాపై భారత్ దృష్టి

### ఈ నెలాఖరులో కిర్గిజ్‌స్థాన్, ఉజ్బెకిస్థాన్‌లకు ప్రధాని మోడీ పర్యటన

**న్యూఢిల్లీ,ఆగస్టు 4:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ నెలాఖరులో కిర్గిజ్‌స్తాన్, ఉజ్బెకిస్థాన్ దేశాల్లో పర్యటించనున్నారు. చైనా తన బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌ద్వారా మధ్య ఆసియాలో ప్రభావాన్ని విస్తరిస్తుండగా, రష్యా ఈ ప్రాంతాన్ని తన సాంప్ర దాయ ప్రభావ పరిధిగా భావిస్తోంది. ఇదే సమయంలో భారత్ కూడా మధ్య ఆసియాలో తన వ్యూహాత్మక, ఆర్థిక ప్రాధాన్యాన్ని పెంచుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ఈ నేప థ్యంలో ప్రధాని మోడీ పర్యటనకు విశేష ప్రాధాన్యం ఏర్పడింది. ఈ పర్యటన రెండు దశల్లో జరగనుంది. ముందుగా కిర్గిజ్‌స్తాన్‌లో జరిగే షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సిఒ) శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోడీ పాల్గొంటారు. సమావేశం సందర్భంగా పలువురు దేశాధినేతలతో ద్వైపాక్షిక భేటీలుకూడా నిర్వహిస్తారు. ఉజ్బెకిస్థాన్‌లో పూర్తి స్థాయి ద్వైపాక్షిక పర్యటనకొనసాగనుంది. ఇందులో వాణిజ్యం, రక్షణ సహకారం, పెట్టు బడులు, కనెక్టివిటీ తదితర అంశాలపై చర్చలు జరుగుతాయి. అఫ్గానిస్థాన్‌లో మారిన భద్రతా పరిస్థితులు, మధ్య ఆసియాలో చైనా పెరుగుతున్న ప్రభావం, భారత్ తన వ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనాలను విస్తరించే లక్ష్యం వంటి అంశాల నేపథ్యంలో ఈ ప్రాంతానికి భారత విదేశాంగ విధానంలో మరింత ప్రాధాన్యం పెరిగింది. ఉజ్బెకిస్థాన్ విదేశాంగ మంత్రి బఖ్తియోర్ సైదోవ్ ఇటీవల న్యూఢిల్లీలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో సమావేశ మయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కూడా మర్యాద పూర్వకంగా కలిశారు.

## సిజెపి వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేపై పోలీసులకు ఫిర్యాదు

**ఔరంగాబాద్,ఆగస్టు 4:** సిజెపి (కాక్రోచ్ జనతా పార్టీ) ఫౌండర్ అభిజీత్ దీప్కేపై ఒక సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడి అనుచరులు తనపై వరుసగా దాడికి పాల్పడ్డారని, దీనికి బాధ్యుడిగా అభిజీత్ దీప్కేను అరెస్టు చేయాలని కోరుతూ ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుకు సంబంధించిన వివరాలివి. ఫైజన్ అన్సారీ అనే అతడు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. అతడిపై ఇటీవల పుణెలో, ఔరంగాబాద్‌లో దీప్కే అనుచరులు దాడి చేశారు. ఈ విషయాన్ని ఫైజన్ అన్సారీయే వెల్లడించాడు. ఇందుకు సంబంధించి తన వద్ద ఆధారాలున్నాయని, ఈ నేపథ్యంలో అభిజీత్ దీప్కేపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఢిల్లీ డిసిపికి ఫిర్యాదు చేసినట్లు ఫైజన్ పేర్కొన్నాడు. ఇప్పటికే ఇదే అంశంపై రెండు చోట్ల ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశానన్నాడు. ఢిల్లీ పోలీసులు కూడా వెంటనే స్పందించి, దీప్కేను అరెస్టు చేయాలని అతడు కోరాడు. ఇదే సమయంలో ఢిల్లీ పోలీసులు, ప్రభుత్వంపై ఫైజన్ ప్రశంసలు కురిపించాడు. పోలీసులు సరైన సమయంలో స్పందించి, సోనమ్ వాంగ్‌చుక్‌ను అరెస్టు చేశారని చెప్పాడు. దీప్కేకు స్వప్రయోజనాలే ముఖ్యమని, ప్రతి అంశాన్ని తన ప్రయోజనం కోసమే వాడుకుంటాడని ఫైజన్ ఆరోపించాడు. అయితే, ఫైజన్ చేసిన ఆరోపణలపై దీప్కే కానీ, సిజెపి కానీ స్పందించలేదు.

## వాషింగ్టన్‌లో విస్తరిస్తున్న కార్చిచ్చు

### అత్యవసర పరిస్థితి విధింపు



**వాషింగ్టన్, ఆగస్టు 4:** అమెరికాలో అగ్నికీలలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. వాషింగ్టన్ రాష్ట్ర పరిధిలోని అటవీ ప్రాంతాన్ని కార్చిచ్చు దహించివేస్తుండగా, సమీపంలోని వేల మంది ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తాజాగా మరో 60 వేల మందిని తాత్కాలిక శిబిరాలకు పంపారు. మంటలకు కారణమని భావిస్తున్న స్పోకేన్‌కు చెందిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం వాషింగ్టన్ వ్యాప్తంగా 16 ప్రదేశాల్లో కార్చిచ్చు విస్తరించింది. వందల భవనాలు అగ్నికి ఆహుతయ్యాయి. స్పోకేన్ ప్రాంతంలో మంటలు కొనసాగుతుండడంతో వాటిని అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. బలమైన గాలులు, పొడి వాతావరణం కారణంగా మంటలను నియంత్రించడం సవాలుగా మారింది. నష్టం తీవ్రతను అంచనా వేస్తున్నట్లు స్పోకేన్ మేయర్ లీసా బ్రౌన్ వెల్లడించారు.

**వాషింగ్టన్‌లో అత్యవసర పరిస్తితి..**

తాజా పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మాట్లాడిన తర్వాత.. వాషింగ్టన్ రాష్ట్ర గవర్నర్ బాబ్ ఫెర్గూసన్ రాష్ట్రవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. కార్చిచ్చు వేగంగా వ్యాపిస్తుండడంతో ప్రభావిత ప్రాంతాల్లో ఇళ్లను ఖాళీ చేయిస్తున్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మరోవైపు ఈ వారం ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

## సంక్షిప్త వార్తలు

### పాక్ చరిత్రలోనే అతిపెద్ద భూకుంభకోణం



**ఇస్లామాబాద్,ఆగస్టు 4:** పాకిస్థాన్ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు రేగాయి. దేశ చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణాన్ని తాను బయటపెట్టినట్లు అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి మొహ్సిన్ నఖ్వీ చేసిన వ్యాఖ్యలు అధికార వర్గాల్లోని విభేదాలను బట్టబయలు చేశాయి. న్యాయమూర్తులు, బ్యూరోక్రాట్లు, రాజకీయ నాయకులు, బ్యాంకర్లు ఈ స్కామ్‌లో భాగస్వాములుగా ఉన్నారని, గత 21 యేళ్లుగా లంచాలు చేతులు మారాయని ఆయన ఆరోపించారు. ఈ వ్యాఖ్యల వెనుక సైన్యం, పౌర ప్రభుత్వానికి మధ్య పెరుగుతున్న ఘర్షణ వాతావరణమే కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ కుంభకోణంలో బాధ్యులైన ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకుంటామని నఖ్వీ హెచ్చరించారు.

### పాక్‌లో 30 మందికిపైగా లష్కరే సభ్యుల హత్య

**పెషావర్, ఆగస్టు 4:** పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు చెందిన 30 మందికిపైగా సభ్యులు గత 34 యేళ్లలో గుర్తు తెలియని వ్యక్తుల చేతుల్లో హత్యకు గురయ్యారని ఆ సంస్థ కీలక నేత రిజ్వాన్ హనీఫ్ వెల్లడించాడు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. వీడియోలో కనిపిస్తున్న వ్యక్తి లష్కరే తోయిబాకు చెందిన సీనియర్ ఉగ్రవాదేనని భారత భద్రతా సంస్థలు ధ్రువీకరించాయి. పెషావర్, కరాచీ, రావల్పిండి, రావల్‌కోట్, ముజఫరాబాద్ ప్రాంతాల్లో 30 మందికిపైగా లష్కరే సభ్యులు హత్యకు గురయ్యారని హనీఫ్ వీడియోలో పేర్కొన్నాడు.

### నేతాజీ ముని మనుమడు టిఎంసికి రాజీనామా



**కోల్‌కత్తా, ఆగస్టు 4:** నేతాజీ సుభాష్ చంద్రబోస్ మనవడు చంద్రకుమార్ బోస్ తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) పార్టీకి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతోనే తాను పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన సోమవారం ప్రకటించారు. ఈ అనూహ్యపరిణామంపై టిఎంసి అధిష్ఠానం స్పందించాల్సి ఉంది. చంద్ర కుమార్ బోస్ రాజకీయ ప్రస్థానం గత కొంతకాలంగా చర్చనీయాంశంగా మారింది. 2016లో ఆయన బిజెపిలో చేరారు. ఆ పార్టీ తరఫున 2016 అసెంబ్లీ ఎన్నికల్లో, 2019 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి పరాజయం పాలయ్యారు. పశ్చిమ బెంగాల్ బిజెపి ఉపాధ్యక్షుడిగా కూడా ఆయన బాధ్యతలు నిర్వహించారు.

### భారత్‌లో 15 విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు



**న్యూఢిల్లీ, ఆగస్టు 4:** భారత ఉన్నత విద్యా రంగంలో ఒక కీలక ముందడుగు పడింది. దేశంలో తమ ప్రాంగణాలను (క్యాంపస్‌లను) ఏర్పాటు చేసేందుకు 15 విదేశీ విద్యా సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఆస్ట్రేలియా, ఇటలీ, అమెరికా, యూకే దేశాలకు చెందిన 15 విదేశీ విద్యా సంస్థలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఇప్పటివరకు 16 లెటర్స్ ఆఫ్ ఇంటెంట్ జారీ చేసింది.

### పిఒకెలో మానవహక్కుల ఉల్లంఘన



**ముజఫరాబాద్, ఆగస్టు 4:** పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో (పిఒకె) జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్కడ తీవ్ర హింస, అశాంతి చోటుచేసుకుంటున్నాయి. నిరసనకారులపై పాక్ భద్రతాబలగాలు దాడులకు పాల్పడటం, మీడియాపై ఉక్కుపాదం మోపడం, ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడంపై ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ వంటి అంతర్జాతీయ సంస్థలు తీవ్రఆందోళన వ్యక్తం చేశాయి. మానవ హక్కుల ఉల్లంఘనలపై వెంటనే దర్యాప్తుజరపాలని పాకిస్థాన్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశాయి. రావల్‌కోట్‌లో నిరసనకారులపై భద్రతాబలగాలు విచక్షణారహితంగా వ్యవహరించాయని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆరోపించింది.

# తుంగతుర్తి వివాదంపై పిసిసి చీఫ్ మహేశ్‌కు నివేదిక

## నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే ఫస్ట్ బాస్, సెకెండ్ ఎంపి
## పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, పరిశీలకుడు జగ్గారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియో జకవర్గలోని మండలాలలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంకు వేసిన కమిటీలు తీవ్ర వివాదం సృష్టించడమే కాకుండా వీధిపోరాటంలతో బాహాబాహికిదిగి ఇరు వర్గాలు దాడులు చేసుకొంటూ ఢిల్లీకి కాకపుట్టించిన అంశంపై పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, పరిశీలకుడు జగ్గారెడ్డి తన విచారణ నివేదికను మంగళవారం సమర్పించారు. గాంధీభవన్‌లో టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో సమావేశమై తాను రూపొందించిన ఏడు పేజీల సమగ్ర నివేదికను సీల్డ్ కవర్‌లో పెట్టి అందించారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ కాంగ్రెస్ మండల అధ్యక్షుల నియామక చేయడంతో భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి వర్గంతో పాటు పాత కాంగ్రెస్ నేతలకు మధ్య చిచ్చురాజేసింది. ప్రసారమాధ్యమాల్లో విమర్శ లతో మొదలైన వివాదం పెరిగిపెరిగి సామెల్ వర్గంతో ఇతర కాంగ్రెస్ నాయకుల వర్గాలు రోడ్డుపైకి వచ్చి పరస్పరం రాళ్లు, కర్రలతో దాడులు చేసుకునే వరకు పరిస్థితి దారితీసింది. దీంతో వివాదం ముదరడంతో స్పందించిన కాంగ్రెస్ అధిష్టానం పరిస్థితిని చక్కదిద్దేం దుకు జగ్గారెడ్డిని ప్రత్యేక పరిశీలకుడిగా నియమించింది. పార్టీ ఆదేశాలతో రంగంలోకి దిగిన జగ్గారెడ్డి ఇరువర్గాలతో వేరువేరుగా భేటీ అయ్యారు. నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సొంత వూరు కూడా ఇదే నియోజకవర్గంలో ఉండటంతో ఆయన అభిప్రాయంతోపాటు ఆర్‌అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే మందుల సామెల్‌తోపాటు అనేక ముఖ్యమైన నాయకుల అభిప్రాయాలు స్వీకరించి వివాదంపై గత నెల 25వ తేదీననే తన నివేదిక సమర్పించేందుకు జగ్గారెడ్డి గాంధీభవన్‌కు కూడా వచ్చారు. అదేరోజు ఎస్సీల నియోజక వర్గంపై ఆధిపత్యం చలాయిస్తున్నారని ఎమ్మెల్యే సామేల్ విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. అంతకు ముందు రోజు రాజగోపాల్‌రెడ్డి తుంగతుర్తి ఎమ్మెల్యేకు మద్దతు తెలిపినందుకు నియోజకవర్గ ప్రజలకు క్షమాపణలు కోరారు. సామెల్ ప్రతిస్పందనకు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా అదే స్థాయిలో సమాధానం ఇచ్చారు. తుంగతుర్తి అంశం పూర్తిగా చల్లా రక పోవడంతో జగ్గారెడ్డి నివేదికను సమర్పించేందుకు జగ్గారెడ్డి మరికొంత సమయం తీసుకుని సమగ్రంగా వివాదం అంశాలు వాటి పరిష్కారం చూపుతూ రిపోర్టును పార్టీకి అందజేశారు. అంతర్గత వైరుధ్యాలను పార్టీలో పరిష్కరించుకోవాలి కానీ పార్టీ క్రమశిక్షణను దెబ్బతీసేలా ముఠాలుగా విడిపోయి వీధుల్లో తగవుపై పెట్టుకోవడంపై కాంగ్రెస్ అధిష్టానం కూడా ఆగ్రహం వ్యక్తంచేసింది. జగ్గారెడ్డి సమర్పించిన నివేదిక ఆధారంగా టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఎఐసిసి ఇంచార్జీ మీనాక్షి నటరాజరన్ చర్యలకు ఉపక్రమించే అవకాశం ఉంది. సామేల్‌కు మద్దతుగా మరోవైపు దళిత ఎమ్మెల్యే కాంగ్రెస్ ఎస్‌సి సెల్ అధ్యక్షులు మానకొండూరు ఎమ్మెల్యేకూడా గొంతు విప్పారు. ఇలాంటి సమయంలో క్రమశిక్షణా చర్యలు ఎవరిపై తీసుకొంటారనేది ప్రస్తుతం కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. క్రమశిక్షణ తప్పిన నేతలపై వేటు వేస్తారా లేక ఇరువర్గాలను పిలిచి సర్దిచెబుతారా అనేది త్వరలోనే తేలనుంది. సూర్యాపేట జిల్లాలోని తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ విభేదాలు, పంచాయితీపై జగ్గారెడ్డి కూడా నివేదిక ఇచ్చిన అనంతరం ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే ఫైనల్ అంటూ ఆయన వ్యాఖ్యానించడంతో నివేదికలో ఏముందనే ఆసక్తి కాంగ్రెస్ శ్రేణుల్లో ముఖ్యంగా నల్లగొండ నాయకుల్లో నెలకొంది. జగ్గారెడ్డి మాట్లాడుతూ తుంగతుర్తి నియో జకర్గంలో తలెత్తిన ఘర్షణలు, వర్గపోరుపై పదిరోజుల పాటు ఇరువర్గాలు, స్థానిక నేతలు, కార్యకర్తల అభిప్రాయాలను క్షుణ్ణంగా సేకరించిన తర్వాతే ఈ నివేదికను రూపొందించినట్లు స్పష్టం చేశారు. పార్టీ ప్రోటోకాల్, ప్రాధాన్యతలపై స్పష్టతనిస్తూ ఏ నియోజకవర్గానికైనా స్థానిక ఎమ్మెల్యేనే ఫస్ట్ బాస్ అని అన్నారు. ఆ తర్వాతే ఎంపి, మంత్రులు వస్తారని పేర్కొన్నారు. మూడో ప్రాధాన్యత కార్యకర్తల పక్షాన డిసిసి అధ్యక్షుడికి ఉంటుందని జగ్గారెడ్డి తెలిపారు. అదేవిధంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి సంబంధించిన అన్ని రకాల వివాదా లను, పరిణామాలను కూడా ఈ 7 పేజీల నివేదికలో స్పష్టంగా ప్రస్తావించినట్లుగా వెల్లడించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలాన్ని ప్రస్తావిస్తూ నల్లగొండ జిల్లాలో పార్టీకి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలు అత్యంత బలమైన స్తంభాలని జగ్గారెడ్డి పేర్కొన్నారు.


గవర్నర్‌తో భేటీ అయిన ఈగల్ విభాగం ఉన్నతాధికారులు

## గవర్నర్ శివప్రతాప్‌శుక్లాతో ఈగల్ విభాగం ఉన్నతాధికారుల భేటీ

### వర్సిటీల్లో డ్రగ్స్ కట్టడికి తీసుకుంటున్న చర్యలపై నివేదిక

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** రాష్ట్ర ఈగల్ విభాగం ఉన్నతాధికారులు గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో భేటీ అయ్యారు. ఈగల్ డైరెక్టర్ స ందీప్ శాండిల్యా నేతృత్వంలో ఉన్నతాధికారుల బృందం గవర్నర్‌తో భేటీ అవడంతో పాటు రాష్ట్రంలో యూనివర్శిటీలలో డ్రగ్స్ కట్టడికి ఈగల్ పోలీసు విభాగం తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా వివరించింది. దీనికి సంబంధించిన నివేదికను కూడా అందజేసింది. నషా విముక్త్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా యూనివర్శిటీలపై ఈగల్ విభాగం నిరంతరం నిఘా వుంచడంతో పాటు ఇక్కడ డ్రగ్స్‌ను పూర్తిగా నిరోధిం చేందుకు అన్ని చర్యలు తీసుకుం టుందని తెలిపారు. తాము చేబడుతున్న కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వాములను చేశామని ఈగల్ విభా గం ఉన్నతాధికారులు గవర్నర్‌కు తెలిపారు. ఇదే సమయంలో డ్రగ్స్ స్మగ్లర్లను పెద్ద సంఖ్యలో అరెస్టు చేస్తున్నామని వారు వివరించారు. డ్రగ్ ఫ్రీ తెలంగాణ కోసం రాష్ట్ర సర్కారు తీసుకుంటున్న చర్యలకు తమ వంతు సహాయం అందజేస్తున్నామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనవర్శిటీల విసిలు కూడా పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పిటిషన్‌పై నేడు హైకోర్టులో విచారణ

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** తనపై పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో నమోదైన లైంగిక దాడి కేసును కొట్టి వేయాలని కోరుతూ బిఆర్ ఎస్ మాజీ ఎంఎల్‌ఎ రేగా కాంతారావు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ జరగనుంది. ఉద్యోగం నెపంతో పిలిచి తన పై లైంగిక దాడి చేయడంతో పాటు ఐదు లక్షల రూపాయలు తీసుకున్నట్లు రేగా కాంతారావుపై ఓ యువతి పంజాగుట్ట పోలీసు స్టేషన్‌లో ఫిరా ్యదు చేయడం తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేబట్టడం విదితమే. ఇదే సమయంలో రేగా కాంతారావు ఇదంతా అబద్ధమని, తనపై వస్తున్న ఆరోపణలు సత్యదూరమని ఈ కేసును కొట్టి వేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నాలుగేళ్ల క్రితం ఈ ఘటన జరిగిందని యువతి ఆరోపించడం పూర్తిగా అవాస్తవమని ఆయన తెలిపారు. తన పరువు, ప్రతిష్టలను దిగజార్చేందుకే ఆమె పోలీసు స్టే షన్‌లో ఫిర్యాదు చేసిందని మాజీ ఎంఎల్ఎ తెలిపారు. కాగా రేగా కాంతారావు పిటిషన్‌పై బుధవారం మధ్యాహ్నం తరువాత హైకోర్టులో విచారణ జరగనుంది.

## నేడు గాంధీభవన్‌లో మంత్రి సీతక్క ప్రజలతో ‘ముఖాముఖి’

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** ప్రజా పాలనలో ప్రజా సమస్యల పరిష్కారానికి గాంధీ భవన్ లో ప్రతి బుధవారం జరిగే ‘ప్రజలతో ముఖాము ఖి’ కార్యక్రమంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచి నీటి సరఫరా స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) పాల్గొంటారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు ఆమె ప్రజల సమస్యలపై విన్నపాలు స్వీకరిస్తారు. చిన్నచిన్న అంశాలు త్వరగా పరిష్కారంకు యోగ్యత ఉంటే అధికారులకు సమస్యలపై సిఫార్సులు చేస్తారు. పరిష్కారం కోసం సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడుతారు.

## భూకబ్జాదారులపై యుద్ధంలాంటిది ‘హైడ్రా’

### ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** భూ కబ్జా దరులపై యుద్ధం లాంటిది “హైడ్రా” అని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు కొనియాడారు. మంగళవారం గాంధీ భవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ సీఎం తీసుకున్నా ఈ హైడ్రా నిర్ణయాన్ని కొందరు మిస్లీడ్ చేస్తున్నారనీ ఆవేదన చెందారు. జర్నలిస్ట్‌లకు కోట్ల విజయ భాస్కరరెడ్డి 60 ఎకరాల భూమి కేటాయించారు దాన్ని కొందరు భూ కబ్జా దారులు ఆక్రమించారనీ అన్నారు. కొందరు జర్నలిస్ట్ లకి నోటీస్ లు కూడా పంపారనీ గుర్తుచేశారు భూములు కాపాడటానికి సిఎం హైడ్రాను తీసుకొచ్చారూ అని తెలిపారు బతుకమ్మ కుంటని కూడా కబ్జా చెయ్యాలి అని చూసారు కానీ నేను ఒప్పుకోలేదు వారు ఇచ్చిన ఆఫర్ ని రిజెక్ట్ చేశాను అని తెలిపారు రంగనాథ్ చెరువులు, ప్రభుత్వ భూములు ని కాపాడుతున్నారనీ జూడిషరీ అంటే నాకు గౌరవం కానీ ఇలా మంచి విషయాల్లో జోక్యం తగదని అన్నారు.

## మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు4:** ప్రజల సమస్యల పరిష్కార వ్యవస్థను మరింత పారదర్శకంగా, వేగవంతంగా ప్రజలకు చేరువ చేసేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని మండల స్థాయికి విస్తరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి వారం సోమవారం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపిడిఓ) కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. తహసీల్దార్, ఎంపీఓ, మండల వ్యవసాయ అధికారి, ఎంఈఓ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి, పోలీస్, ఇతర మండల స్థాయి శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించి, వెంటనే చర్యలు చేపడతారు. మండల స్థాయిలో వచ్చే ప్రతి ఫిర్యాదును ఏకీకృత ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేసి, ఫిర్యాదుదారునికి గ్రీవెన్స్ ఐడీతో కూడిన రసీదును అందిస్తారు. వికలాంగులు, వయోవృద్ధులు, గర్భిణులు బాలింతలకు అర్జీల సమర్పణలో మొదటి ప్రాధాన్యత ఇస్తారు. మంచినీరు, కూర్చోవడానికి సీటింగ్, హెల్ప్‌డెస్క్ వంటి ప్రాథమిక సౌకర్యాలను ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేస్తారు. ప్రజా సమస్యలను స్థానిక స్థాయిలోనే త్వరితగతిన పరిష్కరించేందుకు జిల్లా కలెక్టర్లు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది.

## బోనాలు జరుపుకోవడం మన బాధ్యత

### పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 4,ప్రభాతవార్త:** బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ అన్నా రు. నిజామాబాద్ పట్టణంలో అరె కటిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల మహోత్సవంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, మహేశ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురా రోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూతెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనా లని అన్నారు. సమాజంలో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించే ఇలాంటి పండుగలు మన సంస్కృతికి గర్వకారణమని పేర్కొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కుండె వెంకటేష్, నరేష్, గౌడ్‌రాజ్ తదితరులు

## కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

### కురుమ యువచైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు కుండె వెంకటేష్

**హైదరాబాద్, ఆగస్టు 4,ప్రభాతవార్త:** గొల్లలతో కాకుండా కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కురుమ యువ చైతన్య సమితి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరులసమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుండె వెంకటేష్ కురుమ, వర్కింగ్ ప్రెసిడెంట్ కనుగంటి నరేష్ కురుమ, ప్రధాన కార్యదర్శి గౌడ్‌రాజ్ కుమార్‌లు మాట్లాడారు. యాదవ సామాజిక వర్గంతో కలిపి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో తమ సామాజికవర్గ ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగు తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కుల గణన సందర్భంగా తమ సామాజిక వర్గ ప్రజలను తక్కువగా చెప్పడంతో తమకు గుర్తింపు లేకుండా పోతుం దన్నారు. కావున ప్రభుత్వం తక్షణమే గొల్లలతో కాకుండా తమకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దొడ్డి కొమరయ్య విగ్ర హాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటుచేయాలన్నారు. నెలరోజుల్లోపు ప్రభు త్వం స్పష్టమైన ప్రకటన చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా శాంతియుత నిరసనలు చేప ట్టడంతోపాటు ఆమరణ నిరాహారదీక్షకు వెనుకాడమని హెచ్చరించారు.

# ఉచిత చేపపిల్లల పథకం కొనసాగిస్తాం

### మధ్యాహ్న భోజన పథకంలో చేపల కూర

### మత్స్య, పశుసంవర్ధక మంత్రి వాకిటి శ్రీహరి



**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మత్స్య, పశుసంవర్ధక మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. రాష్ట్రంలో మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేసేందు అమలు చేస్తున్న ఉచిత చేప పిల్లల పథకాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మత్స్య రంగ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, సహకార సంఘాల బలోపేతం లక్ష్యంగా జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, ప్రమోటర్లతో హైదరాబాద్ లో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో 26 వేల చెరువులు, 100 రిజర్వాయర్లలో చేపల పిల్లలను విడుదల చేయడం జరుగుతుందన్నారు. మత్స్యకారులకు కావాల్సిన వసతులు కల్పిస్తామని తెలిపారు. చేపల పెంపకాన్ని మరింత విస్తరించడంతో పాటు, మత్స్యకారులకు అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మత్స్యకారులకు ఇన్సూ రెన్స్, మోపెడ్‌లు, రిటైల్ అవుట్‌లెట్ షాపుల ఏర్పాటు కోసం ప్రభుత్వం కార్యాచరణ రూపొంది స్తోందని తెలిపారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి సమస్యలను సమీక్షిస్తామని వెల్లడిం చారు. ఉచిత చేప పిల్లల పంపిణీ పథకాన్ని కొనసాగించడంతో పాటు, మత్స్యకారులకు సంబంధించిన పెండింగ్ బకాయిల విడుదలకు ప్రత్యేక కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా విద్యార్థుల పోషకాహారాన్ని మెరుగుపరిచే దిశగా మధ్యాహ్న భోజన పథకంలో చేపలను చేర్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు నెలకొన్న సహకార సంఘాల సభ్యత్వ వివాదాలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. హైదరాబాద్ కోహెడలో నిర్మాణంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ ఫిష్ మార్కెట్ పూర్తయిన తర్వాత ఆన్‌లైన్ ద్వారా చేపల విక్రయాలు, పంపిణీకి అవకాశం ఏర్పడుతుం దన్నారు. మత్స్యకారులకు సంబంధించిన రూ.1.34 కోట్ల ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లను ప్రభుత్వం ఇప్పటికే క్లియర్ చేసిందని చెప్పారు. మత్స్య సహకార సంఘాల అధ్యక్షులకు ప్రోటోకాల్ అంశంపై ప్రభుత్వంతో చర్చించి తగిన నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, వారి సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

# ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి

### వారంలోగా స్పందించకపోతే ఆందోళన తీవ్రతరం: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హెచ్చరిక

### చలో బస్‌భవన్ నిర్వహించిన విశ్రాంత కార్మికులు

**హైదరాబాద్ (చిక్కడపల్లి) ఆగస్టు 4, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో సుదీర్ఘకాలం సేవలందించి విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులకు చెల్లించాల్సిన అన్ని రకాల బకాయిలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను తక్షణమే వడ్డీతో సహ చెల్లించాలని ఎమ్మెల్సీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ నాయకుడు తీన్మార్ మల్లన్న డిమాండ్ చేశారు. తెలంగాణ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సారథ్య కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ‘ఛలో బస్ భవన్’ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో రిటైర్డ్ కార్మికులు పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ప్రతినిధులతో కలిసి బస్ భవన్‌లో ఆర్టీసీ ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం అందజేసి సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 17 వేల మందికి పైగా ఆర్టీసీ రిటైర్డ్ కార్మికులకు 2015 నుంచి రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్, పీఎఫ్ బకాయిలు, సీసీఆర్, పీఆర్సీ వ్యత్యాసాల గ్రాట్యుటీ సొమ్ము అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవిత చరమాంకంలో వైద్యం, కుటుంబ అవసరాల కోసం దరఖాస్తులు పట్టుకుని ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. 2015 నుంచి పెండింగ్‌లో ఉన్న రిటైర్మెంట్ బెనిఫిట్స్, 2017, 2021 పి.ఆర్.సి. బకాయిలు, పీఎఫ్, గ్రాట్యుటీ వ్యత్యాసాలను వడ్డీతో కలిపి వెంటనే చెల్లించాలి. 2013 పీఆర్సీ ఏరియర్స్ పీఎఫ్ కంట్రిబ్యూషన్‌ను కమిషనర్ కార్యాలయానికి పంపి పెన్షన్ మొత్తాన్ని పెంచాలి. 2009 పే స్కేల్ ఆధారంగానే పెన్షన్లు లెక్కించడం వల్ల విశ్రాంత ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, తదుపరి పే స్కేళ్లకు అనుగుణంగా పెన్షన్‌ను అప్‌డేట్ చేయాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం, ప్రభుత్వం ఒక వారంలోగా విశ్రాంత ఉద్యోగుల బకాయిల విడుదలపై స్పష్టమైన ప్రకటన చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన బాట పడతామని మల్లన్న హెచ్చరించారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ముట డికి పిలుపునిస్తామని స్పష్టం చేశారు. ఈ చర్చ లపై ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్థాయి అధికా రులు స్పందిస్తూ.. ప్రతిపాదించిన అంశాలను మేనేజింగ్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సానుకూల నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు, వివిధ జిల్లాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బస్‌భవన్ వద్ద కార్మికులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

# కాంగ్రెస్ 6 గ్యారంటీలు గాలికి.. కొత్తగా 6 ‘సి’లతో దోపిడీ

### మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ విమర్శ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 4:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తయినా పరిపాలన ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా తయారైందని బిజెపి సీనియర్ నేత, మాజీ శాసనసభ్యుడు ఎన్.వి. ఎస్.ఎస్. ప్రభాకర్ ఆరోపించారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి పూర్తిగా గాడి తప్పిందని, ఖజానా ఖాళీ అయి కొత్తగా అప్పు కూడా పుట్టని దయనీయ స్థితికి రాష్ట్రాన్ని దిగజార్చారని ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెం టీలను పూర్తిగా గాలికి వదిలేసిందని, ప్రజలు వాటిని మర్చిపోయేలా కొత్తగా 6 సి ల దోపిడీ పాలనను సాగిస్తోందని ప్రభాకర్ ఎద్దేవా చేశారు. 1.క్రైమ్ (నేరాలు): శాంతిభద్రతలు క్షీ ణించి బెయిల్‌పై వచ్చి హత్యలు చేసేస్థాయికి నేరాలు పెరగడం. 2. కరప్షన్ (అవినీతి): పతాక స్థాయికి చేరిన అవినీతి. 3. కమీషన్లు: ప్రతి పనిలోనూ కమీషన్లు దండుకోవడం. 4.కాంట్రాక్టులు: కాం ట్రాక్టుల పేరిట నిధుల మళ్లింపు 5. హైకమాండ్: పదవుల రక్షణ కోసం ఢిల్లీ పీఠానికి కప్పం కట్టడం. 6. కమాండ్(ఆధిపత్యం): ప్రజలపై, వ్యవస్థలపై ఆధిపత్యం చలాయిం చడడం. ప్రజాసంక్షేమాన్ని పక్కనబెట్టి దోచుకోవడం, దాచుకోవడం, ఢిల్లీకి మూటలు పంపి పదవులు కాపాడుకోవడమే లక్ష్యం గా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో రోజురోజుకూ ప్రభుత్వ అప్పులు పెరిగిపోతుంటే, ప్రభుత్వ ఆస్తులు మాత్రం తరిగిపోతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అదే సమయంలో కాంగ్రెస్ మంత్రుల ఆస్తు లు మాత్రం విపరీ తంగా పెరిగిపోతు న్నాయ న్నారు. కాంగ్రెస్ ప్రభు త్వానికి పరిపాలనపై అస లు పట్టు లేదని, రెండు న్నరేళ్ల కాలంలోనే 40 సార్లకుపైగా ఐఏఎస్, ఐపి ఎస్ అధికారులను బదలీ చేశారని ప్రభాకర్ అన్నా రు. ముఖ్యమంత్రి పరిధి లోనే విద్యాశాఖ ఉన్నప్ప టికీ, ప్రభుత్వ పాఠశా లలు, హాస్టళ్లలో రోజుకో చోట పిల్లలు ఫుడ్ పాయిజన్ బారిన పడుతున్నారని, దీనికి ముఖ్య మంత్రే సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతిని బయటకు తీస్తాం, నిధులు కక్కిస్తాం అని చెప్పి ఓట్లు దండుకున్న కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక ఆ విచారణల న్నింటినీ తొక్కిపెట్టిందని విమర్శించారు.


మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్.ప్రభాకర్

## గాంధీభవన్‌లో ఆషాఢ మాస బోనాల సంబురాలు

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** ప్రకృతిని పూజించే పండుగ బోనం అని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. ఆషాడమాస బోనాలు మంగళవారం గాంధీభవన్‌లో తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణక్క ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. బోనం ఎత్తుకొన్న సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడవాళ్లకు ఎంతో ఇష్టమైన పండుగ బోనాల పండగ మన తెలంగాణ సాంస్కృతికి సంప్రదాయాలకు అద్దం పట్టే బోనాల పండుగను మహిళలు ఎంతో సుచి శుభ్రతతో నిష్టగా నిర్వహిస్తారని అన్నారు. ఈ సంవత్సరం వర్షాలు బాగా కృషి రాష్ట్రం షష్యశ్యామలంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నానని తెలిపారు. ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ, ఆషాడ మాసం ఆరంభంతోనే అమ్మవారి పూజలు ప్రారంభమవుతాయని, బోనాలు పోతరాజులు శివసత్తుల ఆటలతో ఆషాడ మాసం అంతా అమ్మవారికి బోనాలను సమర్పించుకుంటారని చెప్పారు. అమ్మవారి ఆశీర్వాదంతో దేశవ్యాప్తంగా ప్రజలందరూ కూడా ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేకుండా, సస్యశ్యామలంగా ఉండాలని కోరుకుంటూ అమ్మవారికి బోనాలను సమర్పిస్తారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ సభ్యులే. జిల్లా అధ్యక్షులు అందరూ భారీ ఎత్తున మహిళలు పాల్గొని బోనాల సంబరాలను విజయవంతం చేశారు.



## ఘనంగా శ్రీచైతన్య కావూరి హిల్స్ జోన్ రోర్ వేడుకలు

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** విద్యారంగంలో నాలుగు దశాబ్దాల సుదీర్ఘ అనుభవంతో ఘనమైన వారసత్వాన్ని కలిగిన శ్రీచైతన్య విద్యా సంస్థలు తమ కావూరి హిల్స్ జోన్ ఆధ్వర్యంలో రైజ్ ఆఫ్ అచీవర్స్ అండ్ రాక్ స్టార్స్ 2026 ఫ్రెషర్స్ డే వేడుకలు, ఇంటర్ కాలేజ్ స్పోర్ట్స్ కాంపిటీషన్స్ మంగళవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు సాగిన ఈ వేడుక విద్యార్థులలో నూతన ఉత్సాహాన్ని, ఉన్నత లక్ష్యాల పట్ల కొత్త ఆకాంక్షలను రగిలించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజన, సైబరాబాద్ డెప్యూటీ పోలీస్ కమిషనర్ రీతిరాజ్‌హాజరయ్యారు. అతిథులు తమ ప్రసంగంలో... భవిష్యత్ విజేతలను తీర్చిదిద్దడంలో శ్రీచైతన్య విద్యాసంస్థలు పడుతున్న నిరంతర శ్రమను కొనియాడారు. శ్రీచైతన్య అందిస్తున్న ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థను విద్యార్థులు సరైన రీతిలో ఉపయోగించుకుని అత్యుత్తమ ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. ఐఐటీ, జేఈఈ, నీట్ వంటి ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి పరీక్షలలో శ్రీచైతన్య విద్యార్థులు ప్రతి ఏటా సాధిస్తున్న అద్భుతమైన విజయాలను ఈ సందర్భంగా వారు కొనియాడారు. ఇటువంటి వేడుకలు కేవలం విద్యా ప్రయాణానికి ఆరంభంగా నిలవడమే కాకుండా, విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని నింపి ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి ప్రేరణనిస్తాయని పేర్కొన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన ప్రముఖ సినీ నటుడు నిఖిల్ సిద్ధార్థ తన ఉత్తేజపూరితమైన ప్రసంగంతో విద్యార్థులలో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు. ఓటమికి భయపడకుండా అనుకున్న లక్ష్యం దిశగా అడుగులు వేయాలని, యువత తమ కలలను నిజం చేసుకునే వరకు విశ్రమించకూడదని పిలుపునిచ్చారు. ఈ వేడుకలో శ్రీచైతన్య విద్యా సంస్థల డైరెక్టర్లు ముఖ్య భూమిక పోషించి, విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. సుష్మా బొప్పన, అకాడమిక్ డైరెక్టర్, శ్రీచైతన్య విద్యా సంస్థలు మాట్లాడుతూ.. “జాతీయ స్థాయి ర్యాంక్‌లలోనూ, అగ్రశ్రేణి ఫలితాల్లోనూ కావూరి హిల్స్ జోన్ ఒక చిరునామాగా (హబ్) మారిందంటే, అది ఇక్కడి విద్యార్థుల శ్రమ, ఉపాధ్యాయుల నిరంతర తోడ్పాటు, టాప్ ర్యాంకులే లక్ష్యంగా రూపొందించిన ప్రోగ్రాముల ఫలితమేనని పేర్కొన్నారు.

## అసోంలో సిఆర్‌పిఎఫ్ క్యాంప్ వద్ద దారుణం

**తోటి జవాన్లపై కాల్పులు జరిపి ఆత్మహత్య చేసుకున్న ఏపి అధికారి**

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** అసోం రాష్ట్రంలో సిఆర్‌పిఎఫ్ క్యాంప్ వద్ద మంగళవారం ఉదయం ఏపికి చెందిన ఓ ఏఎస్ఐ తోటి జవాన్లపై ఇన్సాస్ తుపాకీతో కాల్పులు జరపడంతో ఇద్దరు చనిపోగా మరొకరు గాయపడ్డారు. ఈ ఘటనకు తరువాత సదరు ఏఎస్ఐ తనను తాను కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అస్సాంలోని నాగావ్ జిల్లా కథెజొరి వద్ద గల సిఆర్‌పిఎఫ్ 34వ బెటాలియన్ ప్రధాన గేట్ డ్యూటీలో వున్న ఏపికి చెందిన ఏఎస్ఐ బల్లాని ప్రేమానందం ఉదయం ఏడు గంటల సమయంలో వున్నట్టుండి తన చేతిలో వున్న ఇన్సాస్ తుపాకీతో విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఏఎస్ఐ రాంనవల్ సింగ్, హెడ్ కానిస్టేబుల్ విష్ణుప్రసాద్ బహేల్‌లు ఘటనా స్థలం లోనే మరణించగా ఏఎస్ఐ గోవింద్ శ్రీవల్ తీవ్రంగా గాయపడ్డాడు. కాల్పులు ఘటన తరువాత ఏఎస్ఐ ప్రేమానందం తన వద్ద వున్న ఇన్సాస్ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సిఆర్‌పిఎఫ్ క్యాంప్ కార్యాలయం వద్ద సంచలనం రేపింది. కాల్పుల ఘటనతో అ ప్రమత్తమైన అక్కడి అధికారులు తీవ్రంగా గాయపడ్డ గోవింద్ శ్రీవల్‌ను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అతని ఆరోగ్యం విషమ ంగా వుందని అధికారులు తెలిపారు. కాగా కాల్పుల ఘటనపై ఢిల్లీలోని సిఆర్‌పిఎఫ్ ఉన్నతాధికారులు వెంటనే ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించా రు. ప్రధాన గేట్ వద్ద డ్యూటీలో వున్న ఏఎస్ఐ ప్రేమానందం ఎందుకు ఇలా చేశాడనే దానిపై వెంటనే నివేదిక ఇవ్వాలని 34వ బెటాలియన్ అధికారులను ఆదేశించారు.

# భారీ వర్షాలకు అస్తవ్యస్తం

## పొంగుతున్న వాగులు, వంకలు
## పలు గ్రామాలకు రాకపోకలు బంద్
## మరో రెండు రోజులు భారీ వర్షాలు

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో భారీ వర్షంతో పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. హైదరాబాద్ తో సహా పలు జిల్లాల్లో రికార్డు వర్షపాతం నమోదు అయింది. పలు చోట్ల నీరు నిలిచిపోయింది. రాష్ట్రంలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నల్లగొండ, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ తదిర జిల్లాల్లో వర్షాలు కురిశాయి. కొత్తగూడెం జిల్లాలో మంగళవారం తెల్లవారు జాము నుండి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు జల్లేరు, కిన్నెరసాని, కోడెల, తునికిదున్నే వాగులతో పాటు పలు చిన్న వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. కొత్తగూడెం జిల్లాలో మర్కోడు-ఆళ్లపల్లి ప్రధాన రహదారిపై అనిశెట్టిపల్లి గ్రామ శివారులోని పుణ్యపు వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఆ మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వాగు ఉప్పొంగడంతో అక్కడికి చేరుకున్న ఆర్టీసీ బస్సు ముందుకు వెళ్లలేక నిలిచిపోయింది. ఫలితంగా జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రానికి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని వాగులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ వాగులు దాటేందుకు ప్రయత్నించవద్దని పోలీసులు, రెవెన్యూ శాఖ అధికారులు హెచ్చరించారు. గర్భిణులు, బాలింతలు లేదా అత్యవసర వైద్య సేవలు అవసరమైన వారు వాగులు దాటాల్సిన పరిస్థితి ఉంటే ముందుగానే పోలీసు శాఖ లేదా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పరిస్థితులు సాధారణ స్థితికి చేరుకునే వరకు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. భారీ వర్షాలకు వికారాబాద్-పరిగి ప్రధాన రహదారిపై ఎన్నెపల్లి సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద రోడ్డు దెబ్బతింది. రహదారిపై వర్షపు నీరు నిలిచిపోవడంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డులో ఏర్పడిన గుంతల్లో నీరు నిలవడంతో వాహనాలపై నీరు చిమ్ముతూ ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అలాగే భారీ వర్షాల కారణంగా సమీపంలోని వాగులు, వంకలు పొంగిపొర్లడంతో రహదారిపైకి వరద నీరు చేరి రోడ్డు కొట్టుకుపోయింది. ముఖ్యంగా ఎన్నెపల్లి వద్ద రహదారి ఎక్కువగా దెబ్బతినడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వెంటనే స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు ఆర్‌అండ్‌బీ అధికారులను కోరుతున్నారు.

కాగా గడచిన 24 గంటల్లో రాష్ట్ర వ్యాప్తంగా సగటున 2.35 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయింది. తెలంగాణలోనే అత్యధికంగా కామారెడ్డి జిల్లాలో 7.35 సెంటీమీటర్ల వర్షపాతం చోటు చేసుకుంది. వివిధ జిల్లాల్లో వర్షపాతం వివరాలు చూస్తే రంగారెడ్డిలో 3.38 సెంటీమీటర్లు, మెదక్‌లో 2.72 సెంటీమీటర్లు, సంగారెడ్డిలో 3.01 సెంటీమీటర్లు, సిరిసిల్లలో 4.17 సెంటీమీటర్లు, భూపాలపల్లిలో 3.57 సెంటీమీటర్లు, వికారాబాద్‌లో 4.01 సెంటీమీటర్లు, కరీంనగర్‌లో 2.31 సెంటీమీటర్లు, హైదరాబాద్‌లో 2.90 సెంటీమీటర్లు, గద్వాల్‌లో 2.67 సెంటీమీటర్లు, వనపర్తిలో 3.16 సెంటీమీటర్లు, కొత్తగూడెంలో 4.79 సెంటీమీటర్లు, సూర్యాపేట్‌లో 4 సెంటీమీటర్లు, మహబూబాబాద్‌లో 2.83 సెంటీమీటర్లు, ఖమ్మం జిల్లాలో 3.68 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇక హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధిలో అత్యధికంగా సరూర్‌నగర్ ప్రాంతంలో 11.3 సెంటీమీటర్ల భారీ వర్షపాతం నమోదైంది. దాని సమీపంలోని అలకాపురి కాలనీలో 10.9 సెంటీమీటర్ల వర్షం కురవగా, ఎల్‌బీ నగర్ జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద 9.6 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు వివరించారు.




## గాలిలో ఉండగానే ఎయిరిండియా విమానంలో కుదుపులు

**12 మందికి గాయాలు.. సురక్షితంగా ల్యాండింగ్**

**న్యూఢిల్లీ, ఆగస్టు 4:** ఎయిర్ ఇండియా విమానం గాలిలో ఉన్న సమయంలో భారీ కుదుపునకు లోనైంది. ఈ ఘటనలో సుమారు 12 మంది ప్రయాణికులు గాయపడ్డారు. థాయ్‌ల్యాండ్‌లోని పుకెట్ నుంచి ఢిల్లీ వస్తున్న విమానంలో ఈ ఘటన జరిగింది. ప్రయాణికులతో పాటు ఇద్దరు విమాన సిబ్బంది కూడా గాయపడినట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలిసింది. కుదుపు వల్ల విమానానికి ఎటువంటి నష్టం జరగలేదని అధికారులు చెప్పారు. ఈ ఘటన పట్ల ఎయిర్ ఇండియా ప్రకటన చేసింది. పుకెట్ నుంచి ఢిల్లీ వస్తున్న ఫ్లయిట్ ఏఐ379 ఆగస్టు 4వ తేదీన స్వల్ప స్థాయిలో ప్రకంపనలకు లోనైనట్లు పేర్కొన్నది. ఆల్టిట్యూడ్ మార్పు సమయంలో ఈ ఘటన జరిగినట్లు వెల్లడించారు. ఏదేమైనా ఆ విమానం ఢిల్లీలో సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. ప్రయాణికులు, సిబ్బంది క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. విమానం కుదుపునకు గురైనప్పుడు దాంట్లో సుమారు 134 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రస్తుతానికి సీరియస్ గాయాలు లేవని ఎయిర్‌లైన్ సంస్థ ప్రకటించింది. అకస్మాత్తుగా ఆల్టిట్యూడ్ మార్పు జరగడం వల్ల కుదుపునకు గురైనట్లు ప్రయాణికులు తెలిపారు. కొందరు ప్రయాణికుల తలలు విమాన రూఫ్‌కు బలంగా తగిలాయి. కొందరి తలకు గాయాలు కాగా, కొందరి శరీరాలకు దెబ్బలు తగిలాయి.

## బహుభాషా నటుడు ప్రదీప్‌రావత్ కన్నుమూత

**ముంబయి, ఆగస్టు 4:** బహుబాషా నటుడు ప్రదీప్‌సింగ్‌రావత్ 74వ ఏట కన్నుమూసారు. ముంబయిలోని ఆయన నివాసంలోనే గుండెపోటుతో



కన్నుమూసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. తెలుగుతోపాటు వివిధ భాషాల్లో ఆయన నటించారు. సై, చత్రపతి, గజిని చిత్రాలే కాకుండా అనేక తెలుగు మళయాళ తమిళ చిత్రాల్లో తన విలనిజంతో ఆయన ప్రేక్షకులను కట్టిపడేసారు. ఆయన మృతిపట్ల దక్షిణాది చిత్రసీమప్రముఖులు పలువురు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. నటనలో కొత్త ఒరవడిని తీసుకువచ్చిన వ్యక్తి ప్రదీప్‌రావత్ అని కొనియాడారు. 1985లో రాజ్ బబ్బర్ ఐత్‌బార్ హిందీ సినిమాతో తెరంగేట్రం చేసిన రావత్ బీఆర్ చోప్రా నిర్మించిన మహా భారత్ సీరియల్‌లో అశ్వద్ధామగా నటించి వెలుగులోకి వచ్చాడు. తెలుగులో 100కు పైగా సినిమాల్లో నటించిన రావత్ చివరగా గత నెలలో తరుణ్ భాస్కర్ హీరోగా థియేటర్లకు వచ్చిన గాయపడ్డ సింహంలో కనిపించాడు. మరణ వార్త తెలుసుకున్న సినీ అభిమానులు, సెలబ్రిటీలు సోషల్ మీడియా ద్వారా ఆయన మృతికి సంతాపం తెలుపుతున్నారు.

## రైతాంగానికి కేంద్ర పింఛన్


**పిఎం కిసాన్ మాన్‌ధన్ యోజన దరఖాస్తుల స్వీకరణ**

హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త: రైతాంగానికి కేంద్ర ప్రభుత్వం పెన్షన్ పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రధానమంత్రి కిసాన్ మాన్‌ధన్ యోజన పథకం పేరుతో రైతులు వృద్ధాప్యంలోకి వచ్చిన తర్వాత ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చర్యలు చేపట్టింది. ఈ మేరకు మంగళవారం కేంద్రం వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వృద్ధాప్యంలోకి వచ్చాక చాలామంది రైతుల కు ఎలాంటి ఆదాయ వనరులు ఉండవని, ఈ నేపథ్యంలో వయస్సు పైబడిన చిన్న, సన్నకారు రైతులకు అండగా ఉండేందుకు కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పథకం కింద 60 ఏళ్లు నిండాక రైతులకు ప్రతీనెల రూ.3వేల చొప్పున పింఛన్ జీవితకాలం అందుతుందని వివరించింది. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న రైతులు ఈ పథకంలో చేరేందుకు అర్హులు.

## లిఫ్ట్‌లో ఇరుక్కుని మహిళ దుర్మరణం

**చందానగర్‌లో విషాదం**

**హైదరాబాద్ (శేరిలింగంపల్లి), ఆగస్టు 4, ప్రభాతవార్త:** నగర శివార్లలోని చందానగర్‌లో విషాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు లిఫ్ట్‌లో ఇరుక్కుని ఓ మహిళ దుర్మరణం పాలయ్యారు. ఏలాంటి సూచిక బోర్డులేకుండా లిఫ్ట్‌ను ఆపరేట్ చేయటంతో లిఫ్ట్‌ఎక్కిన మహిళ ప్రమాదానికి గురై మృతిచెందిన హృదయ విదారక ఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సంఘటనకు సంబందించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శేరిలింగంపల్లి మండల పరిధిలోని నల్లగండ్లలో నివాసముంటున్న దాడి శ్రీనివాస్, అతని భార్య అనసూయ (43)తో కలిసి అన్నపూర్ణ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న మేనమామ దాడి గోవింద్ ఇంటికి చుట్టపు చూపుగా వచ్చారు. అన్నపూర్ణ ఎన్‌క్లేవ్, చాట్యాజ్ మెన్షన్ అపార్ట్‌మెంట్‌లో విశ్రాంతి తీసుకుంటున్న గోవింద్‌ను పరామర్శించేందుకు అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌కు చేరుకుని అనసూయ లిఫ్ట్ బటన్ నొక్కడంతో లిఫ్ట్‌తలుపులు తెరుచుకున్నాయి. కాగా ఇంతలో అనసూయ లిఫ్ట్‌లోనికి ఎక్కుతున్న క్రమంలోనే ఒక కాలు లిఫ్ట్‌లో పెట్టి మరోకాలును లోపలికి తీసుకునే క్రమంలోనే లిఫ్ట్ అకస్మాత్తుగా పైకి కదిలింది. దీంతో అనసూయ లిఫ్ట్ ప్రవేశ ద్వారం మధ్యలోనే ఇరుక్కుపోయి నడుము బాగంతో పాటు శరీర భాగాలకు తీవ్ర గాయాలు కావడంతో ఆమె అపస్మారక స్థితిలోనికి వెళ్లింది. అది గమనించిన అపార్ట్‌మెంట్ వాసులు అక్కడకు చేరుకుని అనసూయను లిఫ్ట్ నుంచి బయటకు తీసి చికిత్స నిమిత్తం చందానగర్‌లోని అర్చనా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కాగా అప్పటికే ఆనసూయ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాద్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మృతురాలి భర్త శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



అనసూయ (ఫైల్)

## నెలాఖరుకల్లా చౌటుప్పల్ ఏరియా హాస్పిటల్ పనులను పూర్తి చేయాలి

**అధికారులను ఆదేశించిన వైద్య మంత్రి దామోదర రాజనర్సింహా**



**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** చౌటుప్పల్ ఏరియా హాస్పిటల్ నిర్మాణ పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్‌లో హాస్పిటల్ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ మేరకు మునుగోడు నియోజకవర్గంలోని ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధి, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై మంత్రి మంగళవారం సమీక్షి ంచారు. సెక్రటేరియట్‌లో జరిగిన సమావేశంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డాక్టర్ క్రిస్టినా, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, డాక్టర్ వాణి, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, డాక్టర్ రవిందర్ నాయక్, నల్గొండ జిల్లా డీఎంహెచ్, డాక్టర్ రాహుల్ పాల్గొన్నారు. నియోజకవర్గంలోని హాస్పిటళ్లలో అందుతున్న వైద్య సేవలు, ఆయా హాస్పిటళ్ల అభివృద్ధి పనులు, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను అధికారులు మంత్రికి వివరించారు. హాస్పిటళ్లలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని నాంపల్లి, మనుగోడులో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, కమ్యునిటీ హెల్త్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేసే అంశాన్ని పరిశీలించాలని ప్రిన్సిపల్ సెక్రటరీని మంత్రి ఆదేశించారు. చండూరులో వంద బెడ్ల ఏరియా హాస్పిటల్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించారు. ఏరియా హాస్పిటల్ ఏర్పాటు అవసరాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. చౌటుప్పల్ ఏరియా హాస్పిటల్ నిర్మాణ పనులను పూర్తి చేసి, వంద బెడ్ల హాస్పిటల్‌కు అనుగుణంగా ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేయాలని అందుకనుగుణంగా డాక్టర్లు, సిబ్బందిని నియమించాలని మంత్రి సూచించారు. చౌటుప్పల్‌లో మదర్ అండ్ చైల్డ్ హెల్త్ సెంటర్, ట్రామా కేర్ సెంటర్లను అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు.

## బాస్కెట్ బాల్ క్రీడాకారిణిపై జనరల్ సెక్రెటరీ లైంగిక వేధింపులు

**మాదాపూర్‌లో కేసు నమోదు**

**హైదరాబాద్ (గచ్చిబౌలి), ఆగస్టు 4, ప్రభాతవార్త:** తెలంగాణ బాస్కెట్‌బాల్ అసోసియేషన్‌లో లైంగిక వేధింపుల వివాదం సంచలనంగా మారింది. టోర్నమెంట్ల సందర్భంగా మహిళా బాసె ్కట్ బాల్ క్రీడా కారినులను అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ లైంగికంగా వేధింపులకు గురిచేశాడని పోలీసులకు పిర్యాదు అందడంతో మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో కోచ్ ప ృధ్వీశ్వర్‌రెడ్డి మీద కేసు నమోదైంది. మాదాపూర్ పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని బిహెచ్‌ఈఎల్‌లో నివాసముంటున్న బాలిక ఇంటర్ చదువుతున్నది. రెండేళ్లుగా బాధితురాలు బాస్కెట్ బాల్ కోచింగ్‌కు వేళ్తుంది. సదరు క్రీడాకారిని టోర్నమెంటుకు వెళ్తున్న సమయంలో కోచ్, తెలంగాణ బాస్కెట్ బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ, డ్రీమ్ బాస్కెట్ బాల్ అకాడమీ కోచ్ ప ృధ్వీశ్వర్‌రెడ్డి(28) లైంగిక వేధింపులకు పాల్పడడం, అసభ్యంగా తాకడం, ప్రవర్తిస్తుండడంతో విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులకు చెప్పింది. దీంతో బాలిక తల్లిదండ్రులు జులై 24న రామచంద్రాపురం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు మంగళవారం కేసును మాదాపూర్ పోలీస్ స్టేషన్‌కు బదలీ చేశారు. మాదాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా ప ృధ్వీశ్వర్‌రెడ్డి పరారీలో ఉన్నాడని పోలీసులు తెలిపారు. కాగా గతంలో గద్వాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో జరిగిన టోర్నమెంట్ల సమయంలో మహిళా క్రీడాకారులను అభ్యంతరకరంగా తాకుతూ కులం పేరుతో దూషించాడని ఫిర్యాదులో తెలిపారు. బాధితురాలు మాదాపూర్‌లోని డ్రీమ్ బాస్కెట్ బాల్ అకాడమీకి కోచింగ్ కోసం వచ్చిన సమయంలో సైతం ప ృధ్వీశ్వర్‌రెడ్డి అసభ్యంగా ప్రవర్తించాడని పిర్యాదులో తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

## ఇండిగో-ఇంటర్ విద్య కమిషనరేట్ మధ్య ఎంఒయు

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివే బాలికలకు విమానయానరంగంలో ఉద్యోగ అవకాశాల కోసం ఇండిగో సంస్థతో ఇంటర్ విద్య శాఖ అవగాహన ఒప్పందం(ఎంఓయు) చేసుకుంది. ఇండిగో సంస్థకి చెందిన సీఎస్ఆర్ విభాగమైన ఇండిగోరీచ్ తన అమలు భాగస్వామి అయిన భారత్‌కేర్స్ (ఎస్ఎంఈసీ ట్రస్ట్) ద్వారా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన మహిళా విద్యార్థులకు విమానయాన రంగంలో ఉద్యోగ అవకాశాలను ప్రోత్స హించేందుకు ప్రభుత్వ ఇంటర్మీడియట్ విద్యా శాఖతో మంగళవారం అవగాహన ఒప్పందం 'గివింగ్ వింగ్స్ టు ఫ్లై' కార్యక్రమం, ఏటీఆర్ టైప్ రేటింగ్‌తో కూడిన కమర్షియల్ పైలట్ లైసెన్స్ (సీపీఎల్) శిక్షణ కోసం వసతి, భోజనం, వైద్య బీమా సహా పూర్తి మద్దతును ఇండిగో సంస్థ అందించనుందని ఇంటర్‌విద్య డైరెక్టర్ అభిలాషఅభినవ్ తెలిపారు.

## ఇంజినీరింగ్ ఫైనల్ ఫేజ్‌లో 75,054 మందికి సీట్ల కేటాయింపు

**80 శాతం సీట్ల కేటాయింపు**

**ఇడబ్ల్యుఎస్ కోటాలో 5,771 మందికి సీట్లు**

**7లోపుగా ట్యూషన్ ఫీజు చెల్లించి కాలేజీల్లో చేరాలి**

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 2026-27 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్ సెట్-2026 ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌లో భాగంగా మంగళవారం ఫైనల్ ఫేజ్ సీట్ల కేటాయింపు చేశారు. 75,054 మందికి సీట్లు కేటాయించగా.. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 7లోపుగా కాలేజీకి చెందిన ట్యూషన్ ఫీజును చెల్లించి కాలేజీల్లో చేరాలని సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 94,156 సీట్లు కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉండగా.. వాటిలో 75,054 సీట్లను కేటాయించారు. మొత్తం సీట్లలో 80 శాతం సీట్లను ఫైనల్ ఫేజ్‌లో కేటాయించారు. ఎప్ సెట్-2026లో ఫైనల్ ఫేజ్‌లో 35,096 మంది వెబ్ ఆప్షన్లను ఇచ్చారు. మొత్తం సీట్లలో 75,054 సీట్లను కేటాయించగా మరో 19,102 సీట్లు ఖాళీగా ఉన్నాయి. రెండో విడతలో సీట్లు పొందిన విద్యార్థుల్లో 51,962 మంది ఆప్షన్లను మార్చుకోలేదు. 19,811 మంది తాము చేరిన కాలేజీలు కాకుండా ఇతర కాలేజీల్లో చేరడం కోసం ఆప్షన్లను ఇచ్చారు. రాష్ట్రంలో 176 ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో 94,156 సీట్లు కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉండగా.. అందులో 75,054 సీట్లను ఫైనల్ ఫేజ్‌లో కేటాయించారు. ఈడబ్ల్యూఎస్ కోటాలో 5771 సీట్లను కేటాయించారు. ఒక గవర్నమెంట్ కాలేజీలో 214 సీట్లు ఉంటే 45(21శాతం) సీట్లను కేటాయించారు. 21 యూనివర్సిటీ కాలేజీల్లో 6437 సీట్లకుగానూ 4468 సీట్లను(69శాతం) కేటాయించారు. 2 ప్రైవేటు యూనివర్సిటీల్లో 1386 సీట్లకుగానూ 1372 సీట్లను(99 శాతం) కేటాయించగా 14 సీట్లు ఖాళీగా ఉన్నాయి. 152 ప్రైవేటు కాలేజీల్లో 86,119 సీట్లనుగాను 69,169 సీట్లను(80 శాతం) కేటాయించగా.. మరో 16,950 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఇప్పటికే కాలేజీల్లో చేరిన విద్యార్థులు అదే కాలేజీలో మరో బ్రాంచ్‌లో చేరాలనకుంటే ఈ నెల 12, 13 తేదిల్లో ఇంటర్నల్ స్లైడింగ్‌లో ఆన్‌లైన్‌లో పాల్గొనడానికి అవకాశం కల్పించినట్లు సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన తెలిపారు.

## తెలంగాణలో బిజెపి అధికారంలోకి రావడమే లక్ష్యం

**అమెరికాలో మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**




**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు4:** తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేస్తున్నాయని తెలంగాణ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు అన్నారు. అగ్రరాజ్యం అమెరికాలోని న్యూజెర్సీ రాయల్ అల్బర్ట్ హాల్‌లో ఒవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ (యూఎస్‌ఏ ఆఫ్ బీజేపీ) ఆధ్వరంలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రవాస భారతీయులను ఉద్దేశించి మాట్లాడుతూ.. భారతదేశం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక శక్తిగా ఎదిగిందని, మౌలిక సదుపాయాల కల్పనలో అపూర్వమైన పురోగతి సాధించిందని, కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో 75విమానాశ్రయాలు ఉండగా, ఎన్డీఏ ప్రభుత్వ పాలనలో 150కు పెంచి ప్రపంచస్థాయి మౌలిక వసతులతో అభివృద్ధిచేసింది. రానున్న జీహెచ్ఎంసీ శాసనసభ, ఎన్నికల్లో బీజేపీ వవిజయం సాధించి తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన రాష్ట్ర అభివృద్ధిని దెబ్బతీసిందని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజల ఆశలను నెరవేర్చ డంలో విఫలమైందని విమర్శించారు. ఈ రెండు పార్టీల పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని పేర్కొన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం దేశాభివృద్ధి, జాతీయ భద్రత, మౌలిక సదుపాయాల కల్పనలో విశేష పురోగతి సాధించిందని రాంచందర్‌రావు తెలిపారు. డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా స్టార్టప్ ఇండియా వందే భారత్ రైళ్లు, ఆయుష్మాన్ భారత్, పీఎం ఆవాస్ యోజనా, జల్ జీవన్ మిషన్, పీఎం కిసాన్, వంటి పథకాలు దేశ అభివృద్ధికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. ఆర్టికల్ 370రద్దు, అయోధ్యలో శ్రీరామ మందిరం నిర్మాణం, మహిళ రిజర్వేషన్ బిల్లు వంటి నిర్ణయాలను ఆయన ప్రస్తావించారు. అనంతరం తెలంగాణ బీజేపీ రాష్ట్ర కోషాధికారి డి.వాసుదేవరావు మాట్లాడుతూ.... రాంచందర్‌రావు నిజాయితీ నిబద్ధత కల్గిన నాయకుడని కొనియడారు.

యుఎస్ఏ ఆఫ్ బీజేపీ మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి అనుగుల, యుఎస్ఏ ఆఫ్ బీజేపీ తెలంగాణ కన్వీనర్ విలాస్‌రెడ్డి జంబులా, తదితరులు మాట్లాడుతూ.. అమెరికాలో నివసిస్తున్న భారతీయులు దేశభక్తి జాతీయవాద, భావజాలంతో భాజపాకు అండగా నిలస్తు న్నారని, భారతదేశాన్ని ప్రపంచలో అగ్రగామిగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రవాస భారతీయులు తమ వంతు పాత్ర పోషిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా భారతీయుల విశ్వాసాన్ని చూరగోన్న నాయకుడిగా ప్రధాని నరేంద్ర మోదీ నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో అమర్‌గోస్వామి, శరత్ వేముల, రఘువీర్‌రెడ్డి, విజయ్ కుందూర్, ప్రవీణ్ తడకమల్లా, మధు బెల్లం, ప్రదీప్ కట్టతోపాటు అమెరికాలోని పలు రాష్ట్రలనుంచి వందలాది మంది ప్రవాస భారతీయులు బీజేపీ నాయకులు, సామాజిక కార్యకర్తలు వ్యాపారవేత్తలు ఈకార్యక్రమానికి హాజరై ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వానికి తమ మద్దతు ప్రకటించారు. వికసిత్ భారత్-2047, లక్ష ్య సాధనలో తాముకూడా భాగస్వాముల మవుతామని వారు పేర్కొన్నారు. చివరకు అతిథులను ప్రవాస భారతీయులు ఘనంగా సన్మానించారు.

## ఎంఎన్‌జె తరహా ప్రభుత్వ కేన్సర్ హాస్పిటల్ వరంగల్‌లో ఏర్పాటు

**మంత్రి దామోదర రాజనర్సింహా**

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో కొనసాగుతున్న ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి తరహాలోనే రెండో అతిపెద్ద ప్రభుత్వ కేన్సర్ హాస్పిటల్‌ను వరంగల్‌లో ఏర్పాటు చేస్తామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు ఉత్తర తెలంగాణ ప్రజలకు అత్యాధునిక కేన్సర్ వైద్య సేవలను అందించే విధంగా వరంగల్ రీజనల్ కేన్సర్ హాస్పిటల్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఈ ఏడాది చివరికల్లా అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు. వరంగల్, హన్మకొండ, జనగాం జిల్లాల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై సెక్రటేరియట్‌లోని తన చాంబర్‌లో మంత్రి కొండా సురేఖతో కలిసి మంత్రి దామోదర్ రాజనర్సింహ మంగళవారం సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, యశస్విని రెడ్డి, కేఆర్ నాగరాజు, ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి, డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్, డాక్టర్ సంగీత సత్యనారాయణ, డీఎంఈ వాణి, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవిందర్ నాయక్, ఆయా జిల్లాల ఆరోగ్యశాఖ అధికారులు, హాస్పిటళ్ల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు. ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, ప్రభుత్వ జనరల్ హాస్పిటళ్లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా హాస్పిటల్స్‌లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సమీక్షి ంచారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ పనుల పురోగతిపై చర్చించారు. ఎంజీఎం హాస్పిటల్‌లో ప్రస్తుతం 29 స్పెషాలిటీల్లో వైద్య సేవలు అందిస్తుండగా, మరో 9 సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను త్వరలో ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు.

## దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ ప్రాముఖ్యతను నిరూపిస్తోన్న కాళేశ్వరం

**ఎస్సారెస్పీకి కాళేశ్వరం జలాలు ఎదురెక్కుతున్న విడియోను ట్విట్టర్ వేదికగా షేర్ చేసిన కెటిఆర్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు4:** ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం ద్వారా గోదావరి జలాలు ఎదురెక్కడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని పటాపంచలు చేస్తూ.. కాళేశ్వరం ప్రాజెక్టు తన ప్రాముఖ్యతను మరోసారి నిరూపిస్తోందని అన్నారు. రివర్స్ పంపింగ్ ద్వారా శ్రీరాంసాగర్ వరద కాలువను పునరుజ్జీవింపజేస్తూ.. వరద కాలువలోని రాంపూర్, రాజేశ్వరరావుపేట పంప్ హౌస్‌ల నుంచి నీటిని ఎత్తిపోసి సుమారు 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తూ తెలంగాణ రైతుకు కాళేశ్వరం ప్రాజెక్టు భరోసాను ఇస్తుందని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా, ఈ నీటిని తమ పొలాల్లో చూస్తున్న తెలంగాణ రైతన్నలకు నిజాలేమిటో తెలుసని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన ట్విట్టర్ (ఎక్స్) వేదికగా కాంగ్రెస్ ఆరోపణలు తిప్పికొట్టారు. ఎస్సారెస్పీకి కాళేశ్వరం జలాలు ఎదురెక్కుతున్న వీడియోను షేర్ చేశారు.

## సింగరేణి కాలనీలో ఒకరి దారుణ హత్య



హామేర్ (ఫైల్)

**హైదరాబాద్ (సైదాబాద్), ఆగస్టు 4, ప్రభాతవార్త:** సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తి అందరు చూస్తుండగానే దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించిన ఈ హత్యకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సింగరేణి కాలనీలోని వాంబే క్వార్టర్స్‌లో నివాసముండే హామేర్(40), ఇంద్రావత్ సుమన్‌లు ఇద్దరు స్నేహితులు. వృత్తి రీత్యా ఇద్దరు ఆటో డ్రైవర్లే. మంగళవారం ఉదయం దాదాపు 10.30 గంటల సమయంలో ఇద్దరు స్థానికంగా గొడవ పడ్డారు. ఒకరి నొకరు దూషించుకున్నారు. ఈ క్రమంలో సుమన్ ఒక్కసారిగా కొబ్బరి బొండాలు నరికే కత్తితో హామేర్‌పై విచక్షణా రహితంగా దాడి చేయడంతో రక్తపు మడుగులో కుప్ప కూలిపోయాడు. తీవ్రంగా గాయపడిన హామేర్‌ను స్థానికులు ఆసుపత్రికి తరలించగా అతను అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. నడిరోడ్డుపై అందరు చూస్తుండగానే చోటు చేసుకున్న ఈ సంఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. కాగా మృతుడు హామేర్‌కు నేర చరిత్ర ఉన్నట్లుగా తెలుస్తుంది. హత్య అనంతరం నిందితుడు అక్కడ నుండి పరారయ్యాడు. హత్య సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకున్నారు. నిందితుడి ఆచూకి తెలుసుకోవడం కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. హత్యకు ఇద్దరి మధ్య ఉన్న వ్యక్తిగతీ విభేదాలే కారణమా లేక మరేదైన కారణం ఉందా అనే దానిపై పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

## బోండీ ఘటనలో పలువురిని కాపాడిన రహ్మత్‌పాషాను అభినందించిన కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు4:** ఆస్ట్రేలియాలోని బోండీ ప్రాంతంలో జరిగిన విషాదఘటన సమయంలో అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించి 20 మంది ప్రాణాలను రక్షి ంచడంలో కీలక పాత్ర పోషిం చిన హైదరాబాద్‌కు చెందిన భారతీయ మూలాల వ్యక్తి రహ్మత్ పాషాకు ఆస్ట్రేలియా ప్రభుత్వం శాశ్వత నివాస హోదా (పర్మినెంట్ రెసిడెన్సీ) కల్పిం చడం ప్రతి భారతీయుడికి, ముఖ్యంగా తెలుగు సమాజానికి గర్వకారణమని మాజీమంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రహ్మత్ పాషాను కేటీఆర్ ప్రత్యేకంగా అభినందిస్తూ, ఆయన ప్రదర్శించిన ధైర్యసాహసాలు మానవత్వానికి నిలువెత్తు నిదర్శనమని కొనియాడారు. అలాగే ఆయన సేవలను ఆయన పనిచేసిన రైడ్‌షేరింగ్ సంస్థ కూడా ప్రత్యేకంగా గుర్తించి అభినందించింది.

తెలంగాణ ప్రభుత్వం
వరంగల్ మహానగర పాలక సంస్థ
టెండరు ప్రకటన
టెండర్ ప్రకటన నం. EE-IV/GWMC/CTN-10/e-Proc/2026-27 తేది: 03.08.2026
పనుల సారాంశం
GWMC కమీషనర్ వారి పని యొక్క ఆమోదంపై ఆధారపడి, ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారంపై ఆన్‌లైన్ టెండర్ పద్ధతి ద్వారా 7నం.ల పనులకు రూ.54.91 లక్షలు కొరకు పిలువబడుతున్నవి. పనుల జాబితాతో సహా టెండర్ ప్రకటన జతపరచబడినది. 3 రోజుల టెండర్ కొరకు-7నం.ల పనులు. డౌన్‌లోడింగ్ కొరకు ప్రారంభ తేది: 05.08.2026 మ.12.00గం.నుండి ఆప్లై. డౌన్‌లోడింగ్ కొరకు చివరి తేది: 08.08.2026 మ.12.00గం. వరకు. బిడ్స్ తెరుచుట: 08.08.2026 మ.12.10గం. వద్ద. సంప్రదించవలసిన వివరాలు: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, GWMC, వరంగల్. ఇ-మెయిల్: ee.elec.gwmc@gmail.com కాంటాక్ట్ నం.: 9701999597. ఇ-ప్రొక్యూర్‌మెంట్ వివరాలు ఆన్‌లైన్ ఇ-టెండర్‌లు ఆన్‌లైన్ https://tender.telangana.gov.in O/o EE ఎలక్ట్రికల్ /EE Env/EE వెహికిల్స్ అందుబాటులో ఉన్నాయి.
సం/-. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, వరంగల్ మహానగర పాలక సంస్థ.
DIPR.NO. 7286-PP/CL/ADVT/1/2026-27 తేది: 04.08.2026

## మాజీ సిఎం వైఎస్ జగన్ ఇంటిముందు భార్యతో కలిసి బోరుగడ్డ అనిల్ నిరసన

**విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ తాడేపల్లిలోని నివాసం వద్ద బోరుగడ్డ అనిల్ కుమార్ తన భార్యతో కలిసి నిరసనకు దిగడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. గతంలో తనను వైసిపి నేతగా చెప్పుకున్న అనిల్‌తో పార్టీకి ఎలాంటి సంబంధం లేదని గతంలోనే ఆ పార్టీ స్పష్టత ఇచ్చింది. అయితే తాజాగా జగన్ నివాసానికి చేరుకున్న ఆయన, పార్టీ సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను జగన్ ఇంటికి వెళ్లకుండా సజ్జల తన అనుచరులతో కలిసి అడ్డుకుంటున్నారని, అంతేకాకుండా తనపై 'రౌడీషీటర్' అని తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని బోరుగడ్డ అనిల్ మండిపడ్డారు. తనపై ఎలాంటి రౌడీషీట్ లేదని హైకోర్టు స్పష్టం చేసిందని గుర్తుచేశారు. ఈ వ్యవహారంలో 12 మంది పోలీసులకు కోర్టు మెమో ఇచ్చిందని తెలిపారు.తాను లండన్‌లో పిజి పూర్తి చేశానని, తండ్రి మరణం తర్వాత ఇక్కడికి వచ్చి జగన్‌ను సిఎం చేయడమే లక్ష్యంగా కష్టపడ్డానని అన్నారు. వైఎస్సార్ సమాధి వద్ద ప్రమాణం చేసి మరీ పార్టీ కోసం పనిచేశానని పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు సైతం తన ఇంటికి వస్తారని చెప్పుకొచ్చిన ఆయన, తనపై నిందలు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మద్యం రవాణా టెండర్ల కేసు నిందితుల కస్టడి కోరుతూ సిట్ పిటిషన్

**విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యం రవాణా టెండర్ల కేసులో నిందితులు రాజ్ కెసిరెడ్డి, వాసుదేవ రెడ్డి, కారుమూరి సునీల్‌ల కస్టడీ పిటిషన్ పై ఎసిబి కోర్టు విచారణ జరిపింది. దీనిపై సిట్ పోలీసులు తరపున, నిందితుల తరపున వాద, ప్రతివాదనలను ఎసిబి కోర్టు న్యాయమూర్తి విన్నారు. తదుపరి విచారణను శుక్రవారానికి న్యాయస్థానం వాయిదా వేసింది. నిందితులను 5 రోజుల పాటు కస్టడికి కావాలని కోరుతూ సిట్ పిటిషన్ దాఖలు చేసింది. ప్రస్తుతం నిందితులు చంచల్‌గూడ జైల్లో జుడీషయల్ రిమాండ్‌లో ఉన్నారు.

# క్రీడా నైపుణ్యాన్ని పెంచుకోవాలి

- ఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ గురవయ్య
- 48వ ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ అథ్లెటిక్, చెస్ ఛాంపియన్ షిప్, బాల్ బ్యాడ్మిటన్, క్యారమ్ టోర్నమెంట్ ప్రారంభం




**తిరుపతి, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ ఉద్యోగులు వివిధ క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ (టెక్నికల్ హెచ్‌ఆర్‌డి) కె.గురవయ్య పేర్కొన్నారు. తిరుపతిలో 6వ తేదీ వరకు మూడు రోజులపాటు జరిగే 48వ ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ అథ్లెటిక్, చెస్ ఛాంపియన్ షిప్, బాల్ బ్యాండ్మిటన్, క్యారమ్ టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమం మంగళవారం ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డైరెక్టర్ కె.గురవయ్య మాట్లాడుతూ ఉద్యోగులు తమ విధులను నిర్వహిస్తూ క్రీడల్లో పాల్గొనేందుకు సమయాన్ని కేటాయించడం అభినందనీయమని కొనియాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమే అయినప్పటికీ స్నేహపూరిత వాతావరణంలో గెలుపే లక్ష్యంగా పోటీల్లో పాల్గొనాలన్నారు. ఉద్యోగులు ఉల్లాసంగా పోటీల్లో పాల్గొంటూ ఆరోగ్యం, క్రమశిక్షణ, ఐకమత్యంతో విధులు నిర్వహిస్తూ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలతో సంస్థ అభివృద్ధికి చేయూతనందించాలని కోరారు.

ఈ కార్యక్రమం సందర్భంగా చీఫ్ జనరల్ మేనేజర్లు ఎం.మురళీ కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, కె. సంపత్ కుమార్ తదితరులు మాట్లాడుతూ ఉద్యోగులు క్రీడల్లో పాల్గొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకుంటూ విధి నిర్వహణలో ఉద్యోగులు అత్యుత్తమ సేవలందించాలని కోరారు. ఉద్యోగులు క్రీడలతో పోటీతత్వం ద్వారా బలహీనతల్ని అధిగమించేందుకు అవకాశం వుంటుందని తెలిపారు.

క్రీడాకారులు ఉల్లాసంతో క్రీడల్లో పాల్గొంటూ, మనస్సు నిండా ఆనందాన్ని నింపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ శ్రీకాంత్, తిరుపతి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్, స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు వి.చంద్రశేఖర రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి జి. గంగాధర్ రెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ కుమార వడివేలు, స్పోర్ట్స్, గేమ్స్ కార్యదర్శి లీలా రామ్, పురుషోత్తం, జయప్రకాష్, ముని ప్రసాద్, రమేష్ బాబు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే ముస్తఫా అరెస్ట్

**విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** వైసిపి నేత, గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫాను పోలీసులు అరెస్ట్ చేశారు. కిడ్నాప్ కేసుకు సంబంధించి గత కొన్ని రోజులుగా పరారీలో ఉన్న ఆయన్ను నూజివీడు పోలీసులు గుజరాత్‌లో అదుపులోకి తీసుకున్నారు. సాంకేతిక నిఘా సాయంతో ముస్తఫా ఆచూకీని గుర్తించి అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. కేసు నేపథ్యం: ఇటీవల పొగాకు లోడ్‌తో వెళ్తున్న ఒక వాహనాన్ని ముస్తఫా కుమారుడు, అతని అనుచరులు అడ్డగించారు. ఆ వాహనంలో ఉన్న పొగాకు వ్యాపారితో పాటు మరో వ్యక్తిని కిడ్నాప్ చేసి బంధించారు. బాధితుల కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, వారు రంగంలోకి దిగి కిడ్నాప్‌కు గురైన ఇద్దరినీ సురక్షితంగా విడిపించారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా తొలుత ముస్తఫా కుమారుడిపై కిడ్నాప్ కేసు నమోదు చేశారు. అయితే, విచారణలో ఈ కిడ్నాప్‌తో మాజీ ఎమ్మెల్యే ముస్తఫాకు కూడా సంబంధం ఉన్నట్లు తేలింది. దీంతో ఆయనపై కిడ్నాప్, బెదిరింపుల కింద కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి ముస్తఫా అజ్ఞాతంలోకి వెళ్లగా, చివరకు సాంకేతిక ఆధారాలతో ఆయన గుజరాత్‌లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడకు వెళ్లి అరెస్ట్ చేశారు. ముస్తఫా అరెస్ట్‌ను పోలీసులు అధికారికంగా ధ్రువీకరించారు.

## పాపులర్ షూమార్ట్ అధినేత విజయ్ సేవలు అసామాన్యం

**విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడకు చెందిన ప్రముఖ వ్యాపార సంస్థ పాపులర్ షూమార్ట్ అధినేత చుక్కపల్లి విజయ్ కుమార్ మృతిపట్ల సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ తీవ్ర సంతాపం తెలిపారు. షూమార్ట్ రంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏపీకి విస్తృత గుర్తింపు తీసుకుని వచ్చిన చుక్కపల్లి పిచ్చయ్య బాటలో విజయ్‌కుమార్ మంచి గుర్తింపు పొందారు. సామాజిక సేవా రంగంలో విజయ్ సేవలు అసామాన్యం అన్నారు. పాపులర్ షూమార్ట్ అధినేత చుక్కపల్లి విజయ్ కుమార్ సోమవారం గుండెపోటుతో కన్నుమూశారు. ప్రజల విశ్వాసాన్ని పొందిన ఈ సంస్థ అధినేత మృతి పట్ల ఎమ్మెల్యే సుజన చౌదరి సంతాపం తెలిపారు.

## తిరుపతి జిల్లాలో సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమలు

**తిరుపతి, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రసిద్ధ యాత్రాస్థలం, ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమల-తిరుపతి నగరంతోబాటు జిల్లా వ్యాప్తంగా సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమలులో ఉందని తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ప్రకటించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈ సెక్షన్ నెలరోజులపాటు అమలులో ఉంటుందన్నారు. తిరుపతి జిల్లాలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు, శాంతిభద్రతల పరిరక్షణకు సెక్షన్ 30 పోలీసు యాక్టు అమలులో ఉందన్నారు. ముందస్తు అనుమతిలేనిదే ఎవరూ ఎలాంటి సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదు. ర్యాలీలు, ఊరేగింపులు, సభలు, సమావేశాలకు చట్టప్రకారం పోలీసుశాఖ నుండి అనుమతి తీసుకోవాల్సిందేనన్నారు.



# టిటిడి అగరబత్తీలకు నకిలీల గోల!

- ఇ కామర్స్ పేరుతో శ్రీవారి భక్తులకు బురిడీ

**తిరుమల, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనాలు, లడ్డూ ప్రసాదాల పేరుతో నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి భక్తులను మోసం చేయడమే కాదు.. తాజాగా ఎంతో పవిత్రమైన మహిమాన్వితమైన దేవునికి అలంకరించిన పూలతో తయారుచేసే అగరబత్తీలకు నకిలీ సంస్థలు మార్కెట్లో హల్‌చల్ చేస్తున్నాయి. అంతేగాక టిటిడి అగరబత్తీల తరహాలోనే నకిలీలు తయారుచేసి అదే రీతిలో ప్యాకింగ్, బ్రాండింగ్ పేర్లు వినియోగించుకుని ధర అమాంతం రెండింతలు రెట్టింపుచేసే ఇ కామర్స్ సైట్లలో నకిలీ సంస్థలు మోసం చేయడం వెలుగుచూసింది. దీంతో టిటిడి ఇప్పుడు అగరబత్తీలను కూడా కాపాడుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. భక్తులకు నాణ్యమైన, స్వచ్ఛమైన టిటిడి తయారుచేస్తున్న ఉత్పత్తులనే అందించేందుకు మరో కోణంలో ఆలోచన చేయాల్సి వస్తోంది. అగరబత్తీలను టిటిడి నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌లైన్‌లో ఇ కామర్స్ సంస్థలు విక్రయాలు చేయడం దుమారం రేపుతోంది. ఇప్పటికే తిరుమల, తిరుపతిలో టిటిడి అగరబత్తీలు కోసం భక్తుల నుండి భారీ డిమాండ్ ఉంది. భక్తుల అవసరాలను, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న కొన్ని ఇ కామర్స్ సంస్థలు ఆన్‌లైన్‌లో విచ్చలవిడిగా అమ్మకాలు చేయడం మాత్రం అక్రమార్కులకు పంటపండినట్లేనని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అచ్చం టిటిడి ఉత్పత్తుల్లాగే నకిలీ బ్రాండ్లు ఉండటంతో భక్తులు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. తిరుమల శ్రీవారి ఆలయంలో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి మూలవిరాట్టుతోబాటు ఉప ఆలయాలు, ఉత్సవమూర్తులకు అలంకరించిన పూలు, పూలమాలలను, టిటిడి అనుబంధ ఆలయాలు తిరుపతి గోవిందరాజస్వామి, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, శ్రీనివాస మంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, అప్పలాయగుంట ఆలయం, నారాయణవనం, కోదండరామస్వామి ఆలయాల్లో దేవుళ్ళకు అలంకరించిన పూలమాలలు నిరుపయోగం గాకుండా 2023లో ఏకంగా భక్తివిశ్వాసాలతో పూలతో అగరబత్తీలు తయారు చేయడం మొదలైంది.

తొలుత ఏడురకాల ఉత్పత్తులు తయారుచేసి టిటిడి విక్రయాలు ప్రారంభించింది. భక్తుల నుండి ఈ అగరబత్తీలకు భారీ డిమాండ్ ఏర్పడింది. దీంతో టిటిడి ఉత్పత్తులను పెంచాలని కూడా నిర్ణయించింది. అయితే ఇప్పటికీ టిటిడి అగరబత్తీలకు భక్తుల నుండి స్పందన వుంది. టిటిడి అగరబత్తీల కాంబో ప్యాక్ (ఏడురకాలు బాక్స్)500 రూపాయల వరకు ధర ఉంది. ఇదే నకిలీ బ్రాండ్ల అగరబత్తీలు వెయ్యిరూపాయల వరకు ఇ కామర్స్‌లో ధర ఉందని టిటిడికి ఫిర్యాదు అందింది. టిటిడిపేరుతో నకిలీ ఇ కామర్స్ సంస్థలు ఇలా విక్రయాలు చేయడం భక్తులను కలవరపరుస్తోంది. అయితే నిబంధనలు ఉల్లంఘించి టిటిడి పేరును దుర్వినియోగం చేస్తున్న ఈ నకిలీ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

# బిసి రక్షణ చట్టంపై విజయవాడలో నేడు కీలక భేటీ

**రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత**



**విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా బిసి రక్షణ చట్టం తుది రూపు ఇవ్వడానికి సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా విజయవాడలోని ఓ హోటల్‌లో కీలక సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సిఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బిసిలను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేలా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. దీనిలో భాగంగా, బిసి రక్షణ చట్టాన్ని తీసుకురావడానికి చర్యలు ప్రారంభించామన్నారు. బిసిలను కులాలు, వృత్తుల పేరుతో దూషించినా, వారిపై దాడులకు, దౌర్జన్యాలకు దిగినా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మాదిరిగా రక్షణ చట్టం రూపొందిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. బిసిలపై జరిగే దాదాపు 15 రకాల దాడులు, వేధింపులను ఈ చట్టం కింద నేరాలు గుర్తిస్తామన్నారు. బిసి రక్షణ చట్టంలో భాగంగా కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక కోర్టులు కూడా ఏర్పాటు చేయనున్నామన్నారు. గత సాధారణ ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన తరవాత బిసి రక్షణ చట్టం తీసుకొస్తామని సిఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, ఇప్పటికే చట్ట రూపకల్పనకు పలు పర్యాయాలు కేబినెట్‌లో ఉన్న ఎనిమిది మంది బిసి మంత్రులు పలు పర్యాయాలు భేటీ అయ్యామన్నారు.

భారత రాజ్యాంగానికి లోబడి పలు చట్టాలను పరిశీలించి, అధికారులు బిసి రక్షణ చట్టానికి తుది రూపు తీసుకొచ్చారన్నారు. ఈ ముసాయిదా చట్టాన్ని తుదిరూపు ఇచ్చే క్రమంలో బిసి సామాజిక వర్గానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు, మంత్రులతో కీలక భేటీ విజయవాడలోని మురళీ ఫార్చ్యూన్‌లో బుధవారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తనతో పాటు ఏడుగురు బిసి మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, కొలుసు పార్థసారథి, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్ సహా హోం మంత్రి అనిత, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కూడా హాజరుకానున్నారన్నారు. వారితో పాటు బిసి సామాజిక వర్గానికి చెందిన 30 మంది ఎమ్మెల్యేలు, నలుగురు ఎమ్మెల్సీలు, ఆరుగురు ఎంపీలు ఈ సమావేశం పాల్గొననున్నట్లు తెలిపారు. వారిచ్చే సూచనలు, సలహాలు పరిగణలోకి తీసుకుని బిసి రక్షణ చట్టానికి తుది రూపు ఇచ్చి, సిఎం చంద్రబాబునాయుడుకు అందజేయనున్నామన్నారు. బిసిల అభ్యున్నతికి, గౌరవ ప్రదమైన జీవనానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. దేశంలోనే బిసిలకు సంబంధించి ప్రత్యేక రక్షణ చట్టం తెస్తున్న తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవనుందని మంత్రి సవిత తెలిపారు.

## తిరుమల సమాచారం

# ఏడుకొండలస్వామికి రెండు బ్రహ్మోత్సవాలు

- సెప్టెంబర్ 17నుండి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు
- అక్టోబర్ 14నుండి నవరాత్రి బ్రహ్మోత్సవాలు



**తిరుమల, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడిగా.. ఆపదమొక్కులవాడిగా, అర్చామూర్తిగా వైఖానస ఆగమోక్తంగా పూజలందు కుంటున్న తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి అత్యంత వైభవంగా జరిగే సాంవత్సరిక ఉత్సవాల్లో ప్రత్యేకంగా తొమ్మిది రోజులు పాటు ఉదయం, రాత్రి వాహనసేవలతో అంగరంగవైభవంగా జరిగే "బ్రహ్మోత్స వాలు" ప్రధానం. కరోనా వైరస్ పూర్తిగా నిర్వీర్యం అయిన తరువాత ఈ ఏడాది అధికమాసం రావడంతో రెండుసార్లు బ్రహ్మోత్సవాలు తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించనుంది. సాధారణంగా సెప్టెంబర్ మాసంలో జరిగే సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు, అక్టోబర్‌లో జరిగే నవరాత్రి బ్రహ్మోత్సవాలు రెండువారాల తేడాతో జరిపించేలా ముహూర్తం ఖరారుచేస్తారు. భారతదేశంలోనే మరే ఆలయంలోనూ జరగని విధంగా ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమలేశుని ఆలయంలో అంగరంగవైభవంగా జరిగే "బ్రహ్మోత్సవాలు"కు దేశవిదేశాల నుండి లక్షలాది మంది భక్తులు నలుమూలల నుంచి తండోపతండాలుగా తరలివస్తారు. ఇష్టదైవమ్ వాహనసేవలను వీక్షించి పునీతులవుతారు. తొమ్మిదిరోజులు రోజుకు రెండు వాహనాలపై ఎంతో ముగ్ధమనోహరంగా, సర్వాలంకారభూషితుడై శ్రీవేంకటేశ్వరుని ఉత్సవమూర్తులు శ్రీదేవిభూదేవిసమేత శ్రీమలయప్ప స్వామి వారు ఒక్కో వాహనంపై ఒక్కో విశిష్టతతో ఊరేగి భక్తులను కటాక్షించడం ప్రత్యేకత. శ్రీవారి భక్తులకు ఈ ఏడాది అధికమాసం కావడంతో రెండుదఫాలు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 17 నుంచి 26వరకు, తిరిగి అక్టోబర్ 14నుండి 23 వరకు కన్నుల పండువగా బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలకు తేదీలు ఖరారు చేశారు. ఉదయం పూట వాహనసేవలు 8గంటలకే మొదలవుతాయి. రాత్రి వేళ వాహనసేవలు 7గంటలకు ఆరంభవుతాయి. వార్షిక బ్రహ్మోత్సవాలకు సెప్టెంబర్ 17వ తేదీ ఆదివారం సాయంత్రం అంకురార్పణం, 18న సాయంత్రం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవ ఘట్టానికి శ్రీకారంపడుతుంది. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రత్యేక దర్శనాలు వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు దర్శనాలు రద్దుచేస్తారు. సామాన్యభక్తులకు ఎక్కువగా దర్శనసమయం కల్పించేందుకు ఆ తొమ్మిదిరోజులు బ్రేక్ దర్శనాలు ఉండవు. టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి సారథ్యంలో దేవదేవుని బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

**ఆర్జిత సేవలు రద్దు:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి ప్రతిరోజూ వైఖానస ఆగమోక్తంగా ఆలయంలో ఎన్నో రకాల సేవలు, కైంకర్యాలు జరుగుతుంటాయి. ఈ సేవలు ప్రత్యేక పర్వదినాల్లో, ఏడాదిలో తొమ్మిదిరోజులు జరిగే బ్రహ్మోత్సవాల సమయంలో పూర్తిగా రద్దు చేస్తారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది రానున్న సెప్టెంబర్ 15 నుండి 23 వరకు తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ కారణంగా ఆ తొమ్మిది రోజుల పాటు ఆర్జిత సేవలైన అష్టదళ పాదపద్మారాధన సేవ, తిరుప్పావడ సేవ, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ సేవలు టిటిడి రద్దు చేసింది. వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు, ఎన్ఆర్ఐ, దాతల దర్శనాలను కూడా రద్దు చేయడం జరిగింది. ఈ విషయాన్ని గమనించి భక్తులు టిటిడికి సహకరించాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.



# తిరుమలలో రద్దీ పెరిగితే.. ఆఫ్‌లైన్ టోకెన్లు జారీ గందరగోళం!

- వేళాపాళా లేకుండా ముందుగానే టిటిడి విడుదల
- భక్తుల్లో అయోమయం

**తిరుమల, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంలో అమలవుతున్న సమయనిర్దేశిత సర్వదర్శనం (టైమ్ స్లాట్) టోకెన్లు ఆఫ్‌లైన్‌లో జారీ గందరగోళంగా మారింది. ఈ టోకెన్లు తిరుపతిలోని కౌంటర్లలో ఏ సమయంలో జారీ చేస్తారో? ఎన్ని ఇస్తున్నారనేది కూడా తెలియక సామాన్యభక్తులు అయోమయంలో ఉంటున్నారు. తిరుమలలో వారాంతంలోనేగాక సాధారణ రోజుల్లోనూ భక్తుల రద్దీ విపరీతంగా కొనసాగుతోంది. 40వేల మంది భక్తులు రద్దీ పెరిగితే కొండ కిటకిటలాడుతోంది. ఆపై భక్తుల సంఖ్య అనూహ్యంగా రెట్టింపయితే భక్తుల క్యూలైన్లు వైకుంఠమ్ క్యూ కాంప్లెక్స్‌లు దాటి వెలుపలకు వచ్చేస్తున్నాయి. సాధారణంగానే తిరుమలలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దేశం నలుమూలల నుండి ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్రల నుండేగాక తెలుగురాష్ట్రాల నుండి భక్తులు తరలి వస్తున్నారు. తమ మొక్కుబడుల్లో భాగంగా ఏడుకొండల స్వామిని దర్శించుకోవడానికి చిన్నపిల్లలు, వృద్ధులు, యువకులు ఇలా వచ్చేస్తున్నారు. ఎలాంటి దర్శన టిక్కెట్లు, టోకెన్లు లేకున్నా సాధారణ సర్వదర్శనంలోనూ భక్తులను అనుమతిస్తున్నారు. ఇలా నేరుగా తిరుమలకు వచ్చేస్తున్న భక్తులకు కొండపై వెలుపల క్యూలైన్లు ఎక్కడ నుండి ప్రవేశించాలనేది కూడా భక్తుల్లో గందరగోళంగా మారింది. ఆలయానికి మూడునాలుగు కిలోమీటర్లు దూరం వరకు వ్యాపించిన శిలాతోరణం నుండి గానీ, బాట గంగమ్మ ఆలయం, శ్రీవారి సేవాసదన్‌లు, గోగర్భమ్‌డ్యామ్ ప్రాంతాల నుండి భక్తుల లైన్లు ఉంటాయి. ఇక్కడకు చేరుకోవడమే భక్తులకు దేవుడు కనిపిస్తుంటాడు. అక్కడ నుండి కిలోమీటర్లు దూరం నడకతోనే క్యూలైన్లలో గంటల తరబడి నిలబడి విసిగిపోతున్నారు. సాధారణరోజుల్లో కూడా తిరుమలేశుని 70వేలమంది వరకు భక్తులు దర్శనం చేసుకుంటుండటం విశేషం. అలాంటిది తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగితే తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో శ్రీనివాసం, విష్ణు నివాసం, అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లోని కౌంటర్లలో టైమ్‌స్లాట్ సర్వదర్శనం టోకెన్లు జారీ గందరగోళమే.

**వేళాపాళా లేని టోకెన్లు జారీ:** తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో రోజువారీగా జారీచేసే సమయనిర్దేశిత సర్వదర్శనం టోకెన్లు (టైమ్‌స్లాట్) ఇవ్వడంలో ఒక నిర్దేశిత సమయం పాటించడంలేదు. సాధారణంగా ప్రతిరోజూ మధ్యాహ్నం 1.30-2గంటల ప్రాంతంలో ఈ కౌంటర్లలో టైమ్‌స్లాట్ దర్శన టోకెన్లు జారీచేయాల్సి ఉంది. ఇందుకు అనుగుణంగా భక్తులు కూడా ఎక్కడెక్కడి నుండో ముందుగానే తిరుపతికి చేరుకుని క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షిస్తుంటారు. అయితే భక్తుల రద్దీ పెరిగిన సమయంలో క్యూలైన్లలో భక్తులను నియంత్రించలేక ఈ టోకెన్లు తెల్లవారుజామున 4గంటలకు లేకుంటే ఉదయం 7-8గంటల ప్రాంతంలో జారీ చేసేస్తుండటంతో ఆ తరువాత తిరుపతికి వచ్చిన భక్తులకు టోకెన్లు లేవనే ప్రచారంతో అసహనానికి గురవుతున్నారు. ఎక్కడెక్కడి నుండో వందల వేల కిలోమీటర్లు ప్రయాణించి తిరుపతికి వస్తున్న భక్తులకు టోకెన్లు జారీ లేదని తెలుసుకుని మండిపడుతున్నారు. ముందుగానే ఎలాంటి ప్రకటన చేయకుండా కొన్నిగంటల ముందే టైమ్‌స్లాట్ టోకెన్లు జారీ చేసేయడం పరిపాటిగా మారింది. సాధారణంగా భక్తుల రద్దీని బట్టి తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు 10వేలు, దివ్యదర్శనం టోకెన్లు (శ్రీవారిమెట్టు) 3వేల వరకు జారీచేస్తుంటారు. మరీ వారాంతంలో ఈ టోకెన్లు 2వేల వరకు కుదించేస్తున్నారు. దీనివల్ల ప్రతిరోజూ 20వేల మంది వరకు భక్తులు సర్వదర్శనం టోకెన్ల కోసం తిరుపతికి వస్తున్నారనేది టిటిడి అధికారుల అంచనా. గతంలో టైమ్‌స్లాట్ సర్వదర్శనం టోకెన్లు 12వేల నుండి 15వేల వరకు జారీచేసేవారు. కాలినడక మార్గంలో 3వేలనుండి 5వేల టోకెన్లు జారీచేశారు. ఇప్పుడు భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో ఈ టోకెన్లు కూడా కుదించేశారు. భక్తుల రద్దీ కారణంగానే కొన్ని చర్యలు తీసుకోవడం తప్పదని టిటిడి అధికారుల వాదన. ఈ నేపథ్యంలో తిరుపతిలో వేళాపాళా లేని టైమ్‌స్లాట్ టోకెన్లు జారీ సమయంలో ఎలాంటి మార్పు చేయకుండా నిర్దేశిత సమయానికే నిర్దేశిత సర్వదర్శనం టోకెన్లు జారీచేస్తే బావుంటుందని భక్తుల అభిప్రాయం. సాధారణ సర్వదర్శనం కంటే, సమయ నిర్దేశిత సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులకు ఐదారుగంటలు ముందుగానే దేవుని దర్శనం చేసుకునే వెసలుబాటు ఉంది. వారాంతం శుక్ర, శని, ఆదివారాల్లో ఈ రద్దీ 40వేల మంది వరకు తిరుపతిలో కనిపిస్తుంది.

# కొత్త నిర్ణయాలకు పచ్చజెండా!

- మూడు దశాబ్దాల విధానానికి టిటిడి స్వస్తి

**తిరుమల, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో కొత్త నిర్ణయాలకు పచ్చజెండా ఊపారు. ఇందుకు టిటిడి బోర్డు పెద్దలు కూడా సుముఖత చూపడంతో రానున్న రోజుల్లో సంస్కరణల అమలులో భాగంగా మూడు దశాబ్దాల కాలంగా అమలవుతున్న పాత అకౌంటింగ్ విధానానికి ఆధునిక రూపు కల్పిస్తున్నారు. ఈ మేరకు ఇటీవలే బోర్డు పెద్దలు నిర్ణయం తీసుకున్నారు. అకౌంటింగ్ వ్యవస్థను (ఆర్థిక నివేదికలను) మెరుగుపరిచేందుకు భారత చార్టర్డ్ అకౌంటెంట్స్ సంస్థ (ఐసిఎఐ) సమగ్ర అధ్యయనం చేపట్టింది. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఒక అకౌంటింగ్ మాన్యువల్‌ను ఐసిఎఐ రూపొందించి అందజేయనుంది. ఇప్పటికే ఈ సంస్థకు చెందిన అకౌంటింగ్ రీసెర్చ్ ఫౌండేషన్ ప్రాథమిక అధ్యయనం ప్రారంభించింది. ప్రస్తుతం టిటిడిలో ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్ (ఇఆర్‌పి) ఆధారిత సమగ్ర అకౌంటింగ్ వ్యవస్థ అమలులో ఉంది. ఈ వ్యవస్థను ఆధునీకరించే లక్ష్యంతో కసరత్తు మొదలుపెట్టారు. టిటిడి ఇటీవల చేసిన ప్రతిపాదనల నిర్ణయం ద్వారా శ్రీవారి ఆలయానికి వచ్చే విరాళాలు, వివిధ విభాగాల ఆదాయంతో పాటుగా చేస్తున్న ఖర్చులు, ఆస్తుల నిర్వహణ, ఆర్థిక లావాదేవీల వివరాలన్నింటినీ పారదర్శకంగా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మరింత క్రమబద్ధంగా కంపెనీల లెక్కలను సులభంగా పోల్చి చూసేలా మోసాలను అరికట్టి, నమ్మకాన్ని పెంచడం. ప్రాథమిక భాగాలు నిర్వహించడమే ఈ సంస్కరణల ప్రధాన లక్ష్యంగా భావిస్తున్నారు. టిటిడి వినియోగిస్తున్న అకౌంటింగ్ మాన్యువల్ దాదాపు 30సంవత్సరాల క్రితం రూపొందించిబడింది. కంపెనీస్ యాక్ట్‌లో చోటుచేసుకున్న తాజా మార్పులు, నూతన లెక్కల నిర్వహణ ప్రమాణాలకు అనుగుణంగా టిటిడి ఆర్థిక నియమావళిలో అవసరమైన సవరణలను ఈ కొత్త అధ్యయనం నివేదికలో సూచించనున్నారు. వేగవంతమైన ఆర్థిక నియంత్రణకు మార్గం సుగమం చేయడమే లక్ష్యంగా తుది కసరత్తు కొనసాగుతోంది. ఈ విధానం వీలైనంత త్వరగా అమల్లోకి తేవాలని భావిస్తున్నారు. ముఖ్యంగా తిరుమలలో భక్తులకు వేగంగా దర్శనం చేయించే విధంగా క్యూ లైన్ మేనేజ్ మెంట్ సిస్టమ్ విధానం అమలుచేస్తోంది. అదే విధంగా వసతి గదుల కేటాయింపు విషయంలోనూ సాంకేతికతను వినియోగించుకోవాలని సేవలను పెంపొందించే విధంగా కొత్త విధానం అందుబాటులోకి తీసుకొచ్చింది.



## 17 నుండి టిటిడిలో వస్త్రాల ఇ వేలం

**తిరుమల, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు టిటిడి అనుబంధ ఆలయాల్లో భక్తులు కానుకగా సమర్పించిన వస్త్రాలను ఈనెల 17నుండి 19వరకు ఇ వేలం ద్వారా వేలంవేయనున్నారు. ఈ వేలంలో 177 లాట్లలో కొత్తవి, ఉపయోగించినవి, పాక్షికంగా దెబ్బతిన్న వస్త్రాలు అందుబాటులో ఉన్నాయి. టర్కీ టవళ్లు, ఆర్డినరీ టవళ్లు, లుంగీలు, శాలువాలు, బెడ్‌షీట్లు, దిండుకవర్లు, న్యాప్‌కిన్లు, హ్యాండ్‌కర్చీఫ్‌లు, పిల్లో కవర్లు, బ్లౌజ్‌పీస్‌లు, దుపట్టాలు, పరదాలు, హుండీ గలీబులు, ఈర్వాడాలు తదితర వస్త్రాలను ఇ వేలంలో విక్రయిస్తారు. వివరాలకు తిరుపతిలోని టిటిడి మార్కెటింగ్ కార్యాలయం (వేలములు) 08772 264429ను సంప్రదించవచ్చు. అలాగే డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.కొనుగోలు.ఎపి.జివోవి.ఇన్ వెబ్‌సైట్లలో వివరాలు తెలుసుకోవచ్చు.



తిరుపతి గంగమ్మ ఆలయ పునర్నిర్మాణంపై

# ప్రజాభిప్రాయం తీసుకుంటాం

- కడ పి.డి. వికాస్ మర్మత్
- భక్తులు ఆందోళనలు చెందొద్దు

**కుప్పం, ఆగస్టు 4 ప్రభాతవార్త:** కుప్పం గ్రామ దేవత శ్రీతిరుపతి గంగమ్మ ఆలయ పునర్నిర్మాణ అంశంపై ప్రజలు, భక్తుల అభిప్రాయాలు తప్పక తీసుకుంటామని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక కడ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పి.డి. మాట్లాడారు. ఏడాదిన్నర క్రిందట ఆలయ నిర్మాణంకు సిఎం చంద్రబాబు రూ.8.40 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. ఆలయ పునర్నిర్మాణంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని భావించామన్నారు. ఏటా అమ్మవారి జాతరకు ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు నుంచి 5లక్షల దాకా భక్తులు వస్తుంటారన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయాన్ని పునర్నిర్మించాలని నిధులు మంజూరయ్యాయని వికాస్ మర్మత్ తెలిపారు. సోమవారం ఆలయంకు స్థపతి, ఇంజనీరింగ్ అధికారులు రావడంతో ఆలయ కమిటీతో చిన్నపాటి సమావేశం జరిపామని, అయితే ఇంతవరకు ఆలయ నిర్మాణంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ఈ విషయంగా సోమవారం పుకార్లు చెలరేగాయన్నారు. ఈ వ్యవహారంపై తాను స్పష్టత ఇస్తున్నానన్నారు. ఆలయ నిర్మాణంకు సంబంధించి ప్రజలు, భక్తుల నుంచి ఆగస్టు 31వ తేది వరకు వారి అభిప్రాయాలను కడ కార్యాలయంలో స్వీకరిస్తామని వికాస్ మర్మత్ స్పష్టం చేశారు. అవసరం అనుకుంటే మరింత గడువు సైతం పెంచుతామన్నారు. ఏదిఏమైనా ప్రజాభిప్రాయం తెలుసుకున్నాకే ఆలయ నిర్మాణంపై స్థపతి, దేవదాయ అధికారులతో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు. కుప్పంలో సిఎం చంద్రబాబునాయుడు చొరవతో 10వేలకోట్లతో 32వేల పరిశ్రమలు వచ్చాయన్నారు. కడ ద్వారా పరిశ్రమలకు ఎలాంటి సమస్య లేకుండా వెయ్యి ఎకరాల భూమి సేకరించామన్నారు. రెండు నెలల్లోపు కుప్పం పట్టణంలో మూడో రీచ్ పనులు పూర్తి చేస్తామన్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ స్టేడియం, పార్కుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని త్వరలోనే ఆర్టీసీ బస్‌స్టేషన్ పనులు మొదలుపెడతామని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ వివరించారు.

# బఠాణీలు తింటుంటే..




తాజా బఠాణీలు.. ఆకుపచ్చ ముత్యాల్లా ఎంత అందంగా ఉంటాయి కదా! చూస్తుంటేనే నోట్లో వేసుకోబుద్దేస్తుంది. బఠాణీలను క్యాలీ ఫ్లవర్, క్యారెట్, బంగాళదుంప, క్యాప్సికమ్.. ఇలా దేనితో కలిపి వండినా వాటి రుచి రెట్టింపు వుతుంది. బిర్యానీ, కిచిడీల్లో ఇవి గనుక లేకపోతే.. పెద్ద లోటుగానే ఉంటుంది. వీటిని స్వీట్లు, హాట్లు కూడా చేయొచ్చు. సూప్, సలాడ్ రూపంలోనూ సేవించవచ్చు. బఠాణీల్లో ఎన్ని సుగుణాలున్నాయంటే.. ఇవి.. పచ్చిబఠాణీలు ఎర్రరక్త కణాలు వృద్ధిచెంద డంలో, శరీరం అంతటికీ ప్రాణవాయువును అందజేయడంలో తోడ్పడతాయి. రక్తంలో చక్కెర స్థాయిని క్రమబద్దం చేస్తాయి. బఠాణీలు తినడం వల్ల జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది. తరచూగా బఠాణీలు తినేవారికి క్యాన్సర్ వచ్చే అవకాశం తక్కువ. వీటిలో ఉన్న సెపోనిన్స్ ద్రవ్యాలు క్యాన్సర్ వచ్చే కణాల సూక్ష్మ క్రిములను నిరోధిస్తాయి. వీటిల్లో ఉండే కెరొటెనాయిడ్స్, జియాంధొక్సిన్ వల్ల కళ్లకు దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా కాపాడతాయి. యాంటిఇన్ఫ్లమేటరీ గుణాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. మధుమేహం, ఉబకాయం, గుండెజబ్బుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ఇవి కొన్ని రకాల క్యాన్సర్లను సైతం నిరోధిస్తాయని పరిశోధనల్లో తేలింది. పీచు, పొటాషియం, ప్రొటీన్లు ఉన్నాయి. మాంసాహారం తినని వాళ్లకి మంచి పోషకాహారం. ఇంత మేలు చేసే బఠాణీలను విస్మరిస్తే ఎలా! తరచూ ఏదో రూపంలో తీసుకుందాం. ఆరోగ్యంగా ఉందాం కానీ అవసరమైన దాని కంటే ఎక్కువగా తింటే మాత్రం అనర్థమేనండోయ్. □

# పొట్ట తగ్గేదిలా!



చాలామంది అమ్మాయిలు ఇబ్బంది పడే అంశాల్లో పొట్ట దగ్గర కొవ్వొకటి. అది తగ్గడం కోసం కడుపు మాడ్చుకోవడం, కెలోరీలు లెక్కేసుకొని తినడం, కిలోమీటర్ల కొద్దీ నడవడం వంటివెన్నో చేస్తారు. అవసరమైన పోషకాలు అందక కొత్త సమస్యలు తెచ్చుకుంటారు. అలా కాకూడదంటే కొన్ని అలవాట్లు చేసుకుని, క్రమంగా పాటించాలి. అల్పాహారం మానొద్దు. ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, కార్బోహైడ్రేట్లు, పీచు ఎక్కువగా ఉండే గుడ్లు, ఓట్స్, రాగి, తాజాపండ్లు, నట్స్ వంటివాటికి దానిలో చోటివ్వాలి. ఇవి మెటబాలిజాన్ని మెరుగుపరుస్తాయి. శరీరానికి కావల్సిన శక్తినివ్వడంతోపాటు జీర్ణప్రక్రియను మెరుగుపరుస్తాయి. రోగ నిరోధకతను పెంచుతాయి. రోజూ కొద్దిసేపైనా వ్యాయామానికి చోటివ్వాలి. మధ్యస్థ స్థాయి వాటికి వారంలో రెండున్నర గంటలైనా కేటాయించాలి. కడుంలో మాత్రం పని అనుకోకుండా రోజూ కొంచెం సేపు బరువులు ఎత్తించండి. డంబుల్స్ వగైరా కొనాల్సిన పనిలేదు కానీ. రెండు వాటర్ బాటిళ్లతో చేసినా సరే! ఇంకా గుంజీళ్లనూ జోడించుకుంటే మేలు. ఇవి కొవ్వును కరిగిస్తూనే మెటబాలిజాన్నీ మెరుగుపరుస్తాయి. బోర్ కొట్టినా, ఒత్తిడి పెరిగినా చిరుతిళ్ల వైపు మనసు మళ్లుతుంది. అందుబాటులో బాదం, తాజా పండ్లు, క్యారెట్, కీర వంటి కాయగూరల ముక్కలను దగ్గర ఉంచుకొని అవి తింటే సరి. ఇవి ఆకలిని అదుపు చేయడమే కాదు, జీర్ణక్రియనీ మెరుగుపరుస్తాయి. నీళ్లు బాగానే తాగుతున్నారా? ఇదీ 'పొట్ట'కు కారణమే! కనీసం 2 లీటర్లు తాగుతున్నారో లేదో చూసుకోండి. ఇవి శరీరాన్ని హైడ్రేట్ చేస్తూనే జీర్ణక్రియనూ మెరుగుపరుస్తాయి. మజ్జిగ, హెర్బల్ టీ, పండ్ల రసాల రూపంలో తీసుకున్నా మంచిదే. ఇంకా ఏం తింటున్నాం, తాగుతున్నాం అన్నది గమనించుకుంటే ఉండాలి. కాబట్టి, తినేటప్పుడు ఫోన్, టీ, పుస్తకాలను దూరంగా ఉండాలి. . చివరగా ఒత్తిడి కూడా ఈ సమస్యకు మూలమే. పైగా త్వరగా కొవ్వు కరగకుండా చేస్తుంది. కాబట్టి, ధ్యానం, బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌లు వగైరా చేస్తూ దాన్నీ అదుపులో పెట్టుకోండి. శారీరకరంగా, మానసికంగా ఆరోగ్యంగా అవ్వడమే కాదు.. పొట్టదగ్గర సహా అనవసరం కొవ్వు కరగడం ఖాయం. □

# తొలి మహిళా మావటి !



గుర్రాన్ని అదుపులో పెట్టేందుకు రౌతు, పడవను సజావుగా నడిపేందుకు సరంగు, ఏనుగును సముదాయించి మచ్చిక చేసుకునేందుకు మావటి...వీళ్లతో నిత్య జీవితంలో అరుదుగా తారసపడే వ్యక్తులే. ఎవరి ప్రత్యేకత వారిదే! వీళ్లలో నిత్య చైతన్యవంతులైన మగ మహా పురుషులు మాత్రమే ఉంటారని ప్రతీతి. కానీ అనుకోకుండా ఏనుగులను మచ్చిక చేసుకుని దారికి తెచ్చే ఓ మహిళామణి తారస పడిందంటే నమ్మండి ఆమె 'హస్తికన్య' లేదా 'ఏనుగు కూతురు' అనే మారు పేర్లతో పిలువబడుతోంది. పార్వతి బారువా భారతదేశపు తొలి మహిళా ఏనుగు మావటిగా 'పద్మశ్రీ' అవార్డుకూడా అందుకుంది. కోక్రాఝార్ జిల్లాలోని కచుగావ్ అడవుల నుండి తన మొదటి ఏనుగును ఇంటికి తీసుకువచ్చినప్పుడు ఆమె వయస్సు 14 సంవత్సరాలే. పురుషాధిక్యత ఉన్న ఇలాంటి రంగంలోకి ఓ యువతి ప్రవేశించి సాహసోపేత జీవితాన్ని అనుభవిస్తోందంటే వారి ప్రతిభా నైపుణ్యాలను గుర్తించవలసిందే ! బారువా ఏనుగులతో తనకున్న బంధాన్ని అద్వితీయంగా మలచు కొన్నారు. పార్వతి బారువా 1953, మార్చి 14న అసోంలోని గౌరీపూర్ రాజ కుటుంబంలో, అధికారాన్ని చేపట్టిన చివరి వ్యక్తి దివంగత ప్రకృతీశ్ చంద్ర బారువా దంపతుల గారాలపట్టి రాజకీయ శాస్త్రంలో పట్టభద్రురాలైనా పార్వతికి వన్య ప్రాణుల పట్ల, ముఖ్యంగా ఏనుగుల పట్ల ఎల్లప్పుడూ ఆసక్తి ఉండేదని చేపుతారు. ఆమె తండ్రికి ఏనుగుల గురించి ఒక అతీంద్రియ అవగా హన ఉండేది. ఆమె చిన్నతనంలో తండ్రి దట్టమైన అడవుల్లోకి తీసుకు వెళ్లేవారు వన్య మృగాలను సైతం వారు ఆప్యాయతతో పలకరిస్తారు. ఆ కుటుంబానికి రాజశాలలో 40 ఏనుగులు ఉండేవట. 1975 నుండి 1978 వరకు, పార్వతి అసోం, ఉత్తర బెంగాల్ అడవుల లో అమలులో ఉన్న, ఉచ్చుతో అడవి ఏనుగులను పట్టుకునే సాంప్రదాయ అస్సామీ పద్ధతి 'మేళా శిఖర్' ద్వారా 14 అడవి ఏనుగులను మచ్చిక చేసుకుంది. ఆమె 500కు పైగా ఏనుగులకు శిక్షణ కూడా ఇచ్చిం దన్న రికార్డులున్నాయి. పార్వతి ఇప్పుడామెకు 70 ఏళ్లు దినచర్యలో తన ఏనుగులకు స్నానం చేయించడం, అడవిలో వాటిపై స్వారీ చేయడం, వాటికి శిక్షణ ఇవ్వడం వంటివి చోటు చేసుకుని ఉంటాయి. తన మూడు ప్రియమైన ఏనుగులు లక్ష్మీమాల, ఆలోక, కంచన్‌మాలల కోసం ఆమె ఎంతో ఇష్టంగా బియ్యంతో చేసిన 'హాడియా' అనే ఒక రకమైన తియబండారాన్ని తయారు చేసి తినిపిస్తుంది. మద్యం అంటే కూడా వాటికి బాగా ఇష్ట మట. బీహార్, పశ్చిమ బెంగాల్, అసోం వంటి రాష్ట్రాలు అదుపు తప్పిన ఏనుగుల ను అదుపు చేయడానికి లేదా గాయపడిన, అనారోగ్యంతో ఉన్న వాటి సంరక్షణ కోసం ఆమె సహాయాన్ని కోరతాయి. పార్వతి బారువా పద్మశ్రీ పురస్కార గ్రహీత. ఆమె ఐక్యరాజ్య సమితి పర్యావరణ కార్యక్రమం పురస్కా రాన్ని కూడా అందుకున్నారు. ఏనుగుల కోసం ఆమె చేసిన జీవితాల సేవకు, అసోం ప్రభుత్వం ఆమెను 'అసోం గౌరవ ప్రధాన ఏనుగుల సంరక్షకురాలి'గా సత్కరించింది. కోల్‌కతా అంతర్జాతీయ వన్యప్రాణి పర్యావరణ చలనచిత్రోత్సవం ఆమెకు జీవిత సాఫల్య పురస్కారాన్ని, అలాగే అపరాజిత 2023 చిత్రానికి 'నేచర్స్ వారియర్' జ్యూరీ అవార్డును కూడా ప్రదానం చేసింది. □



# సుబ్రహ్మణ్యుడు



రాహు కేతు దోషం ఆయా జాతకులను అనేక రకాల ఇబ్బందులకు గురిచేస్తూ ఉంటుంది. అందువలన రాహు కేతు దోషం నుంచి విముక్తులు కావడానికి ఎవరికి వారు ప్రయత్నిస్తుంటారు. కుమారస్వామి ..సుబ్రహ్మణ్య స్వామిగా పిలవ బడుతూ ఉంటాడు. సుబ్రహ్మణ్యుడు .. నాగులకు అధిపతి. అందు వలన ఆయనకి పూజాభిషేకాలు జరపడం వలన నాగులు శాంతిస్తాయి. ఫలితంగా రాహు కేతు దోష నివారణ జరుగుతుందని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. 'సుబ్రహ్మణ్యస్వామికి 'మంగళ వారం' అభిషేకం చేయడం వలన ఈ దోషం తొలగిపోతుంది. ఇక ఈ దోషంతో బాధపడుతున్నవారు, దుర్గాదేవిని .. గణపతిని పూజించడం వలన కూడా మంచి ఫలితం కనిపిస్తుంది. రాహువుకు అమ్మవారు అధిదేవత .. అలాగే కేతువు అధిష్ఠాన దైవం గణపతి. అందువలన రాహు కేతు దోషంతో నానా ఇబ్బందులు పడుతున్నవారు దుర్గాదేవి గణపతులను పూజించినట్టయితే, ఆ దోషం తొలగిపోతుందని ఆధ్యాత్మిక గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి.

# ఆరాకనే మడతపెట్టి..




ఉతికిన వెంటనే ఆరేయండి.చేత్తో ఉతికినా లేదా వాషింగ్ మిషన్‌లో ఉతికినా.. బట్టలను మడతలు పడేలా బకెట్‌లో ఎక్కువ సేపు అలాగే ఉంచ కూడదు. తడి బట్టలు బకెట్‌లో ఎక్కువ సేపు ఉంటే వాటి నుంచి దుర్వాసన వస్తుంది.దుస్తుల మధ్య గ్యాప్ ఇవ్వండి: బట్టలు ఆరేసేటప్పుడు ఒకదానికొకటి తాకకుండా కొంత దూరం (గ్యాప్) ఉండేలా ఆరేయాలి. దీనివల్ల గాలి బాగా తగిలి బట్టలు త్వరగా ఆరడానికి దోహదపడుతుంది.ఫ్యాన్ లేదా కిటికీల దగ్గర ఆరేయండి. ఇంట్లో బాల్కనీ ఉంటే బయట ఆరేయడం మంచిది. బయట వర్షం పడుతుంటే కిటికీల దగ్గరగాని లేదా గాలి ఎక్కువగా వచ్చే ప్రాంతాల్లో, ఇంట్లోనే ఫ్యాన్ కింద ఆరేస్తే త్వరగా ఆరిపో తాయి. మందపాటి బట్టలను ఉదయమే ఉతకండి. దుప్పట్లు, జీన్స్ పాంట్లు, టవల్స్ వంటి మందపాటి బట్టలను ఉదయమే వీలైనంత త్వరగా ఉతకాలి. రోజంతా గాలి తగలడం వల్ల ఇవి బాగా ఆరే అవకాశం ఉంటుంది.తేమ ఉన్న బట్టలను అల్మారాలో పెట్టవద్దు. బట్టలు కొద్దిగా తడిగా ఉన్నా లేదా లైట్‌గా తేమ ఉన్నా కూడా అల్మారాలో పెట్టకూడదు. అలా పెడితే దుర్వాసన వస్తుంది.. కాబట్టి బట్టలు పూర్తిగా ఆరిన తర్వాత మాత్రమే మడతపెట్టి దాచు కోవాలి. అల్మారాలకు గాలి తగ^లని వ్వండి.వర్షా కాలంలో అల్మా రాలను అప్పుడ ప్పుడు తెరిచి ఉంచడం వల్ల లోపల ఉండే తేమ తగ్గి, బట్టల కు బూజు పట్ట కుండా.. వాసన రాకుండా ఉంటుంది. తడి, పొడి బట్టలను కలపకండి. ఉతికిన తడి బట్టలతో పాటు పొడి బట్టలను కలిపి ఆరేయడం గానీ, ఉంచడంగానీ చేయకూడదు. దీనివల్ల పొడి బట్టలకు కూడా తడి వాసన పడుతుంది. అవసరానికి తగినట్లే ఉతకండి.వర్షాల సమయంలో బట్టలు ఆరడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి, ఒకేసారి ఎక్కువగా ఉతకకుండా అవసరమైన మేరకే ఉతికితే ఆరేయడం.. చాలా తేలికవుతుంది. భారం కూడా ఉండదు.బట్టలు ఉతికేటప్పుడు చివరి రిన్స్‌లో కొద్దిగా ఫ్యాబ్రిక్ కండిషనర్ లేదా బట్టలకు అనువైన క్రిమినాశక లిక్విడ్ ఉపయోగిస్తే తడి వాసన తగ్గడానికి సహాయ పడుతుంది. అలాగే బట్టలు పూర్తిగా ఆరిన తర్వాతే మడతపెట్టి అల్మారాలో పెట్టడం అలవాటు చేసుకోవాలి.ఈ చిన్నచిన్న చిట్కాలు పాటిస్తే.. వర్షాకాలంలోనూ మీ బట్టలు త్వరగా ఆరిపోవడంతో పాటు తాజాగా, దుర్వాసన లేకుండా ఉంటాయి.□

## చిట్కాలు

✦ముఖ కండ రాలను యథా స్థితికి తెచ్చి చర్మంపై వుండే ముడతలను పోగొట్టి వృద్ధాప్య ఛాయాలను పోగొడు తుంది. ధర్మో స్టాటిక్ చికిత్స.
✦ ధర్మోడైనమిల్ చికిత్స జారిపోయిన చర్మాన్ని బిగుతుగా చేస్తుంది. ఎండి పోయిన తర్వాత ముఖాకృతిలో ఊడి వస్తుంది. ఈ చికిత్సవల్ల వయస్సును పదినుండి 5 సంవత్సరములకు తగ్గినట్లు చేయవచ్చును. ✦ వామును ఉప్పు నమిలి నీరు త్రాగిన కడుపునొప్పి తగ్గును.
✦ నోటి చప్పదనం తగ్గిపోవాలంటే ధనియాల కషాయం త్రాగండి. □

## తెర

# 'కొరియన్ కనకరాజు' మంచి ఫన్ సినిమా: మేర్లపాక గాంధీ



**కొరియన్ కనకరాజు కథ ఎలా మొదలైంది?**
నేను కొంత మంది ఫ్రెండ్స్‌తో కలిసి అనంతపురం మీదుగా ఒక పెళ్లికి వెళ్లాను. రాత్రి సమయంలో కియా ఫ్యాక్టరీ దగ్గర ఆగాం. ఆ ప్రదేశం విజువల్‌గా చాలా బాగుంది. అక్కడ పని చేసే కొరియన్ల కోసం ప్రత్యేకంగా ఒక కమ్యూనిటీ, వాళ్ల కల్చర్‌కు తగ్గ రెస్టా రెంట్లు, మార్కెట్లు ఉన్నాయని తెలిసింది. అనంత పురం లాంటి చోట కొరియన్లు ఉండడం, వాళ్ల కోసం ప్రత్యేకమైన కల్చర్ ఏర్పడడం నాకు చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది.
**ఈ కథను ముందుగా వరుణ్ తేజ్ కోసమే అనుకున్నారా?**
మొదట ఆయన కోసం మరో కథ అనుకున్నాను. అది చెప్పిన తర్వాత ఈ కొరియన్ పాయింట్ కూడా చెప్పాను.ఆయనకు బాగా నచ్చి దీన్ని డెవలప్ చేయమన్నారు. పూర్తి స్క్రిప్ట్ సిద్ధమైన తర్వాత మళ్లీ వినిపించాను. వరుణ్ తేజ్ నాకు నటుడిగా చాలా ఇష్టం.
**మీ సినిమాల మధ్య చాలా గ్యాప్ వస్తుంటుంది. కారణం?** నేను ఒకేసారి చాలా కథల మీద పని చేస్తుంటాను. కొన్నిసార్లు కొంత దూరం వచ్చాక ఆ కథ నాకే నచ్చదు. అప్పుడు దాన్ని పక్కన పెట్టిమరో కథ మొదలుపెడతాను.
**మీ నాన్నకూడా కథా రచయితే కదా. ఆయన కథతో సినిమా చేయొచ్చు కదా?**
నిజమే. మా నాన్నకథతో సినిమా చేయాలనే ఆలోచన ఉంది. కానీ ఆయన టేస్ట్‌కు, నా టేస్ట్‌కు తేడా ఉంటుంది. ఆయనకు రొమాంటిక్ కథలు ఇష్టం.
**రితిక పాత్ర గురించి చెప్పండి?**
ఈ సినిమాలో రితిక కొరియన్ ఫ్యాక్టరీలో పని చేస్తుంది. ఆమెకు కొరియన్ కల్చర్ అంటే చాలా ఇష్టం. నిజానికి తనకి కొరియన్ భాష కూడా తెలుసు. ఆమె లుక్ కూడా ఆ కల్చర్‌కు బాగా మ్యాచ్ అవుతుంది.
**తమన్ మ్యూజిక్ గురించి?**
తమన్ అద్భుతమైన సంగీతం ఇచ్చారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలకు చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది.
**మిగతా పాత్రల గురించి?**
ఇది పూర్తిగా ఫన్ ఎంటర్‌టైనర్. సత్య, మురళీధర్ గౌడ్, సునీల్.. ఇలా ప్రతి పాత్ర కూడా చాలా ఫన్నీగా ఉంటుంది. ఇందులో మాఫియా డాన్ ఉన్నా అది కూడా సీరియస్ ట్రీట్‌మెంట్‌లో కాదు. ఫన్‌తోనే నడుస్తుంది.
**మీ డ్రీమ్ ప్రాజెక్ట్ ఏది?**
ప్రస్తుతం నా డ్రీమ్ ప్రాజెక్ట్ కొరియన్ కనకరాజు.
**ఏ హీరోతో పని చేయడం మీకు ఎక్కువ కంఫర్ట్‌గా ఉంటుంది?**నేను ప్రతి హీరోతో స్క్రిప్ట్ స్టేజ్ నుంచే వాళ్లను ఇన్వాల్వ్ చేస్తాను. వాళ్ల సలహాలు, సూచనలు కూడా తీసుకుంటాను.
**వరుణ్ తేజ్‌తో ఈ సినిమా ఎలా మొదలైంది?**
వరుణ్ తేజ్ ఒక ఎంటర్‌టైనింగ్ జానర్ సినిమా చేయాలనుకుంటున్నారని నిర్మాత రాజీవ్‌రెడ్డి ద్వారా తెలిసింది. అప్పుడు ఈ కథను ఆయనకు చెప్పాను. యూవీ వంశీ, రాజీవ్ రెడ్డి ఈ మీటింగ్ ఏర్పాటు చేశారు.

# ప్రొడక్షన్ నెం 2 టైటిల్ 'అలియాస్ రుక్మిణి' వీడియో రిలీజ్



' నేచురల్ స్టార్ నాని సమర్పణలో తెరకెక్కిన 'కోర్ట్ - స్టేట్ వర్సెస్ ఎ నోబడీ' ఘన విజయానంతరం ఆయన యూనానిమస్ ప్రొడక్షన్స్ రెండో చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. నితిన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని తాజాగా సాంప్రదాయ పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. ముహూర్తపు సన్నివేశానికి నాని క్లాప్ కొట్టగా, నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. నాని గంటా రాంబాబు, నిర్మాత వెంకట్ బోయనపల్లి స్క్రిప్ట్‌ను చిత్ర బృందానికి అందజేశారు. 'కోర్ట్' దర్శకుడు రామ్ జగదీష్, శైలేష్ కొలను కలిసి తొలి షాట్‌కు దర్శకత్వం వహించారు. నాని మాట్లాడుతూ: యూనానిమస్ ప్రొడక్షన్స్ రెండో చిత్రం 'అలియాస్ రుక్మిణి' పూజా కార్య క్రమంతో ఈ రోజు ప్రారంభమవడం చాలా ఆనందంగా ఉంది. నా కెరీర్ ప్రారంభం నుంచే, నేను సక్సెస్ కాకముందే నితిన్ నాకు ఎంతో సపోర్ట్ చేశారు. హీరో నితిన్ మాట్లా డుతూ: ఈ రోజు మా సినిమా ముహూ ర్తం జరగడం చాలా ఆనందంగా ఉంది. నాని సమర్పణలో, దీప్తి నిర్మాణంలో, మురళీకాంత్ దర్శకత్వంలో ఈ సినిమా నా కెరీర్‌లో ఎంతో ప్రత్యేకమైన చిత్రంగా నిలుస్తుంది. దర్శకుడు మురళీకాంత్ దేవసోత్ మాట్లాడుతూ: ఈ రోజు నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ కథను నాని అన్నకు చెప్పిన వెంటనే 'చేద్దాం' అని చెప్పడంతో ఈ ప్రయాణం మొదలైంది. అప్పటి నుంచి అన్నీ చాలా అందంగా జరుగుతున్నాయి. నితిన్ అన్న ఈ సినిమాలో భాగం కావడం నా కల నిజమైనట్టే. అదే సమయంలో బాధ్యత కూడా మరింత పెరిగింది. నిర్మాత దీప్తి గంటా మాట్లాడుతూ: కొన్ని కథలు విన్న వెంటనే ఇది ప్రత్యేకమైన సినిమా అవుతుంది అనే ఫీలింగ్ వస్తుంది.

# 'అనకాపల్లి' ఫ్యామిలీ డ్రామాగా రూపొందించాం : నిర్మాతలు త్రినాథరావు నక్కిన, కాండ్రేగుల నాయుడు..



**కాండ్రేగుల నాయుడుతో మీకున్న బంధం గురించి చెప్పండి?..**
త్రినాథరావు నక్కిన..నాయుడు అనకాపల్లిలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తుంటాడు. ఇండస్ట్రీలోకి వస్తానని నాతో ఎప్పుడూ అంటూ ఉండేవాడు. కానీ నేను మాత్రం వద్దు అని అనేవాడ్ని. చివరకు పట్టుదలతో ఇక్కడకు వచ్చి నిర్మాత అయ్యాడు.
**అనకాపల్లికథను ఇప్పుడు చేయడానికి గల కారణం ఏంటి?..**
..త్రినాథరావు నక్కిన.. : అనకాపల్లికథను నేనే రాసుకున్నాను. కానీ తీయకుండా అలా పెట్టేశాను. దర్శకుడిగా జర్నీ మొదలైన తర్వాత సమీకరణాలు మారుతూ వచ్చాయి. అందుకే నా దగ్గర ఉన్న మంచి కథల్ని భవ్య శ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్ బ్యానర్ల మీద తీయాలని అనుకుంటున్నాం.
**అనకాపల్లిలో షూట్ చేసిన అనుభవం గురించి చెప్పండి?..**
కాండ్రేగుల నాయుడు.. : మా సొంత ఊర్లో షూట్ చేయడంతో మాకు బాగా కలిసి వచ్చింది.
**కథా చర్చల్లో మీ పాత్ర ఎంత ఉంది?..**
..కాండ్రేగుల నాయుడు.. : త్రినాథరావు చెప్పిన ఈ కథ నాకు చాలా నచ్చింది. కథ విన్న వెంటనే ప్రాజెక్ట్‌కి ఓకే చెప్పేశాను.
**ఈ సినీ జర్నీ మీకు ఎలా అనిపించింది?..**
కాండ్రేగుల నాయుడు.. : సొంతూరిలో మా సినిమాని తీయడం నాకెంతో ఆనందం గా అనిపించింది. మొత్తం 75 లొకేషన్లలో చిత్రీకరించాం. **అనకాపల్లిలోని మెయిన్ పాయింట్ ఏంటి?..** త్రినాథరావు నక్కిన.. : ఇప్పుడున్న జెన్ జీ తరానికి ఎమోషన్స్ తెలియడం లేదు. ఫ్యామిలీ ఎమోషన్స్‌ని మళ్లీ అందరికీ తెలియాలని, గుర్తించాలని ఈ మూవీని తీశాం.
**అనుకున్న బడ్జెట్‌లోనే సినిమాని తీశారా? ఓటీటీ డీల్ పూర్తయిందా?..**
..త్రినాథరావు నక్కిన.. : నేనూ ఓ దర్శకుడినే అవ్వడంతో ఈ సినిమాకి ఎక్కడెక్కడ ఏం అవసరం పడిందో అక్కడక్కడ బడ్జెట్ పెంచుకుంటూ వెళ్లాను. .
**ఆగస్ట్ 7న గట్టి పోటీ ఉంది కదా?..**
..త్రినాథరావు నక్కిన.. : ముందు మేం ఆగస్ట్ 7న ఫిక్స్ అయ్యాం. అప్పుడు ఈ చిత్రాలన్నీ లేవు. అయితే ఎప్పుడు వచ్చినా కూడా ఏదో ఒక సినిమా పోటీలో ఉంటుంది. **దర్శకుడి గురించి చెప్పండి?..**
త్రినాథరావు నక్కిన.. : ఖగేష్ నాకు పదేళ్ల నుంచి తెలుసు. నాకు తమ్ముడిలాంటివాడు.

# 'దందా'లో పవర్‌ఫుల్ డైలాగ్స్ ఉన్నాయి: డైరెక్టర్ ఆదిత్య దేవులపల్లి



**మీ బ్యాక్‌గ్రౌండ్ గురించి చెప్పండి?..**
నేను చదువులో టాపర్‌నే, కానీ చిన్నప్పటి నుంచీ నాకు సినిమా లంటే పిచ్చి ఇష్టం. ఆ ప్యాషన్ తోనే ఇంజనీరింగ్ మధ్యలోనే వది లేసి రాడికల్ డిసిషన్ తీసు కున్నా. ఇంట్లో కెమెరా మీద ఉన్న ఆసక్తిని చెప్పడంతో ఓ చిన్న కెమెరా కొనిచ్చారు.
**చాయ్ షాట్స్‌లోకి ఎంట్రీ ఎలా జరిగింది?..**
నేను చెప్పిన కథ అనురాగ్ అన్నకి బాగా నచ్చింది. "తెలుగులో సాధారణంగా ఇలాంటి కథను తీసే ధైర్యం ఎవరూ చేయరు అని చెప్పారు. ఆ తర్వాత మళ్లీ నన్ను పిలిచి మాట్లాడారు.
**'దందా'కథలో మీ ప్రమేయం ఎంతవరకు ఉంది?..**
ఒరిజినల్ కథను విజయ్ కుమార్ రాశాడు, కానీ అందులో కొన్ని లోపాలుఉన్నాయి. నేను మొత్తం రీరైట్ చేసి కథకు ఒక కంప్లీట్‌నెస్ తీసుకొచ్చా.
**దందాకి వస్తున్న రెస్పాన్స్ అండ్ అప్రిషియేషన్ ఎలా ఉంది?..**
ఇప్పటివరకు దందాకి ఒక్కటంటే ఒక్క నెగెటివ్ రివ్యూ కూడా రాలేదు! ప్రతీ ఒక్కరూ ఈ ఫ్రెష్ మేకింగ్ స్టైల్, స్ట్రాంగ్ కంటెంట్‌ను విపరీతంగా పొగుడుతున్నారు.
**సొంత కథ కాకుండా దందాతోనే డైరెక్టర్‌గా ఎందుకు డెబ్యూ చేశారు?..**
నాకు పూరీ జగన్నాథ్, రామ్‌గోపాల్ వర్మ, ఉపేంద్ర లాంటి డైరెక్టర్ల మేకింగ్ అన్నా, ఆటిట్యూడ్ అన్నా చాలా ఇష్టం.
**డైలాగ్స్ గురించి చెప్పండి?..**
ఈ పవర్‌ఫుల్ డైలాగ్స్ అన్నీ అరవింద్ క్యారెక్టర్ జర్నీ నుంచే పుట్టుకొచ్చాయి.
**కాస్టింగ్ సెలెక్షన్ ఎలా జరిగింది?..**
అరవింద్ పాత్ర కోసం చాలామందిని అనుకున్నాం, ఫైనల్‌గా దొరసాయి తేజను ఒకే చేశాం. ఆరంభంలో అతని చుట్టూ ఉన్న కాంట్ర వర్సీలు చూసి కొన్ని అనుమానాలు ఉండేవి,
**దందా సక్సెస్‌పై మీ పేరెంట్స్ రియాక్షన్ ఏంటి?..**
నాలో ఉన్న ఈ ఫైర్ మా అమ్మ నుంచి వచ్చిందే! ఆమె తరచూ చెప్పే రాజు కంటే మొండోడే బలవంతుడు అనే డైలాగ్‌నే సిరీస్‌లో వాడాను. మా నాన్నకి హీస్ట్ సినిమాలు అంటే పిచ్చి ఇష్టం.



యంగ్ టాలెంటెడ్ హీరో, ప్యాషనేట్ ప్రొడ్యూసర్ రాకేష్ వర్రే చేస్తున్న కొత్త సినిమా "మాయలేడి". ఈ సినిమాలో రాకేష్ వర్రే హీరోగా నటిస్తూ క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. రాకేష్ వర్రే గతంలో క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఎవరికీ చెప్పొద్దు, పేకమేడలు వంటి కంటెంట్ ఓరియెంటెడ్ మూవీస్ నిర్మించి అందరి ప్రశంసలు పొందారు.

# 'మాయలేడి' మూవీ గ్లింప్స్ రిలీజ్

ఇప్పుడు "మాయలేడి"తో మరో ఇంట్రెస్టింగ్ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సినిమాను దర్శకుడు ప్రశంకర్ రూపొందిస్తున్నారు. మధుమిత సర్కార్ హీరోయిన్ గా నటిస్తోంది. త్వరలోనే "మాయలేడి" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు "మాయలేడి" సినిమా గ్లింప్స్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ గ్లింప్స్ ఎలా ఉందో చూస్తే హీరోయిన్ గురించి తెలుసుకున్నా కొద్దీ ఆమె పట్ల హీరోలో మరింత ఆసక్తి పెరుగుతుం టుంది. ఆ అమ్మాయి గురించి తెలిసే కొద్దీ ఇంకా ఎక్కువగా ఇష్టపడతాడు. ఈ జంట లవ్ ప్రపోజ్ చేసుకుని సంతోషంగా ఉన్న సమయంలో హీరోయిన్ గురించి కొత్త కొత్త విష యాలు తెసుకుంటాడు హీరో. తమ మధ్యకు ఎవరైనా వస్తే ఊరుకోనంటూ.. హీరోయిన్ యాక్షన్ తో సత్తా చూపిస్తుంది. హీరో హీరోయిన్స్ ఇద్దరూ కలిసి తమ శత్రువులతో ఫైట్ చేయడం గ్లింప్స్ కు హైలైట్ గా నిలుస్తోంది. గ్లింప్స్ చివరలో హీరో చెప్పిన ఇప్పుడు నా లవ్ స్టోరీలో విలన్ ఎవరో తెలుస్తోంది.. అనే డైలాగ్ క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. ఈ గ్లింప్స్‌లో హీరో రాకేష్ వర్రే ఫ్రెష్ లుక్‌లో కనిపించి ఆకట్టుకున్నారు.

# KJQ చాలా డిఫరెంట్ సినిమా: దీక్షిత్ శెట్టి



KJQ మంచి కంటెంట్ ఉన్న యూనిక్ సినిమా. ఎమోషన్స్ ఖచ్చితంగా కనెక్ట్ అవుతాయి: హీరో శశి ఓదెల సక్సెస్ ఫుల్ నిర్మాత సుధాకర్ చెరుకూరి KJQ సినిమాస్ బ్యానర్ పై నిర్మించిన పీరియడ్ క్రైమ్ డ్రామా KJQ (కింగ్ జాకీ క్వీన్). 1990ల నాటి నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో 'దసరా', 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రాలతో గుర్తింపు పొందిన దీక్షిత్ శెట్టి హీరోగా నటిస్తున్నారు. వీరితో పాటు నూతన నటుడు శశి ఓదెల, యుక్తి తరేజా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గత ఏడాది కన్నుమూసిన దర్శకుడు రీరీ(కిరణ్ )కి ఇది చివరి చిత్రం. ప్రెస్ మీట్‌లో హీరో దీక్షిత్ శెట్టి మాట్లాడుతూ: నేను చేసిన ప్రతి సినిమాను మీరు ఎంతగానో ఆదరించారు. ఈ సందర్భంగా మీ అందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ప్రతి సినిమా రిలీజ్ సమయంలో ఒక ఎక్సైట్మెంట్, ఒక భయం ఉంటుంది. కానీ ఈసారి మాత్రం చాలా బాధగా ఉంది. సినిమా విడుదల సమయంలో దర్శకుడు మన మధ్య లేకపోవడం... సినిమా తండ్రి లేని కొడుకులా అనిపిస్తోంది. అందరికీ థ్యాంక్యూ సో మచ్.హీరో శశి మాట్లాడుతూ: KJQ చాలా మంచి సినిమా. రెగ్యులర్ సినిమాలకు భిన్నంగా ఉండే చిత్రమిది. తప్పకుండా ప్రతి ఒక్కరికీ నచ్చుతుందని నమ్మకం ఉంది. డెఫినెట్‌గా థియేటర్‌లో చూసి మీ హానెస్ట్ ఒపీనియన్ చెప్పండి. కిరణ్ గారు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం. ఆయన విజన్‌ను తెరపైకి తీసుకురావడానికి మేమంతా ఎంతో ప్యాషన్‌తో పనిచేశాం. హీరోయిన్ యుక్తి తరేజా మాట్లాడుతూ: మా సినిమాను సపోర్ట్ చేస్తున్న ప్రతి ఒక్కరికీ థ్యాంక్యూ. కిరణ్ గారు చాలా పెద్ద విజన్‌తో ఈ సినిమాను తెరకెక్కించారు. రిలీజ్ సమయంలో ఆయన మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం.

ఆట

# సన్‌రైజర్స్ ప్రక్షాళన

## ఐదుగురు ప్లేయర్లు ఔట్



**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఊరించి ఊసురుమనిపించింది. అద్వితీయమైన ప్రదర్శనతో ప్లే ఆఫ్స్ చేరిన ఆరెంజ్ ఆర్మీ కీలక ఎలిమినేటర్‌లో చేతులెత్తేసి ఇంటిబాట పట్టింది. టైటిల్ అందుకోకపోయినా అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. తృటిలో టైటిల్ అందుకునే అవకాశం కోల్పోయిన ఆరెంజ్ ఆర్మీ వచ్చే ఏడాది మరింత బలంగా తిరిగి రావాలనే పట్టుదలతో ఉంది. తదుపరి సీజన్ కోసం జట్టును బలోపేతం చేయడంపై కావ్యమారన్ నేతృత్వంలోని సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. ఐపీఎల్ 2027 మినీ వేలం ఈ ఏడాది నవంబర్ లేదా డిసెంబర్ తొలి వారంలో జరిగే వీలుండటంతో జట్టుకు భారంగా ఉన్న ఐదుగురు ఆటగాళ్లను వదిలేయనుంది. ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్‌ను వదిలేయనుంది. మినీవేలంలో అన్‌సోల్డ్ లివింగ్ స్టోన్‌ను చివరి నిమిషంలో ఆరెంజ్ ఆర్మీ రూ.13 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. కానీ అతనికి తుది జట్టులో అవకాశాలు ఇవ్వకుండా రెండు మ్యాచ్‌ల్లో ఇంపాక్ట్ ప్లేయర్‌గా వీలు కల్పించినా 15 పరుగులు మాత్రమే చేసి ఒక్క ఓవర్ కూడా బౌలింగ్ చేయలేదు. దీంతో అతన్ని వదిలేసి ఆల్‌రౌండర్ కొనుగోలుకు సన్‌రైజర్స్ భావిస్తోంది. ఇక సీనియర్ పేసర్‌గా జట్టు బౌలింగ్ విభాగాన్ని నడిపిస్తాడని ఆశించిన జయదేవ్ ఉనాద్కత్ నిరాశపర్చాడు. పేలవ బౌలింగ్ ప్రదర్శనతో తుది జట్టులో చోటు కూడా కోల్పోయాడు. 4 మ్యాచ్‌లు మాత్రమే ఆడి 4 వికెట్లే తీసాడు. 10.91 ఎకానమీతో ధారళంగా పరుగులిచ్చుకున్నాడు. స్పిన్ ఆల్‌రౌండర్ జీషన్ అన్సారీకి కూడా గుడ్‌బై చెప్పనుంది. ఈ ఐపీఎల్‌లో ఒక్క అవకాశం కూడా ఇవ్వలేదు. యువ స్పిన్నర్లు శివాంగ్ కుమార్, హర్ష్ దూబే సత్తా చాటడంతో జీషన్ అన్సారీ పూర్తిగా బెంచ్‌కే పరిమితమయ్యాడు. దీంతో అన్సారీని వదిలేసి యువ స్పిన్నర్‌ను ఎంచుకోవాలనే యోచనలో సన్‌రైజర్స్ ఉంది. హర్షల్ పటేల్ ప్రదర్శనపై కూడా అసంతృప్తిగా ఉంది. ఐపీఎల్‌లో 5 మ్యాచ్‌లు ఆడిన హర్షల్ 10.83 ఎకానమీతో ధారళంగా పరుగులిచ్చుకున్నాడు. తొలి నాలుగు మ్యాచ్‌ల్లో 11.48 ఎకానమీతో పరుగులు సమర్పించుకొని తుది జట్టులో చోటు కోల్పోయాడు. 2 మ్యాచ్‌లే ఆడిన డేవిడ్ పేన్ ఆర్‌సీబీతో తొలి మ్యాచ్‌లో రెండు వికెట్లు తీసాడు. కానీ కేకేఆర్‌తో మరుసటి మ్యాచ్‌లో తేలిపోయాడు. రెండు మ్యాచ్‌ల్లో 35 పరుగుల చొప్పున సమర్పించుకొని తుది జట్టులో చోటు కోల్పోయాడు.

### మహిళల టి20 ర్యాంకింగ్స్..

# నం.1 బెత్ మూనీ



### ఆరో స్థానానికి చమరి

**న్యూఢిల్లీ:** ఇటీవల ముగిసిన ఐసీసీ మహిళల టీ20 ప్రపంచ కప్‌లో అద్భుత ప్రదర్శనల తర్వాత, ఆస్ట్రేలియా ఓపెనర్ బెత్ మూనీ ఐసీసీ మహిళల టీ20ఐ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. మంగళవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో పాకిస్థాన్‌పై జట్టు సిరీస్ విజయంతో శ్రీలంక కెప్టెన్ చమరి అటపట్టు తాజా ఐసీసీ మహిళల టీ20ఐ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో తన కెరీర్‌లోనే అత్యుత్తమమైన ఆరో స్థానాన్ని సాధించింది. ఆమె నిలకడైన ప్రదర్శనలు ర్యాంకింగ్స్‌లో ఒక స్థానం పైకి ఎగబాకి ఆరో స్థానానికి చేరడంతో పాటు, తన కెరీర్‌లోనే అత్యధిక రేటింగ్ పాయింట్లను కూడా సంపాదించిపెట్టాయి. పాకిస్థాన్‌తో జరిగిన తొలి టీ20లో చిరస్మరణీయమైన అజేయ 101 పరుగులు చేసిన తర్వాత, శ్రీలంకకు చెందిన ఇమేషా దులానీ ర్యాంకింగ్స్‌లో 33 స్థానాలు పైకి ఎగబాకించి, కెరీర్‌లోనే అత్యుత్తమమైన 23వ స్థానానికి చేర్చింది. అలాగే వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో 4స్థానాలు ఎగబాకిన హర్షిత సమరవిక్రమ, 13వ స్థానానికి చేరుకుంది. సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌లో ఆమె చేసిన అజేయ 73 పరుగులు, శ్రీలంక ఎనిమిది వికెట్ల విజయంలో కీలక పాత్ర పోషించాయి. శ్రీలంకకు చెందిన హసిని పెరేరా రెండు స్థానాలు ఎగబాకి 35వ స్థానానికి చేరుకోగా, పాకిస్థాన్‌కు చెందిన గుల్ ఫిరోజా తొమ్మిది స్థానాలు ఎగబాకి 45వ స్థానానికి, కెప్టెన్ ఫాతిమా సనా ఆరు స్థానాలు ముందుకు దూసుకెళ్లి 56వ స్థానానికి చేరుకున్నారు. వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో, పాకిస్థాన్ ఎడమచేతి వాటం స్పిన్నర్ నష్రా సంధు మూడు స్థానాలు ఎగబాకి టాప్10కు చేరుకుంది. శ్రీలంక కెప్టెన్ అటపట్టు కూడా వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఒకస్థానం మెరుగుపడి 31వ స్థానానికిచేరుకోగా, ఆల్‌రౌండర్ కవిషా దిల్‌హరి మూడు స్థానాలు ఎగబాకి 33వ స్థానానికి చేరుకుంది.

### హాండ్రెడ్ ఉమన్ కాంపిటేషన్..

# సదరన్ బ్రేవ్ ఉమన్ తొలి ఓటమి

### జెమీమా మెరుపులు వృథా

**న్యూఢిల్లీ:** హండ్రెడ్ వుమెన్ కాంపిటేషన్‌లో సదరన్ బ్రేవ్ వుమెన్ తొలి ఓటమి చవిచూసింది. సదరన్ బ్రేవ్‌తో జరిగిన మ్యాచ్‌లో వెల్ష్ ఫైర్‌తో ఆఖరి బంతికి విజయాన్ని అందుకుంది. మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సదరన్ బ్రేవ్ వుమెన్ 100 బంతుల్లో 5 వికెట్లు నష్టానికి 121 పరుగులు చేసింది. లారా వోల్వార్ట్ 45 బంతుల్లో 48 పరుగులు, జెమీమా రోడ్రిగ్స్ 21 బంతుల్లో 25 పరుగులతో రాణించారు. వెల్ష్ ఫైర్ బౌలర్లలో హెథర్ గ్రహమ్, గ్రేస్ పాట్స్ చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం వైల్ష్ ఫైర్ నిర్ణీత 100 బంతుల్లోనే 6 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. వెల్ష్ ఫైర్ బ్యాటింగ్‌లో టాపార్డర్, మిడిలార్డర్ విఫలమైన చోట లోయర్ ఆర్డర్‌లో హెథర్ గ్రహమ్ 28 బంతుల్లో 35 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టును గెలిపింది. ఆమెకు గ్రేస్ థాంప్సన్ 16 పరుగు, నిమ్వా హోలండ్ 12 పరుగులతో నాటౌట్‌గా సహకారం అందించారు. సదరన్ బ్రేవ్ బౌలర్లలో టిల్లీ కోర్టిన్ 3 వికెట్లు తీయగా, ఇస్సి వాంగ్ 2 వికెట్లు తీసింది. ఈ విజయంతో వెల్ష్ ఫైర్ 5 మ్యాచ్‌ల్లో రెండో విజయంతో పట్టికలో నాలుగో స్థానంలో ఉండగా, సదరన్ బ్రేవ్ ఓటమి పాలైనప్పటికీ టాప్‌లోనే కొనసాగుతోంది.





### ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో..

# తొమ్మిదో సీడ్‌గా సింధు

### ఐదో సీడ్‌గా సాత్విక్, చిరాగ్ జోడీ

**న్యూఢిల్లీ:** ఈ నెల 17 నుంచి 23 వరకు న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ స్టేడియంలో జరగనున్న 2026 బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌ల కోసం, మహిళల సింగిల్స్ ఈవెంట్‌లో పివి సింధుకు తొమ్మిదో సీడ్ లభించగా, పురుషుల డబుల్స్ జోడీ సత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టిలకు ఐదో సీడ్ లభించింది. ఈ టోర్నమెంట్‌లో భారత్ ఐదు విభాగాలలో ఒక్కోదానిలో రెండు జట్లను బరిలోకి దించుతుంది. వాటిలో నాలుగు విభాగాలలో కనీసం ఒక సీడెడ్ ఆటగాడు లేదా జంట ఉంటుంది. సింధు, మాజీ ఆసియా క్రీడల ఛాంపియన్‌లు అయిన సత్విక్, చిరాగ్‌లతో పాటు, పురుషుల సింగిల్స్ డ్రాలో లక్ష్య సేన్‌కు 14వ సీడ్ లభించింది. ధ్రువ్ కపిల, తనిషా క్రాస్టోల మిక్స్‌డ్ డబుల్స్ జోడీ 15వ సీడ్‌గా ఛాంపియన్‌షిప్‌లలోకి ప్రవేశిస్తుంది. అలాగే షి యుకి మరియు ఆన్ సే యంగ్ సింగిల్స్ సీడింగ్‌లలో ముందున్నారు. ప్రస్తుత పురుషుల సింగిల్స్ ప్రపంచ ఛాంపియన్, చైనాకు చెందిన షి యుకి టాప్ సీడ్‌గా ఎంపిక కాగా, మహిళల సింగిల్స్ విభాగంలో దక్షిణ కొరియాకు చెందిన ఆన్ సే యంగ్ అగ్రస్థానంలో ఉంది. ప్రస్తుత మహిళల సింగిల్స్ ప్రపంచ ఛాంపియన్, జపాన్‌కు చెందిన అకానె యమగుచి రెండవ సీడ్‌గా నిలవగా, ఆ తర్వాత చైనాకు చెందిన వాంగ్ జియి మరియు చెన్ యుఫెయి వరుసగా మూడవ మరియు నాల్గవ స్థానాల్లో ఉన్నారు.


### తొలి స్నేహపూర్వక మ్యాచ్‌లో..

# భారత్ జట్టు గెలుపు

### 3-0తో సింగపూర్ ఓటమి

**న్యూఢిల్లీ:** తొలి స్నేహపూర్వక మ్యాచ్‌లో సింగపూర్‌పై 3-0 తేడాతో భారత్ విజయం సాధించింది. తద్వారా భారత అండర్20 జట్టు, ఏఎఫ్‌సి అండర్20 ఆసియా కప్ చైనా 2027 క్వాలిఫయర్స్‌కు అర్హత సాధించింది. భారత్ తరఫున ఒమాంగ్ డోడుమ్ (45+2) తొలి గోల్ సాధించాడు. 63వ నిమిషంలో సింగమయుమ్ షమీ గోల్ చేసి ఆతిథ్య జట్టుకు 2-0 ఆధిక్యాన్ని అందించాడు. 83వ నిమిషంలో సింగపూర్ చేసిన ఓన్ గోల్ కారణంగా భారత్ 3-0 ఆధిక్యాన్ని కోల్పోయింది. సింగపూర్ అండర్20 జట్టు రెండు స్నేహపూర్వక మ్యాచ్‌ల కోసం భారత పర్యటనలో ఉంది. రెండో మ్యాచ్ ఈ నెల 6వ తేదీన జరగనుంది. కాగా భారత్, సింగపూర్‌ల మధ్య 1966లో తొలిసారిగా ఒక అండర్20 మ్యాచ్‌లో తలపడ్డాయి. ఆ తొలి పోరులో భారత్, సింగపూర్‌ను 4-1 తేడాతో ఓడించింది. 1974లో, ఏఎఫ్‌సీ యూత్ ఛాంపియన్‌షిప్ క్వార్టర్ ఫైనల్‌లో పెనాల్టీ షూటౌట్‌లో భారత్, సింగపూర్‌ను ఓడించింది. ఆ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌ను భారత్ గెలుచుకుంది. భారత్, సింగపూర్ జట్లు అండర్19 ఫుట్‌బాల్‌లో కూడా తలపడ్డాయి. ఇరు జట్లు చెరొక మ్యాచ్ గెలుచుకున్నాయి. కాగా భారత్ ఎఎఫ్‌సి అండర్ 20 ఆసియా కప్ క్వాలిఫికేషన్‌లో గ్రూప్ బి లో ఉన్నారు. వారు ఈనెల 31న జరిగే తమ మొదటి గేమ్‌లో సిరియాతో తలపడతారు. బ్లూ కోల్ట్స్ తమ తదుపరి రెండు గేమ్‌లలో వరుసగా సెప్టెంబర్ 3, 6 తేదీలలో ఉజ్బెకిస్తాన్ మరియు బంగ్లాదేశ్‌లతో తలపడతారు.





# ఎయిర్‌టెల్ నికరలాభం రూ.8167 కోట్లు

### ఆదాయం రూ.58,539 కోట్లు

**ముంబయి,ఆగస్టు 4:** దేశంలో రెండో అతిపెద్ద టెలికాం సంస్థ భారతి ఎయిర్‌టెల్ తొలి త్రైమాసికం ఏకీకృత నికర లాభం 37.3 శాతం పెరిగి రూ.8,167 కోట్లకు చేరుకుంది. కంపెనీ మొత్తం ఆదాయం 18.4 శాతం పెరిగి రూ.58,539 కోట్లకు చేరుకుంది. మాత్రం మార్కెట్ అంచనాలను మించి ఆదాయం నమోదైంది.కంపెనీ లాభాలపై కొన్ని ప్రత్యేక అంశాలు ప్రభావం చూపాయి. గ్రూప్‌కు చెందిన ఒక అనుబంధ సంస్థలో వాణిజ్య వివాదానికి సంబంధించి సూత్రప్రాయ పరిష్కారం కోసం రూ.353.4 కోట్ల ప్రత్యేక కేటాయింపు చేయగా, గత సంవత్సరాలకు సంబంధించిన వ్యాపార నష్టాలపై అనుకూల తీర్పు రావడంతో రూ.389.8 కోట్ల ప్రత్యేక పన్ను ప్రయోజనం కూడా లభించింది.గత త్రైమాసికంతో పోలిస్తే కంపెనీ ఆదాయం రూ.55,383 కోట్ల నుంచి రూ.58,539 కోట్లకు చేరి 5.7 శాతం పెరిగింది. అదే విధంగా నికర లాభం రూ.7,325 కోట్ల నుంచి రూ.8,167 కోట్లకు పెరిగి 11.5 శాతం వృద్ధి నమోదు చేసింది. భారత కార్యకలాపాల పరంగా ఎయిర్‌టెల్ ఆదాయం రూ.41,214 కోట్లకు చేరింది. ఇది గత ఏడాది ఇదే కాలంలోని రూ.37,584 కోట్లతో పోలిస్తే 9.7 శాతం అధికం. మొబైల్ సేవల్లో ప్రీమియం ప్లాన్లకు వినియోగదారులు మారడం, హోమ్ బ్రాడ్‌బ్యాండ్, ఎంటర్‌ప్రైజ్ సేవల్లో బలమైన వృద్ధి ఈ ఫలితాలకు ప్రధాన కారణాలుగా కంపెనీ పేర్కొంది.కంపెనీ మొత్తం ఆదాయంలో 73 శాతం వాటా కలిగిన మొబైల్ సేవల విభాగం ద్వారా రూ.29,928 కోట్ల ఆదాయం లభించింది.



# నైకా నికరలాభం రూ.80 కోట్లు

### రాబడులు రూ.2782 కోట్లు

**ముంబయి,ఆగస్టు 4:** నైకా మాతృసంస్థ ఎఫ్ఎస్ఎన్ ఈకామర్స్ వెంచర్స్ కంపెనీ నికర లాభం రూ.80 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.23.3 కోట్లతో పోలిస్తే ఇది 243.3 శాతం పెరుగుదల. అంచనా వేసిన రూ.83 కోట్ల కంటే స్వల్పంగా తక్కువగా నమోదైంది. కంపెనీ కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం 29 శాతం పెరిగి రూ.2,782 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ.2,155 కోట్లు కాగా, విశ్లేషకుల అంచనా రూ.2,762 కోట్లను కూడా అధిగమించింది.ఆపరేటింగ్ పనితీరు కూడా బలంగా నమోదైంది. కంపెనీ ఈబిట్డా 67.8 శాతం పెరిగి రూ.236 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ.140.7 కోట్లు. మార్కెట్ అంచనా రూ.230 కోట్లను కూడా అధిగమించింది.ఈబిట్డా మార్జిన్ 6.5 శాతం నుంచి 8.5 శాతానికి పెరిగి 200 బేసిస్ పాయింట్ల మెరుగుదలను నమోదు చేసింది. ఇది విశ్లేషకుల అంచనా అయిన 8.3 శాతం కంటే మెరుగ్గా ఉండటం విశేషం. మొత్తం స్థూల వాణిజ్య విలువలు 34 శాతం వృద్ధిని నమోదయ్యాయి. ముఖ్యంగా ఫ్యాషన్ విభాగం అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి నెట్ సేల్స్ వ్యాల్యూ 54 శాతం పెరిగింది. బ్యూటీ విభాగం కూడా 29 శాతం ఎన్ఎస్‌వీ వృద్ధితో స్థిరమైన పనితీరును ప్రదర్శించింది.ఇక వ్యాపార విస్తరణలో భాగంగా అమిను సంస్థలో పూర్తిగా డైల్యూటెడ్ ప్రాతిపదికన 51 శాతం వాటాను గరిష్టంగా రూ.32 కోట్ల పెట్టుబడితో కొనుగోలు చేయడానికి నైకా డైరెక్టర్ల మండలి ఆమోదం తెలిపింది.



### గ్లోబల్ ఏవియేషన్ కంపెనీ ఇండిగో

# ఉద్యోగులనుద్దేశించి కొత్త సిఇఒ తొలి కాల్..

**ముంబయి, ఆగస్టు 4:** ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లిమిటెడ్ ఇండిగో కొత్త సీఈఓగా విల్లీ వాల్ష్ బాధ్యతలు స్వీకరించాక సంస్థ ఉద్యోగులను ఉద్దేశించి తొలిసారి ప్రసంగించారు. ఇండిగో ప్రపంచంలోని అగ్రశ్రేణి విమానయాన సంస్థల్లో ఒకటిగా ఎదగడాన్ని తాను ప్రత్యక్షంగా గమనించానని చెప్పారు.' బలమైన పునాది, స్పష్టమైన వ్యూహం, ప్రాథమిక విలువలను ఎప్పుడూ మరవని సంస్థ సంస్కృతి ఈ విజయానికి కారణమని వాల్ష్ పేర్కొన్నారు.భారతదేశంలోనే అతిపెద్ద విమాన యాన సంస్థగా మాత్రమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా అత్యంత గౌరవనీయమైన ఎయిర్‌లైన్స్‌లో ఇండిగో ఒకటిగా నిలిచిందని ఆయన అన్నారు. కోట్లాది మందికి విమాన ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో ఇండిగో కీలక పాత్ర పోషించిందని ప్రశంసించారు. బ్రిటిష్ ఎయిర్‌వేస్, ఐఏజీ, ఐఏటీఏ వంటి ప్రముఖ సంస్థల్లో పనిచేసిన అనుభవాన్ని ప్రస్తావించిన వాల్ష్, ఒక విమానయాన సంస్థను విజయవంతంగా నిర్మించడం ఎంత కష్టమో తనకు తెలుసని చెప్పారు.గత పదేళ్లలోనే ప్రపంచవ్యాప్తంగా 408 విమానయాన సంస్థలు కార్యకలాపాలు నిలిపివేసిన పరిస్థితుల్లో ఇండిగో సాధించిన విజయాలు నిజంగా అసాధారణమైనవని ఆయన అన్నారు. ప్రయాణికుల విశ్వాసమే ఇండిగో విజయానికి అసలైన బలం అని పేర్కొన్న వాల్ష్ గొప్ప విమానయాన సంస్థను నిర్వచించేది ప్రయాణికుల నమ్మకం, సంస్థ ప్రతిష్ఠ" అని అన్నారు.

# లాభాలకు బ్రేక్.. నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, ఆగస్టు 4:** ఈక్విటీ మార్కెట్లలో కొత్త ట్రేడింగ్ సెషన్ విధానం అమలులోకి వచ్చిన తర్వాత, సెషన్ చివర్లో ఊపందుకున్న స్టాక్ మార్కెట్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ 50 మంగళవారం సెషన్‌లో తీవ్ర నష్టాలను చవిచూశాయి. దీంతో గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న మార్కెట్ లాభాల పరంపరకు బ్రేక్ పడింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య విధాన కమిటీ నిర్ణయాలు వెలువడనున్న నేపథ్యంలో పెట్టుబడిదారులు తీవ్ర అప్రమత్తత వహించడం.. లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం మార్కెట్ పతనానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. చివరకు బీఎస్ఈ సెన్సెక్స్ 210.08 పాయింట్లు క్షీణించి 78,428.95 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సూచీ 159.40 పాయింట్లు పడిపోయి 24,614.90 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ సెషన్ ఆసాంతం బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, ఐటీ స్టాక్‌లు తీవ్ర ఒత్తిడిలోనే కొనసాగాయి. ఈ రంగాలు మార్కెట్ సూచీలలో ఎక్కువ వెయిటేజీ కలిగి ఉండటం వల్ల వాటిలో వచ్చిన అమ్మకాల ఒత్తిడి సూచీల పతనానికి కారణమైంది. ఆర్‌బిఐ ద్రవ్య సమీక్ష కోసం ఎదురుచూస్తున్న పెద్ద పెట్టుబడిదారులు కొత్తగా నిధులు కేటాయించే కంటే వేచి చూసే ధోరణికే మొగ్గు చూపారు. రంగాల వారీగా పరిశీలిస్తే నిఫ్టీ రియల్టీ అత్యధికంగా రెండు శాతానికి పైగా నష్టపోయి అత్యంత బలహీనమైన విభాగంగా నిలిచింది. దీంతో పాటు ఐటీ, సిమెంట్, ఎఫ్ఎంసీజీ, ప్రైవేట్ బ్యాంకింగ్, ఫార్మా, హెల్త్‌కేర్ రంగాలు కూడా బలహీనంగా ముగిశాయి. నిఫ్టీ 50 జాబితాలో గ్రాసిమ్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, హిందుస్తాన్ యూనిలీవర్ షేర్లు అత్యధిక నష్టాలను మూటగట్టుకున్నాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.29 శాతం నష్టంతో ముగియగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ మాత్రం 0.23 శాతం కొద్దిపాటి లాభాన్ని సాధించింది.

వాణిజ్యం



# ఇటిఎఫ్ మార్కెట్‌లోకి జియో

**ముంబయి, ఆగస్టు 4:** ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ మార్కెట్లోకి జియో ఎంట్రీ ఇచ్చింది. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, ప్రపంచంలోనే అతిపెద్ద అసెట్ మేనేజ్మెంట్ కంపెనీ బ్లాక్ రాక్ కలిసి జాయింట్ వెంచర్ జియోబ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్స్ ఏర్పాటుచేసాయి. ఈసంస్థనుంచే తొలి ఈటీఎఫ్ ఫండ్ మార్కెట్లోకి వచ్చింది. జియో బ్లాక్ రాక్ నిఫ్టీ 50 ఈటీఎఫ్ పేరుతో న్యూ ఫండ్ ఆఫర్ తీసుకురావడంతో ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్‌లోకి అడుగుపెట్టింది. జియో బ్లాక్ రాక్ మ్యూచువల్ ఫండ్ మంగళవారం రోజున తొలి ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ జియో బ్లాక్ రాక్ నిఫ్టీ 50 ఈటీఎఫ్‌ను లాంచ్ చేసి పెట్టుబడులను సులభతరం చేసింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ సబ్‌స్క్రిప్షన్ ఇప్పటికే మొదలవగా ఈనెల 11, 2026 వరకు అందుబాటులో ఉంటుంది. నిఫ్టీ 50 ఇండెక్స్‌ను ట్రాక్ చేస్తూ దీర్ఘకాలంలో మూలధన లాభాలు అందించడమే లక్ష్యంగా ఈ ఈటీఎఫ్ ఫండ్ రూపొందించినట్లు జియో బ్లాక్ రాక్ పేర్కొంది.ఒకే పెట్టుబడి ద్వారా ఇన్వెస్టర్లు దేశంలోని 50 అతిపెద్ద లిస్టెడ్ కంపెనీల్లో పెట్టుబడి పెట్టే అవకాశాన్ని ఈ స్కీమ్ కల్పిస్తుందని తెలిపింది. 2026, మార్చి 30 నాటికి ఈ ఇండెక్స్ దేశంలోని మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో 53.7 శాతం మేర ప్రాతినిధ్యం వహించడం గమనార్హం. భారతదేశ ఈక్విటీ మార్కెట్లో కీలకమైన బెంచ్‌మార్క్‌గా నిలిచింది. ఈఫండ్‌లో వచ్చిన నిధులు ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేయనుంది. ఈ ఫండ్ పనితీరును నిఫ్టీ 50 టోటల్ రిటర్న్స్ ఇండెక్స్‌తో పోల్చి చూడనున్నారు.







# ఎల్ఐసిలో 6.5% వాటా విక్రయం

### నేటినుంచే బిడ్డింగ్ షురూ!

**ముంబయి, ఆగస్టు 4:** కేంద్ర ప్రభుత్వం కొంత కాలంగా ప్రభుత్వ సంస్థల్లో పెట్టుబడి ఉపసంహరణలు, వాటా విక్రయం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎన్ఎల్‌సీ ఇండియా, ఎన్‌హెచ్‌పీసీ, కోల్ ఇండియా, ఐఆర్ఎఫ్‌సి,భెల్ ఇలా చాలా సంస్థల్లో ఆఫర్ ఫర్ సేల్ విజయవంతంగా నిర్వహించింది. ఇప్పుడు అతిపెద్ద ప్రభుత్వ రంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో కూడా వాటా విక్రయించేందుకు ఆఫర్ ఫర్ సేల్ ప్రకటించింది కేంద్రం. ఇది బుధవారమే ప్రారంభం కానుంది. మొత్తంగా 6.5 శాతం వాటా విక్రయించాలని నిర్ణయించింది. అయితే అంతా ఒకేసారి కాదు. ముందుగా 2.5 శాతం వాటా విక్రయించనుంది. మరో 4 శాతాన్ని గ్రీన్ షూ ఆప్షన్ కింద వినియోగించనుంది. రెస్పాన్స్ బాగుంటే మిగతా వాటా విక్రయిస్తుంది. నాల్గవ తేదీ నాన్ రిటైల్ ఇన్వెస్టర్లకు షేర్లు కొనేందుకు ఛాన్స్ ఉంటుంది. ఇక్కడ సంస్థాగత ఇన్వెస్టర్లు, హై నెట్ వర్త్ ఇన్వెస్టర్లు పాల్గొంటారు. ఇక రిటైల్ ఇన్వెస్టర్లు బుధవారం రోజు బిడ్స్ దాఖలు చేయొచ్చు. తొలిరోజు అంటే 4న రెస్పాన్స్ బాగుంటే నాన్ రిటైల్ ఇన్వెస్టర్లకు గ్రీన్ షూ ఆప్షన్ కింద మళ్లీ ఆగస్ట్ 5న పార్టిసిపేట్ చేసేందుకు అవకాశం ఉంటుంది.ఆఫర్ ఫర్ సేల్ కింద ఇన్వెస్టర్లకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. సోమవారం సెషన్ ఎల్ఐసీ క్లోజింగ్ ప్రైస్ ఎన్ఎస్ఇలో రూ. 424.40 గా ఉండగా ఇప్పుడు ఫ్లోర్ ప్రైస్ రూ. 382 గా ప్రకటించింది. అంటే కిందటి రోజు ధరతో పోలిస్తే ఏకంగా 10 శాతం డిస్కౌంట్ ప్రకటించింది. ఓఎఫ్ఎస్‌లో మొత్తంగా 6.5 శాతం వాటాకు సమానమైన 82.2 కోట్లకుపైగా షేర్లను అందుబాటులో ఉంచింది. ఇక్కడ పూర్తి స్థాయిలో సబ్‌స్క్రిప్షన్ జరిగితే ఖజానాకు ఏకంగా రూ. 31,400 కోట్లు వచ్చి చేరనున్నాయి. తొలుత 2.5 శాతం వాటాకు సమానమైన 31.6 కోట్ల షేర్లు అందుబాటులో ఉంటాయి. మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నిబంధనల ప్రకారం లిస్టెడ్ కంపెనీల్లో కనీసం 25 శాతం వాటా షేర్లుప్రజలు లేదా సంస్థాగత పెట్టుబడిదారులవద్ద ఉండాలి. దీనినే మినిమం పబ్లిక్ షేర్ హోల్డింగ్ రూల్ అంటారు. గరిష్ఠంగా సంస్థ/ప్రమోటర్ల దగ్గర 75 శాతం వరకు వాటా ఉంచుకోవచ్చు. ప్రస్తుతం 2026 మార్చి నాటికి ఎల్ఐసీలో ప్రభుత్వ వాటానే ఏకంగా 96.5 శాతంగా ఉంది. దీంతో సెబీ మార్గదర్శకాల కింద 26.5 శాతం వరకు వాటా విక్రయిస్తుంది. ఆఫర్‌ఫర్‌సేల్‌ప్రకటించగానే ఎల్ఐసి షేర్లు భారీగా క్షీణించాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.